అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 11-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 09 | సంచిక : 69 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

ఈడీకి మరిన్ని అధికారాలు

కొత్త నిబంధనలతో రెండు నోటిఫికేషన్లు జారీ

- రాజకీయ ప్రముఖులు, ఎన్జీవో సంస్థల 'నిర్వచనం'లో మార్పులు
- ఎప్పుడు కావాలంటే అప్పుడు..ఈడీకి సమాచారం
- సార్వత్రిక ఎన్నికలకు ముందు తాజా ఉత్తర్వులపై సర్వత్రా అనుమానాలు



న్యూఢిల్లీ : 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మోడీ సర్కార్ 'కేంద్ర దర్యాప్తు సంస్థ'లకు మరిన్ని అధికారాల్ని కట్టబెట్టింది. 'మనీ...5లో

తగ్గేదేలేదు..

ఈ దీక్ష ఆరంభం మాత్రమే

- దేశ వ్యాప్త ఉద్యమాలు చేస్తాం : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత
- మహిళలకు భాగస్వామ్యం లేకపోతే సమాజం ముందుకుపోదు : ఏచూరి



న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ల కోసం ఈ నిరాహార దీక్ష ఆరంభం మాత్రమేననీ, ఇకపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని భారత జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. మహిళలకు రాజకీయాల్లో భాగస్వామ్యం కావాలంటే 33శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో పూర్తిస్థాయి మెజార్టీలో ఉన్న బీజేపీ సర్కార్ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించి, చట్టంగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిరాహార దీక్షకు వచ్చిన మహిళల సంతకాలను సేకరించామనీ, సంతకాలతో కూడిన లేఖను ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి పంపిస్తామని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో భారత జాగృతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత నిరాహారదీక్ష చేపట్టారు. ఉదయం 10:30 లకు జాతీయగీతంతో ప్రారంభమైన ఈ దీక్ష, సాయంత్రం 4 గంటలకు ముగిసింది. కవిత దీక్షను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభించగా, సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, బీఆర్ఎస్ ఎంపీ కె. కేశవరావు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 'ధరణిలో సగం, ఆకాశంలో సగం, అవకాశంలో సగం' అనేదే తమ నినాదమని అన్నారు. రాజకీయ క్షేత్రంలోనూ మహిళలకు భాగస్వామ్యం కోసం 33 శాతం రిజర్వేషన్లు తీసుకురావల్సి ఉందన్నారు. 1996 అప్పటి ప్రధాని దేవెగౌడ హయాంలో మహిళా బిల్లు పెట్టినా, అది చట్టం రూపం దాల్చలేదన్నారు. ఆ తరువాత మహిళా బిల్లు ఆమోదం కోసం అనేక పార్టీల మహిళా నేతలు ప్రయత్నాలు చేశారన్నారు. అందులో బృందాకరత్, సోనియా గాంధీ, జయంతి నటరాజన్, సుష్మా స్వరాజ్ ఇతర మహిళా నేతలు ఉన్నారనీ, వారు చేసిన పోరాటానికి సెల్యూట్ చేస్తున్నట్టు చెప్పారు. నాడు వారు చేసిన ప్రయత్నమే, నేడు మహిళా రిజర్వేషన్ల బిల్లు పోరాట పరంపరగా కొనసాగుతుందన్నారు.

మహిళా రిజర్వేషన్ల అంశం ఒక రాష్ట్రానికి సంబంధించినది కాదనీ, ఇది దేశానికి సంబంధించిన...2లో



ముందస్తు లేదు

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

- సర్వేలన్నీ మనకే అనుకూలం
- కొందరు ఎమ్మెల్యేల పనితీరు బాలేదు
- దళితబంధు నిధులు కాజేశారు..ఫిర్యాదులు అందాయి
- తీరు మార్చుకోండి..లేకుంటే మిమ్మల్నే మార్చాల్సి వస్తుంది
- కవితకు ఈడీ నోటీసు..భయపడేది లేదు
- న్యాయపోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు ఉండవు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. సర్వేలన్నీ మనకే అనుకూలంగా ఉన్నాయి. కొందరు ఎమ్మెల్యేల వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తున్నది. వారు పద్ధతి మార్చుకోకుంటే, వచ్చే ఎన్నికలకు వారినే మార్చాల్సి ఉంటుంది. ఎమ్మెల్సీ కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ నోటీసులు రాజకీయ వేధింపుల్లో భాగంగా ఇచ్చినవే. ఎక్కడా బెదిరేది లేదు. అరెస్టు చేస్తే చేయనివ్వండి. న్యాయపోరాటం చేస్తాం" అని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధ్యక్షులు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అన్నారు. ఆయన అధ్యక్షతన శుక్రవారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది డిసెంబరులోపు అసెంబ్లీ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉందనీ, ఈ నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యవహరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా త్వరలో వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 103 సీట్లు వస్తాయని సర్వేలు చెబుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. 99 శాతం మంది సిట్టింగులకే మళ్లీ టికెట్లు ఇస్తామని చెప్పారు. పథకాల అమలు ప్రక్రియపై ఇంటెలిజెన్స్ నిఘా ఉందనీ, ఎవరైనా తప్పు చేస్తే టికెట్లు ఇవ్వబోనని హెచ్చరించారు. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కొందరు నేతలు, ఎమ్మెల్యేలపై ఆరోపణలు ఉన్నాయనీ, వారివల్ల పార్టీకి చెడ్డపేరు వస్తున్నదని హెచ్చరించారు. ఇప్పటికైనా తప్పులు చేసే ప్రజాప్రతినిధులు తమ పద్ధతి మార్చుకోవాలని హితవు చెప్పారు. కొందరు ప్రజాప్రతినిధులు దళితబంధు నిధులు కాజేసినట్టు తనకు ఫిర్యాదులు...2లో



కొత్త సచివాలయానికి కేసీఆర్

- పనుల పరిశీలన
- సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం
- అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపం సందర్శన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం, తెలంగాణ అమరవీరుల జ్యోతి నిర్మాణ పనుల పురోగతిని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పరిశీలించారు. శుక్రవారం తొలుత సచివాలయానికి చేరుకున్న సీఎం...2లో

జిన్‌పింగ్‌కు మూడోసారి అధ్యక్ష బాధ్యతలు

చైనా పార్లమెంట్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ : చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. మూడోసారి దేశాధ్యక్ష పదవిని చేపట్టారు. మరో ఐదేండ్లపాటు జిన్‌పింగ్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తూ చైనా పార్లమెంట్ శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానించింది. గతేడాది అక్టోబరులో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) కాంగ్రెస్ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో 69ఏండ్ల జిన్‌పింగ్‌ను మరోసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. సీపీసీ వ్యవస్థాపకుడు మావో తర్వాత...5లో

గిరిజనులను గెంటేసేందుకే బీజేపీ కుట్ర..

అపాయంగా అటవీ పరిరక్షణ చట్టం -2022 నియమాలు

గుండుగుత్తుగా కార్పొరేట్లకు అడవులపై హక్కులు కల్పించడానికి మోడీ ప్రభుత్వం కుట్ర. వెయ్యి హెక్టార్లకు పైగా అటవీ భూమిని అటవీయేతర భూమిగా మార్చటానికి నిర్ణయం. అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్ళించాలంటే అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద అటవీ హక్కులను సంపూర్ణంగా అమలు జరపాలని 2009లో కేంద్ర ప్రభుత్వ అటవీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గ దర్శకాల్లో పేర్కొన్నది. అయితే ఈ అవసరం లేకుండానే ప్రభుత్వ, ప్రయివేట్ కంపెనీలకు అటవీ భూమిని మళ్లించేందుకు నూతన అటవీ సంరక్షణ చట్టంలో వీలు కల్పిస్తున్నది. ఈ నియమాలు అమలైతే అడవి నుండి ఆదివాసీలు గెంటేయబడతారు.

- భూముల్ని లాక్కుంటే బతికేదెట్లా?
- ప్రమాదంలో పర్యావరణం
- నామ్‌కేవాస్తేగా అనుమతులు
- తూతూ మంత్రంగా పరిహారం..

ఎస్ వెంకన్న



అడవిలో ఖనిజ సంపద..

రాష్ట్రంలో గిరిజనులు.. : రాష్ట్రంలో 32 గిరిజన తెగలున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 31.78లక్షలు కాగా, తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 36,02,288 మందిగా జనాభా ఉంది. రాష్ట్రంలో రాజ్యాంగం కల్పించిన ఐదో షెడ్యూల్ ప్రాంతం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలోని తొమ్మిది జిల్లాల పరిధిలో 13,924.46 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 1174గ్రామాలున్నాయి.

షెడ్యూల్డ్ ప్రాంతంలో బొగ్గు, విలువైన ఉక్కు, ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమల ప్రాంతంలో యురేనియం, ఇతర అటవీ ప్రాంతంలో రంగురాళ్లు, రాగి, తగరం, వనమూలికలు, జిగురు, అటవీ ఉత్పత్తులు తదితర విలువైన సంపద విస్తారంగా ఉన్నది.

వివరాలు 5లో..

గిరిజన హక్కులకు తిలోదకాలు..

పోరాడి సాధించుకున్న గిరిజన హక్కుల చట్టాలకు పాడెకట్టేందుకు బీజేపీ సర్కార్ సిద్ధమవుతున్నది. పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెట్టేసి, కార్పొరేట్లకు అటవీ భూముల్ని కట్టబెట్టేందుకు నిర్ణయించుకున్నది. అడవుల్ని నమ్ముకుని బతుకుతున్న కోట్లాది మంది బతుకులు ఆగం చేసే నిర్ణయం మోడీ సర్కారు తీసుకున్నది. ఆదివాసీలు, గిరిజనుల అనుమతి అవసరం లేకుండా అటవీ భూముల్ని వివిధ ప్రాజెక్టులకు వినియోగించే ప్రక్రియకు పాల్పడుతున్నది. 'అటవీ పరిరక్షణ నియమావళి - 2022' తో..అటవీ హక్కుల చట్టానికి సమాధి కడుతున్నది.

తేజస్వీ యాదవ్ నివాసంలో ఈడీ సోదాలు

యూపీ, బీహార్‌లోని 15 ప్రాంతాల్లో తనిఖీలు



న్యూఢిల్లీ : 'ల్యాండ్ ఫర్ జాబ్ కేసు'లో బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ నివాసంలో శుక్రవారం ఈడీ సోదాలు నిర్వహించింది. న్యూఢిల్లీలోని న్యూఫ్రెండ్స్ కాలనీలో ఉన్న ఆర్జేడీ నాయకుడి నివాసంతోపాటు ముంబయి, యూపీ, బీహార్‌లోని 15 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు చేపట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని...5లో

మాణిక్‌రెడ్డికే మా మద్దతు

తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్టు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ కన్వీనర్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల పోరాటాలకు టీఎస్‌యూటీఎఫ్ మద్దతుగా...5లో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఊహించని ట్విస్ట్

వాంగ్మూలాన్ని ఉపసంహరించుకున్న రామచంద్ర పిళ్లై



- సిసోడియాపై రిమాండ్ కోర్టులో విచారణ

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఎమ్మెల్సీ కవిత విచారణ నేడు (శనివారం) జరగాల్సి ఉంది. అయితే అరుణ్ రామచంద్ర పిళ్లై శుక్రవారం ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఇప్పటికే అరుణ్ రామచంద్ర పిళ్లై అరెస్ట్...5లో



మీ భూమి..మీ హక్కు

మా ప్రభుత్వంలో ధరణిని ఎత్తేస్తాం

- ఢిల్లీలో కవిత ధర్నాకు మా పార్టీ మద్దతు లేదు
- కాంగ్రెస్ జాతీయ నేత జైరాం రమేష్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'మీ భూమి.. మీ హక్కు' నినాదంతో త్వరలోనే కార్యక్రమాన్ని చేపడతామని, తెలంగాణలో తమ సర్కారు రాగానే ధరణి పోర్టల్‌ను ఎత్తేస్తామని ఆ పార్టీ జాతీయ నేత జైరాంరమేష్ తెలిపారు. ఢిల్లీలో కవిత చేపట్టిన ధర్నాకు తమ పార్టీ మద్దతు లేదని, కనీసం పాలుపంచుకోదని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ధరణి అదాలత్ కార్యక్రమానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ధరణిలో దాదాపు 20లక్షల ఖాతాల్లో సమస్యలున్నాయని, ఎవరి భూములపై వారికే హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని చెప్పారు. తెలంగాణలో 15లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి సర్కారు నుంచి ఎలాంటి సాయమూ అందడం లేదని తెలిపారు. ప్రస్తుతం భూములకు సంబంధించి 125 చట్టాలు.. 30వేల జీవోలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే వాటన్నింటినీ క్రోడీకరించి ఒకే చట్టం తీసుకొస్తామన్నారు. యజమాని అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి తీసుకునే హక్కు ప్రభుత్వానికి లేకుండా 2013లోనే కాంగ్రెస్ సర్కారు చట్టం తీసుకొచ్చిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. బలవంతపు భూసేకరణను నిషేధిస్తామని, ఆ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాణిక్ రావ్ ఠాక్రే, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ జాతీయ నాయకులు కొప్పుల రాజు, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

దాచుకున్న డబ్బులేవి..!

ఏండ్ల కొద్ది నిరీక్షణ

- జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం ప్రభుత్వ ఉద్యోగుల ఎదురుచూపు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 6 వేల పెండింగ్ దరఖాస్తులు
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఉద్యోగ సంఘాలు



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

కొడుకు ఉన్నత చదువుల కోసం జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం గతేడాది దరఖాస్తు చేసుకున్నాను. ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ నాకు డబ్బులు రాకపోవడంతో కొడుకు చదువు అర్థాంతరంగా ఆగింది.

జిల్లా వైద్యశాఖలోని ఓ ఉద్యోగి ఆవేదన

బిడ్డ పెళ్లి కోసం జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ప్రావిడెంట్ ఫండ్ వస్తుందన్న ఆశతో పెండ్లి కుదుర్చుకున్నాం. కానీ సకాలంలో డబ్బులు అందకపోవడంతో అప్పులు చేసి కూతురు పెళ్లి చేయాల్సి వచ్చింది.

ఓ మహిళా టీచర్ ఆవేదన

భవిష్యత్ అవసరాల కోసం రూపాయి.. రూపాయి జమ చేసి దాచుకున్న డబ్బులు తీసుకుకోవడానికి ప్రభుత్వ ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు సకాలంలో అందడం లేదు. ఏండ్ల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. పిల్లల చదువులు, శుభకార్యాలకు కూడా డబ్బులు అందడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం సుమారు ఆరు వేల మంది దరఖాస్తు చేశారు. ఇందులో రంగారెడ్డి జిల్లాలో నాలుగు వేల మంది, వికారాబాద్‌లో రెండు వేల మంది ఉన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌ను దరఖాస్తుదారుల ఖాతాలో జమ చేయాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 29 వేల మంది ఉన్నారు. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 17 వేల మంది ఉండగా వికారాబాద్ జిల్లాలో 12 వేల మంది ఉన్నట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. అయితే వీరు ప్రభుత్వ ఉద్యోగులుగా అపాయింట్ అయినప్పటి నుంచి తమ వేతనంలో కొంత డబ్బు 'జనరల్ ప్రావిడెంట్ ఫండ్' కింద జమ అవుతుంది. పిల్లల ఉన్నత చదువు కోసం, వైద్య ఖర్చులు, పిల్లల పెండ్లిల కోసం ఆ డబ్బులను తీసుకుంటారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో డబ్బులు తమ ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం రెండు, మూడేండ్లు అయినా జనరల్ ప్రావిడెంట్ ఫండ్ దరఖాస్తుదారుల ఖాతాలోకి డబ్బులు జమ కావడం లేదు. రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఈ కుబేరు' సంస్థను రెండేండ్ల క్రితం తీసుకొచ్చింది. ఇది ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు, ఆర్‌బీఐకి మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తోంది. జిల్లా ట్రెజరీ నుంచి పాస్ అయిన బిల్లులు నేరుగా 'ఈ కూబేరు'లో జమ అవుతాయి. ఇక్కడ పాస్ అయిన బిల్లులు ఆర్‌బీఐ నుంచి నేరుగా దరఖాస్తుదారుల ఖాతాల్లో...5లో

తగ్గేదేలేదు..

(మొదటిపేజీ తరువాయి)

అంశమని కవిత స్పష్టం చేశారు. మహిళల భాగస్వామ్యం లేకపోతే, దేశం ఎలా ముందుకు వెళుతుందని ప్రశ్నించారు. 1992లో స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించారనీ, ఫలితంగా ప్రస్తుతం 21 రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో 50 శాతానికిపైగా మహిళా ప్రాతినిధ్యం ఉందని వివరించారు.

కాబట్టి ఇప్పుడు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పి స్తే 10-20 ఏండ్ల తర్వాత పార్ల మెంట్, రాష్ట్రా ల అసెంబ్లీల్లో మహిళల ప్రాతినిధ్యం 50 శాతా నికిపైగా పెరుగుతుందని అన్నారు. సోమ వారం నుంచి ప్రారంభం కాను న్న పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లు పెట్టాలనీ, కేంద్రం పై ఒత్తిడి చేయాలని అన్నారు.

మహిళ బిల్లు అవసరం ఎంతో ఉంది

:సీతారాం ఏచూరి

రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లు అవసరం ఎంతైనా ఉందనీ, మహిళలకు భాగస్వామ్యం లేనంతవరకూ సమాజం ముందుకు పోదని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నొక్కి చెప్పారు. దీక్షను ప్రారంభిస్తూ సీతారాం ఏచూరి మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందే వరకు వామపక్ష పార్టీల పోరాటం ఉంటుందని అన్నారు. ఎన్నో అడ్డంకుల తరువాత మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందనీ, కానీ లోక్‌సభ ఆమోదముద్ర వేయలేదని అన్నారు. సోమవారం నుంచి జరిగే రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదించాలని పట్టుబడతామని చెప్పారు. '30 దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లు పెండింగ్‌లో ఉంది. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళలకు సరియైన ప్రాతినిధ్యం లభించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. అందుకోసం మహిళా బిల్లు తప్పనిసరి అవసరం' అని పేర్కొన్నారు. గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోడీ కూడా మద్దతు తెలిపారని గుర్తు చేశారు. 2014, 2019 ఎన్నికల్లో ప్రధాని ఈ బిల్లు తెస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆయన ప్రధానమంత్రి అయి తొమ్మిదేండ్లు పూర్తయినా ఇప్పటివరకు లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్ట లేదని విమర్శించారు. కవితకు ఈ విషయము లో అన్ని విధాలుగా మద్దతు ఇస్తామన్నారు. ప్రస్తుతం లోక్‌సభలో 14 శాతం, రాజ్య సభలో 11 శాతం మాత్రమే మహిళా సభ్యులు ఉన్నారన్నారు.

అనేక మంది మహిళల ఆక్రందన : సంజయ్ సింగ్

మహిళా బిల్లు అనేది సుదీర్ఘ కాలంగా అనేక మంది మహిళల ఆక్రందన అని ఆప్ రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్ అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్నప్పుడు మహిళా బిల్లు ఎందుకు ఆమోదం పొందడం లేదో మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ వాగ్దానం చేసి తొమ్మిదేండ్లు అయిందని, ఇప్పుడు ఆ పార్టీ దీనిపై స్పందించడం లేదని విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ మహిళ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తుందని, ఈ సమావేశాల్లో బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరాహారదీక్షలో దేశంలోని పలు రాజకీయ పార్టీలు, 29 రాష్ట్రాలకు చెందిన మహిళ హక్కుల పోరాట సంఘాలు, ఎన్జీఓలు, జేఎన్‌యూ, జామియా విద్యార్థులు, మహిళా ప్రతినిధులు మద్దతు తెలిపారు. సీతారాం ఏచూరి (సీపీఐ(ఎం)), కె.నారాయణ (సీపీఐ), సంజయ్ సింగ్, చిత్ర సర్వారా (ఆప్), నరేష్ గుజ్రాల్ (శిరోమణి అకాళీదళ్), పూజా శుక్లా (ఎస్పి), సీమా మాలిక్ (ఎన్సిపి), శ్యామ్ రజాక్ (ఆర్‌ఎల్డి), షమీమ్ ఫిర్దౌస్ (నేషనల్ కాన్ఫరెన్స్) మద్దతు పలికారు. ఆర్జేడీ, పీడీపీ, శివసేన నేతలు సంఘీభావం తెలిపారు. మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, ఎంపీలు కె. కేశవరావు, నామా నాగేశ్వర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, వెంకటేష్ నేత, ఎమ్మెల్యేలు రేఖా శ్యాంనాయక్, పద్మా దేవేందర్ రెడ్డి, మహిళా ఆర్థిక సహకార సంస్థ చైర్ పర్సన్ ఆకుల లలితలతో పాటు పలువురు జెడ్పీచైర్మన్లు, బీఆర్ఎస్ శ్రేణులు, పెద్ద సంఖ్యలో మహిళలు దీక్షలో కూర్చున్నారు.

వంటనే కాదు... దేశాన్ని పాలించగలం

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కవిత చేస్తోన్న దీక్ష అభినందనీయమని రాష్ట్ర మహిళా మంత్రులు అన్నారు. మహిళ లేనిదే ప్రపంచం లేదని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళలు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, అధికారంలోకి రాగానే ఈ బిల్లును మరుగున పెట్టడం సరికాదన్నారు. బీజేపీ కళ్ళు తెరిచి బిల్లు పాస్ చేయాలన్నారు. మోడీని ప్రశ్నిస్తున్న పార్టీలు, రాజకీయ పార్టీల నేతల పై దర్యాప్తు సంస్థలను ఉసికొల్పుతున్నారని ఆరోపించారు. మహిళలకోసం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వల్ల దేశం మొత్తం కేసీఆర్ వైపు, తెలంగాణ వైపు చూస్తుందన్నారు. వంట చేయడం కాదు... దేశాన్ని పాలించడం మహిళలకు తెలుసునని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. భారత మాతా అంటే అందులోనూ అమ్మ ఉందనీ, ఆ అమ్మను మరవద్దని కోరారు.

కొత్త సచివాలయానికి కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ చివరి దశకు చేరుకున్న ఎలివేషన్ పనులు, ఫౌంటేన్, గ్రీన్‌లాన్, టూంబ్ నిర్మాణం దానికి తుది దశలో అమరుస్తున్న స్టోన్ డిజైన్ తదితర పనుల పురోగతిని తనిఖీ చేశారు. సెక్రటేరియట్ ప్రధాన ద్వారం అత్యంత విశాలంగా నిర్మించిన తీరును, భోపాల్ నుంచి ప్రత్యేకంగా వుడ్ కార్వింగ్ చేసి తెప్పించి అమర్చిన ద్వారాన్ని పరిశీలించిన సీఎం సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం సీఎం చాంబర్ వుండే ఆరవ అంతస్తుకు చేరుకున్నారు. గత పర్యటన సందర్భంగా చేసిన సూచనల మేరకు వాల్ క్లాడింగ్, డెకరేషన్ తదితర తుదిమెరుగులనూ పరిశీలించారు. విశాలమై న కారిడార్లు, అంతే అందంగా తీర్చిదిద్దిన ఛాంబర్ల ద్వారాల పనితీరును పరిశీలించి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఐ.గణపతి రెడ్డి, అధికారులు, వర్క్ ఏజెన్సీని సీఎం అభినందించారు. సీఎం చాంబ ర్‌లోని సమావేశ మందిరాన్ని కూడా చూశారు. సీఎంవో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఛాంబర్లు, అందులో అమరుస్తున్న ఫర్నీచర్‌ను తిలకిం చారు. ఏర్పాట్లన్నీ సిబ్బంది పనికి అనుకూలంగా వుండే విధంగా వున్నా యా ? లేవా ? అని ఆరా తీసారు. నలుమూలలా కలియతిరిగిన సీఎం కేసీఆర్, ముఖ్యమంత్రి కార్యదర్శులు, ఇతర సిబ్బంది కార్యాలయా లనూ చూశారు. జీఏడి ప్రోటోకాల్ సిబ్బందికోసం ఏర్పాటు చేసిన చాంబ ర్లను, కలెక్టర్ల కాన్ఫరెన్స్ హాల్, ప్రజాప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన వెయిటింగ్ లాంజ్, విఐపీల వెయిటింగ్ లాంజ్‌లను చూశారు. మంత్రు లకు కేటాయిం చిన శాఖలు అన్నీ ఒక దగ్గరే ఉండేలా కార్యాలయాల కేటాయించాలని ఆదేశించారు. ఆయా శాఖలల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్యకు అనుకూ లంగా కార్యాలయాలు ఉండాలని కేసీఆర్ అధికారులకు సూచించారు. అనంతరం గ్రౌండు ఫ్లోర్‌కు చేరుకున్న సీఎం, దక్షిణ భాగం గుండా నడుచు కుంటూ అక్కడ నిర్మాణంలో వున్న పార్కింగ్ తదితర పనులను పరిశీలిం చారు. అనంతరం సెక్రటేరియట్ చుట్టూ తిరిగి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. తాను అనుకున్నట్టుగానే సచివాలయ నిర్మాణం పనులు పూర్తవుతున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ విగ్రహం...

సచివాలయం నుంచి నిర్మాణంలో వున్న డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహ పనుల పురోగతిని కూడా ఆయన చూశారు. అక్కడ మొదటి అంతస్తుకు చేరుకున్న సీఎం, అంబేద్కర్ విగ్రహం బేస్‌లో నిర్మిస్తున్న విశాలమైన హాళ్ళను, ఆడియో విజువల్ ప్రదర్శనకోసం నిర్మిస్తున్న ఆడిటో రియం పనులు, బయట ఫౌంటేన్, లాండ్ స్కేపింగ్ తదితర పనుల పురో గతిని పరిశీలించారు. నిర్మాణం పనుల పురోగతి గురించి మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను, వర్క్ ఏజెన్సీలు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతలో ఏమాత్రం లోటు రావద్దని స్పష్టం చేశారు. చారిత్రకంగా నిర్మిత మవుతున్న డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

అమరవీరులస్థూపం...

అక్కడినుంచి తెలంగాణ అమర వీరుల స్మారకార్థం నిర్మిస్తున్న అమరవీరుల జ్యోతి నిర్మాణ పనుల పురోగతిని సీఎం కేసీఆర్ పరిశీలించారు. మొదటి అంతస్తులో ఆడియో, వీడియో ప్రదర్శనల కోసం నిర్మిస్తున్న ఆడిటోరియం లేజర్ షో, ర్యాంప్, సెల్లార్ పార్కింగ్ పనులను పరిశీలించారు. నిర్మాణ పురోగతిని మ్యాపుల ద్వారా సీఎంకు ఇంజనీర్లు వివరించారు. పనుల గురించి సంతృప్తిని వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్ కొన్నిసూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌తో మంత్రి వేముల తోపాటు సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు విప్ బాల్క సుమన్, ఎ. జీవన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి, కార్యదర్శి శ్రీనివాస్ రాజు, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఐ గణపతిరెడ్డి, ప్రభుత్వ నిర్మాణ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ బండ శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులున్నారు.

ముందస్తు లేదు

(మొదటిపేజీ తరువాయి)

అందాయనీ, వారిని ఉపేక్షించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేస్తుందని చెప్పారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా పార్టీ నాయకులకు ఆయన వివరించారు. గృహలక్ష్మి పథకం ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు, దళితబంధు, రెండో విడత గొర్రెల పంపిణీ సహా పలు ప్రభుత్వ పథకాలను వివరించి, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

అరెస్టు చేస్తే చేయనివ్వండి...

బీఆర్ఎస్ నేతల్ని బీజేపీ ఉద్దేశ్యపూర్వకంగానే వేధిస్తున్నదని సీఎం కేసీఆర్ చెప్పారు. మంత్రులు మల్లారెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ రవిచంద్రను ఇబ్బంది పెట్టారనీ, ఇప్పుడు ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఇలాంటి వాటికి బెదరాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్సీ కవిత విషయంలో ఏం చేస్తారో చూద్దాం. అరెస్టు చేస్తే చేసు కోనివ్వండి. న్యాయపోరాటం చేస్తాం అని స్పష్టం చేశారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై వెనక్కి తగ్గేదే లేదని తేల్చి చెప్పారు. వారి కుట్రల్ని ప్రజాస్వామ్య బద్ధంగా, న్యాయ పరంగా ఎదుర్కొందామని నేతలకు దిశానిర్దేశం చేశారు.

బీఆర్ఎస్ ఆవిర్భావం రోజే ప్లీనరీ

ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావం సందర్భంగా పార్టీ ప్లీనరి నిర్వహిస్తున్నామనీ, ఇకముందు బీఆర్ఎస్ ఆవిర్భావం రోజే పార్టీ ప్లీనరీ నిర్వహించాలని యోచిస్తున్నామన్నారు. నాయకులు క్షేత్రస్థాయిలో పాదయాత్రలు, కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. బీజేపీ సభలకు కౌంటర్ సభలు పెట్టి, విమర్శల్ని బలంగా తిప్పి కొట్టాలనీ, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండ గట్టాలని చెప్పారు. సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మెన్లు పాల్గొన్నారు.

ఇదీ షెడ్యూల్...

రాష్ట్ర ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల షెడ్యూల్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యవర్గ సమావేశంలో స్పష్టత ఇచ్చినట్టు సమాచారం.

- మార్చి 25 నుంచి నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు. 45 రోజులు వీటిని నిర్వహించాలి. పది గ్రామాలకు ఒక సమ్మేళనం పెట్టాలి.
- ఏప్రిల్ 14న హైదరాబాద్‌లో నిర్మిస్తున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ. అదేరోజు ఎన్టీఆర్ స్టేడియంలో సభ నిర్వహణ.
- ఏప్రిల్ 25న అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణలు.
- ఏప్రిల్ 27న ఎల్‌బీ స్టేడియంలో బీఆర్ఎస్ ప్లీనరీ
- ఏప్రిల్ 30న నూతన సచివాలయ ప్రారంభం. ఆ ప్రాంగణంలోనే బహిరంగ సభ
- జూన్ 1న అమరవీరుల స్థూపం అవిష్కరణ

పాక్‌లో అమ్మకపు పన్ను భారీగా పెంపు

ఇస్లామాబాద్ : 33 రకాల వస్తువులపై అమ్మకపు పన్నును 17 శాతం నుండి 25 శాతానికి పాకిస్తాన్ ప్రభుత్వం పెంచింది. దిగుమతి చేసుకున్న ఆహారంతో పాటు అలంకార వస్తువులు, అత్యాధునిక మొబైల్ ఫోన్స్, ఇతర ఉత్పత్తులపై ఈ పన్ను విధిస్తున్నట్టు తెలిపింది.

మే 14న టర్కీ పార్లమెంటరీ, అధ్యక్ష ఎన్నికలు

అంకారా : గత నెల్లో తీవ్ర భూకంపం సంభవించినప్పటికీ టర్కీ లో షెడ్యూల్ కన్నా ఒక నెల ముందు గానే పార్లమెంటరీ, అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. మే 14న ఈ ఎన్నికలు నిర్వహించడానికి శుక్రవారం అధ్యక్షుడు రెసెప్ తైయిప్ ఎర్డోగన్ ప్రకటించారు. రెండు దశాబ్దాల పాటు అధికారంలో వున్న ఎర్డోగన్ ఈసారి కూడా ఎన్నికవాలని భావిస్తున్నారు. దశాబ్దాల కాలంలో దేశంలోనే అత్యం త ప్రాధాన్యత కలిగిన ఎన్నికలుగా వీటిని పరిగణిస్తున్నారు. మరింత ప్రజాస్వామ్య పంథాలో పయనించ డమా లేక బలమైన నేత ఎర్డోగన్ నిర్దేశించిన నిరంకుశ పంథాలో ముందు కు సాగడమా అనేది ఈ ఎన్నికలు నిర్ణయించనున్నాయి. 2003 నుండి ఎర్డోగన్ టర్కీని పాలిస్తున్నారు.

అవినాష్‌పై అనుమానాలున్నాయి..: సీబీఐ

- 13 వరకు అరెస్టు చేయొద్దు: హైకోర్టు



నవతెలంగాణ-హైదరాబాద్

ఏపీకి చెందిన మాజీ మంత్రి, మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని సోమవారం వరకు అరెస్టు చేయడం, ఇతర కఠిన చర్యలు తీసుకోకూడదని సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ సోమవారం వరకు అరెస్టు చేయొద్దని సీబీఐకి న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. సీబీఐ విచారణకు హాజరైనప్పుడు చెప్పిన విషయాలను రికార్డింగ్ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలనీ, తనపై కఠిన చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్‌ను శుక్రవారం విచారించింది. అవినాష్‌ను విచారించినప్పుడు సీబీఐ తీసిన వీడియో, వివేకా హత్య తర్వాత స్వాధీనం చేసుకున్న లేఖ దీనిపై సీఎఫ్ఎస్ఎల్ రిపోర్టులను సీల్డ్ కవర్‌లో అందజేయాలని ఆదేశించింది. విచారణకు హాజరైన సీబీఐ ఎస్పీ, విచారణను రికార్డింగ్ చేశామనీ, వాటిని హార్డ్‌డిస్క్‌లో తెచ్చామని చెప్పారు. సీబీఐ లాయర్ వాదిస్తూ, చట్ట ప్రకారమే అవినాష్‌ను విచారణ చేస్తున్నారని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా అవినాష్, అయన తండ్రి భాస్కర్‌రెడ్డిలను సీబీఐ అదుపులోకి తీసుకునే ఆస్కారం ఉందన్నారు. దీంతో హైకోర్టు, తదుపరి విచారణ జరిగే ఈ నెల 13వ తేదీ వరకు అవినాష్‌ను అరెస్టు చేయరాదని సీబీఐకి ఆదేశాలను జారీ చేసింది. సీఆర్‌పీసీలోని 161 సెక్షన్ ప్రకారం ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని అవినాష్ లాయర్ చెప్పారు. సీఆర్‌పీసీ 160 కింద నోటీసులిచ్చారనీ, తనను అరెస్ట్ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కూడా కోరారు. బలవంతపు చర్యలు చేపట్టకుండా చూడాలని కోరగా, అందుకు హైకోర్టు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సీబీఐ న్యాయవాది స్పందిస్తూ, అవినాష్‌ను అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయనీ, అవినాష్‌తోపాటు ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని కూడా అదుపులోకి తీసుకునే అవకాశముందని తెలిపారు. వాస్తవానికి ఈరోజే అదుపులోకి తీసుకోవాలని అనుకున్నామని చెప్పారు. అవినాష్‌ను అనుమానితుడు, నిందితుడిగా భావించాలని సీబీఐ నిర్ణయించిందన్నారు. వివేకా హత్య తర్వాత లభ్యమైన పత్రం, దానిపై ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు కూడా సీబీఐ వద్ద ఉన్నాయన్నారు.

అప్రూవర్‌గా మారిన దస్తగిరి చెప్పినట్లుగా సీబీఐ చేస్తోందని అవినాష్ న్యాయవాది ఆరోపించారు. దర్యాప్తు ఏకపక్షంగా ఉందన్నారు. ఆధారాలు లేకపోయినా కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోందన్నారు. సీబీఐ విచారణను వీడియో తీయడం లేదన్నారు. చెప్పిన విషయాలను టైపింగ్ చేసేప్పుడు దర్యాప్తు అధికారి జోక్యం చేసుకుని పలుసార్లు కొన్నింటిని తీసేశారని చెప్పారు. దస్తగిరి కూడా నిందితుడని, ఈ విషయాన్ని వాచ్‌మెన్ రంగయ్య చెప్పారనీ, దీనికి విరుద్ధంగా సీబీఐ చర్యలు ఉన్నాయన్నారు. తమ కేసులో వివేకా కూతురు వేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించవద్దని కోరారు. వివేకా కూతురు సునీత వేసిన ఇంప్లీడ్ పిటిషన్‌పై సీబీఐ వైఖరి చెప్పాలని హైకోర్టు కోరింది. అవినాష్‌ను ఏహోదాలో సీబీఐ విచారణ చేస్తోందని ప్రశ్నించింది. అనుమానితుడు, నిందితుడిగా విచారణ చేస్తున్నట్లు సీబీఐ జవాబు చెప్పింది.

వివేకా 2010లో షేక్ షమీమ్‌ను రెండో పెళ్లి చేసుకున్నారు., వాళ్లకు 2015లో కొడుకు పుట్టాడు. ఆస్తికి వారసుల వివాదం వచ్చింది. అప్పటి నుంచే వివేకా భార్య, కుమార్తె హైదరాబాద్‌లో వివేకాకు దూరంగా ఉంటున్నారు. వివేకా హత్య తర్వాత తమ కుటుంబాన్ని బెదిరించినట్లుగా షమీమ్ సీబీఐకి చెప్పింది. వివేకా హత్య తర్వాత సునీత తన భర్త రాజశేఖర్‌రెడ్డి టీడీపీ ఎమ్మెల్సీ ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి)ని కలిశారు. తర్వాత టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడిని కూడా కలిశారు. వివేకా హత్య వెనుక బీటెక్ రవి, చంద్రబాబు పాత్ర ఉంది. అని అవినాష్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు కృషి

- సావిత్రీ బాబు పూలే వర్ధంతి సభలో జి. రాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సావిత్రిబాయిపూలే ఆశయాల సాధనకు కృషి చేయాల్సిన అవసరం నేటి సమాజంలో మరింత పెరిగిందని తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం(టీపీఎస్‌కే) కన్వీనర్ జి రాములు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాదం మెజారిటీ ప్రజలకు చదువులు నిషేధించిందని గుర్తుచేశారు. నాగరిక సమాజానికి అక్షర దివిటి అందించిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రి భాయి పూలే అని చెప్పారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ నాడు సావిత్రిబాయి పూలే అస్పృశ్యులు మహిళల చదువు పైన ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఆమె ఆశయాలకు తిలోదకాలిస్తూ నేటి కేంద్ర బీజేపీ సర్కార్ నూతన విద్యా విధానం పేరుతో దళితులు పేదలకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి అబ్బాస్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన భర్త సహకారంతో దేశంలో మెజారిటీ ప్రజలకు అక్షర ఆయుధాన్ని అందించిన మొదటి వ్యక్తిగా నిలుస్తారన్నారు. మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే ఒక స్ఫూర్తి శిఖరం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోదుగు పూలు పత్రిక ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఏ విజయ్ కుమార్, వివిధ ప్రజా సంఘాలనాయకులు కొమ్ము విజయ్ కుమార్ ,జగదీష్ బాలరాజు, జానయ్య, రవి, కిషన్ ,తదితరులు పాల్గొన్నారు.

40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

- రుద్రాంగిలో 39.5 డిగ్రీలు నమోదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎండలు దంచి కొడుతున్నాయి. మార్చి ప్రథమార్థంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువవుతున్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలో శుక్రవారం అత్యధికంగా 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈసాల తక్కళ్లపల్లి(పెద్దపల్లి)లో 39.4, మనాల్(రాజన్నసిరిసిల్ల)లో 39.2, వెల్గటూరు(జగిత్యాల) 38.9, జూలూరుపాడు (భద్రాద్రి కొత్తగూడెం)38.7, గుళ్లకోట(జగిత్యాల) 38.6, ఎండపల్లి(జగిత్యాల) 38.6, మండోర(నిజామాబాద్)38.5, నాయుడుపేట(భద్రాద్రి కొత్తగూడెం) 38.4, రాఘవపేట(జగిత్యాల) 38.3 డిగ్రీల చొప్పున పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల 15 నుంచి నాలుగైదు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా తగ్గే అవకాశం ఉందనీ, అక్కడక్కడా వర్షం కూడా పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఫోటో జర్నలిస్టుపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ కమిషనర్‌ను కోరిన టీఎస్‌పీజేఏ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విధినిర్వహణలో ఉన్న ఫోటో జర్నలిస్టు పరమేష్‌పై దాడి చేసిన పోలీసులు, భద్రత సిబ్బందిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణా రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు ఏ.గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్‌ను కోరారు. శుక్రవారంనాడు నూతన సచివాలయం బయటి నుంచి ఫోటోలు తీస్తున్న ప్రెస్ ఫోటోగ్రాఫర్‌పై పోలీసులు అకారణంగా దాడి చేశారని చెప్పారు. సచివాలయం ఫోటోలు తీయడం నేరం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఫోటోగ్రాఫర్ పరమేష్‌ను పోలీసులు, భద్రతాసిబ్బంది చొక్కాలాగి, దౌర్జన్యంగా కెమెరా లాక్కునే ప్రయత్నం చేసి, దాడి చేశారని చెప్పారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామనీ, దీనికి కారణమైన పోలీసులు, భద్రతా సిబ్బందిపై కమిషనర్ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

అసంఘటిత కార్మికుల సమస్యలపై సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ది సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో భారతదేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు మరియు సవాళు _ అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఐసీఎస్ఎస్ఆర్-సౌత్ రీజియన్ సెంటర్ ఈ సమావేశానికి సహకరించాయి. సదస్సు కన్వీనర్ గా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె రాణి రత్న ప్రభ వ్యవహరించారు. "భారతదేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు మరియు సవాళ్లు" అనే పుస్తకాన్ని యుపీ కార్మికశాఖ వి.వి.గిరి లేబర్ ఇన్‌స్టిట్యూట్ డీజీ అమిత్ నిర్మల్ విడుదల చేశారు. రెండు రోజుల పాటు 11 టెక్నికల్ సెషన్లు, మూడు ప్యానెల్ చర్చలు జరిగాయి. సదస్సులో ప్రముఖ ప్రొఫెసర్లు అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి దాదాపు వంద మంది పరిశోధకులు తమ పరిశోధక పత్రాలను సమర్పించారు.

మహిళలకు బీఆర్ఎస్‌లో 33 శాతం పదవులెందుకివ్వలేదు? : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీలో మహిళలకు 33 శాతం పదవులెందుకు ఇవ్వడంలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా గోస-బీజేపీ దీక్ష పేరుతో ఒక్కరోజు దీక్షను మహిళా మోర్చా నిర్వహించింది. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ..రాష్ట్రంలో మహిళలు, యువతులపై దాడులు జరిగితే కనీసం మాట్లాడని కవిత ఢిల్లీలో మహిళా బిల్లు కోసం దీక్ష చేయడం విడ్డూరంగా ఉందన్నారు. లిక్కర్ దందాను పక్కదోవ పట్టించేందుకే ఈ డ్రామాలని విమర్శించారు. గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్‌లో మహిళా బిల్లు, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడుల అంశంపై ఎందుకు చర్చించలేదని నిలదీశారు.

అబద్ధాల 'కోర'లు

సంపాదకీయం

విభజన రాజకీయాలను తిరస్కరించకుంటే విద్వేషం పదే పదే దాడికి తెగబడుతూనే ఉంటుంది. చివరికది ప్రజల సామాజిక జీవితాన్నే విచ్ఛిన్నం చేస్తుంది. ఇలాంటి విఘాతాలకు కులోన్మాదం, మతోన్మాదం ఎలాంటి సాధనాలో ప్రాంతీయోన్మాదం కూడా అలాంటి సాధనమే. వీటన్నిటికీ అబద్ధమే పునాది. నిజం నిలకడమీద తెలుస్తుందన్న మాట నిజమేగానీ,

> భారత ప్రజలలో పరస్పర అనుమానాలు, ద్వేషాలు సృష్టించడం వీరికి కొత్తేమీ కాదు. ఇంకా చెప్పాలంటే అదే వీరి విధానం. కొద్ది రోజుల క్రితం సాక్షాత్తూ కేంద్ర హెూంమంత్రి వర్యులే కర్నాటకలో మాట్లాడిన మాటలు మనం విన్నాం.. "తమ పొరుగు రాష్ట్రామైన కేరళ పట్ల జాగ్రత్తగా ఉండాలం"టూ ఆయన కన్నడ ప్రజలల్లో అపోహలు రేకెత్తించడం గుర్తు తెచ్చుకుంటే ఈ కుతంత్రం ఎంత విస్తృతమైనదో మనకు మరింత బోధపడుతుంది.

ఆలోపు అబద్ధం సృష్టించే అనర్థం అంతా ఇంతా కాదు. కేవలం అపోహలకూ అంతఃకలహాలకే కాదు, ఒకోసారి అది క్రూరమైన హింసోన్మాదానికీ దారితీస్తుంది. ఈ విషయం విభజనవాదులకూ విద్వేషకారులకూ తెలిసినంతగా మరెవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. అందువల్ల ఇప్పుడు తమిళనాడులో వలస కార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ దేశమంతటా కలకలం రేపిన అసత్య వార్తలూ బూటకపు వీడియోలు యాధృచ్ఛికమని ఎంతమాత్రమూ అనుకోలేం. సామరస్యానికి చిచ్చుబెట్టి, శాంతికి ఉచ్చుబిగించే ఈ "ఫేక్ న్యూస్" ఎంత ప్రమాదకరమైనదో, వీటి వెనుక ఎలాంటి శక్తులుంటాయో అర్థం చేసుకోవడానికి ఈ తమిళనాడు ఉదంతం ఓ తాజా ఉదాహరణ.

ఈ ఉదంతంలో చెలరేగిన విద్వేషానికి రెండు వీడియోలు కారకాలు. ఇందులో మొదటిది రెండు గ్యాంగ్‌ల మధ్య జరుగుతున్న హింసాత్మకమైన ఘటనకు సంబంధించినది కాగా, రెండవది ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణకు సంబంధించినది. ఈ రెండూ బీహార్‌కు చెందిన వలస కార్మికులపై తమిళనాడులో జరుగుతున్న దాడులుగా ప్రచారంలో కొచ్చాయి. ఇంకేముంది... తక్షణమే వీటిపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై స్పందిస్తూ... "ఇది ఉత్తరాది కార్మికులపై ఊచకోత – దీనికి కారణం డీఎమ్‌కే హిందీ వ్యతిరేకత" అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు ట్వీట్ చేశారు. పనిలోపనిగా ఈ రెండు వీడియోలకు గతంలో తమిళనాడు మంత్రి ఒకరు హిందీ ఆధిపత్యాన్ని విమర్శించిన వీడియో ఒకటి జోడించారు. ఆ వెంటనే ఉత్తరప్రదేశ్ బీజేపీ అధికార ప్రతినిధి ప్రశాంత్ పటేల్ ఉమ్రావ్ రంగంలోకి దిగారు. ఆయన ఈ రెండు వీడియోలకు, గతంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్ ఫొటోను జతచేసారు. "బీహారీలపై తమిళనాడులో ఊచకోత సాగుతున్నా, తేజస్వీ స్టాలిన్‌తో అంటకాగుతున్నాడు" అని వ్యాఖ్యానించాడు. ఇది బీహారీలకే అవమానమని రెచ్చిపోయాడు. ఆపైన ఆ ఉన్మాదం దేశమంతా అంటుకుంది. సామాజిక మాధ్యమాల్లో అట్టుడికింది.



అయితే ఈ వివాదానికి కేంద్రమైన ఈ రెండు వీడియోలు పచ్చి అబద్ధాలు కావడం విశేషం. మొదటిది వలస కార్మికులకు ఏ మాత్రం సంబంధంలేని రెండు ముఠాల ఘర్షణకు సంబంధించినది కాగా, రెండవది అసలు తమిళనాడుకే సంబంధంలేనిది. త్రిపురలో ఓ బిహారీవాలాకు ఓ జార్ఖండ్‌వాలాకు జరిగిన వ్యక్తిగత తగాదాకు సంబంధించినది. ఇది వెంటనే అప్రమత్తమైన తమిళనాడు ప్రభుత్వంతో పాటు, ఇలాంటి అసత్య వార్తలను ఛేదించే "ఆల్ట్‌న్యూస్"కి చెందిన జుబైర్ వంటి నిజపరిశీలనా నిపుణులు సైతం తేల్చి చెప్పిన సత్యం. ఈ దాడుల పుకార్లతో పాటు, రైల్వే స్టేషన్‌లలో నిండిన బీహారీ కార్మికులను చూపుతూ... "హింసకు భయపడి పారిపోతున్న వలస కార్మికులు" అని ప్రచారం చేసిన వార్తలు కూడా పచ్చి అబద్ధం. వారంతా ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా హెూలీ పండగ కోసం ఇండ్లకు వెళుతున్నారన్నది అసలు నిజం. కాగా, ఈ తప్పుడు కథనాలను దేశమంతా వ్యాప్తి చేసినవారంతా కాషాయ శ్రేణులూ, వారి హిందూత్వ నెట్‌వర్క్‌లో భాగస్వాములైన వారే కావడం గమనార్హం. తక్షణమే అప్రమత్తమై ఈ గుట్టు రట్టు చేసిన తమిళనాడు ప్రభుత్వానికీ, జుబైర్ వంటి ఫేక్‌న్యూస్ ఛేదకులకూ మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలి. లేదంటే ఇది దేశంలో ఎంత విద్వేషాన్ని రగిలించేదో, ఎంత హింసకు పురికొల్పేదో..!

పారిశ్రామికంగా దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా తమిళనాడు అభివృద్ధిలో ఉత్తరాది వలసకార్మికుల పాత్ర కాదనలేనిది. అలా ఉత్తరాదికి చెందిన లక్షలాది కుటుంబాలు అక్కడ స్థిరపడిపోయాయి. దీనిని ఆసరాగా చేసుకుని, ఈ కలహాలు సృష్టించడం ద్వారా తమిళనాడులో పాగా వేయడం, ఎనిమిదేండ్ల తమ విధ్వంసక పాలనలో ఉత్తరాదిన బలహీనపమవుతున్న తమ పునాదిని సంఘటితం చేసుకోవడం ఈ విద్వేష వ్యూహాల లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇది పసిగట్టిన స్టాలిన్ "మా ఉత్పత్తిలో భాగస్వాములవుతున్న కార్మికులందరూ మావారే. వారి భద్రతకు మాది పూచీ" అంటూ భరోసానివ్వడం స్వాగతించదగినది. కానీ కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసం రెండు భాషల మధ్య, రెండు రాష్ట్రాల మధ్య, రెండు ప్రాంతాల మధ్య విద్వేషాలు రగిలించి, దేశాన్ని రెండు వ్యతిరేక శిబిరాలుగా విభజించే బీజేపీ కుట్రలనేమనాలి? అయినా భారత ప్రజలలో పరస్పర అనుమానాలు, ద్వేషాలు సృష్టించడం వీరికి కొత్తేమీ కాదు. ఇంకా చెప్పాలంటే అదే వీరి విధానం. కొద్ది రోజుల క్రితం సాక్షాత్తూ కేంద్ర హెూంమంత్రి వర్యులే కర్నాటకలో మాట్లాడిన మాటలు మనం విన్నాం.. "తమ పొరుగు రాష్ట్రామైన కేరళ పట్ల జాగ్రత్తగా ఉండాలం"టూ ఆయన కన్నడ ప్రజలల్లో అపోహలు రేకెత్తించడం గుర్తు తెచ్చుకుంటే... ఈ కుతంత్రం ఎంత విస్తృతమైనదో మనకు మరింత బోధపడుతుంది.



> రైతు సంఘాలకు సంబంధించినది కూడా. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు జరిపిన విస్తృత నిరసనలకు మీడియా కవరేజ్ లభించింది. బహుశా, కార్మిక సంఘాల నుంచి కూడా ఇలాంటి నిరసనల కోసం మీడియా సంస్థలు ఎదురుచూస్తున్నాయి.

పత్రికా సమావేశం.. ఓ జర్నలిస్టు అనుభవం!

ఏ.ఎం.జిగీశ్

జాతీయ అధినాయకత్వానికి సంబంధించిన పత్రికా సమావేశానికి కేంద్ర కార్మిక సంఘం (సెంట్రల్ ట్రేడ్ యూనియన్) ఇటీవల నన్ను ఆహ్వానించింది. ప్రభుత్వరంగ సంస్థల(పీఎస్‌యూ) ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా యూనియన్ ఆందోళనను ప్రారంభిస్తున్నది. యూనియన్ కొన్ని అంశాల్లో ప్రభుత్వానుకూల వైఖరి తీసుకున్నందున, రాజకీయంగా కొన్ని ముఖ్యమైన అంశాలకు ఈ పత్రికా సమావేశం నాకు ఉపయోగపడుతుందని నేను అనుకున్నాను.

సమావేశానికి ఐదు నిమిషాల ముందే నేను అక్కడకు చేరుకున్నాను. కొంతసేపటి వరకు అక్కడ ఏమీ జరగలేదు. ఆలస్యం జరిగినందుకు క్షమాపణలు చెప్పడానికి యూనియన్ సిబ్బంది నా దగ్గరకు వచ్చింది. అర్ధగంట తర్వాత కూడా అక్కడ ఉన్న ఒక్కగానొక్క రిపోర్టర్‌ను నేనే. అయితే నిర్వాహకులు ఎలాగోలాగా చివరకు ఒక్క యూట్యూబర్‌ను సమావేశానికి రప్పించగలిగారు. నిరసన కార్యక్రమాలకు సంబంధించి జాతీయ కార్యదర్శి ప్రకటన చేశారు. పార్లమెంటుకు మార్చ్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు ఆ ప్రకటనలో ఉన్నాయి. నిరసనలకు సంబంధించి ఆయనను నేను కొన్ని ప్రశ్నలు అడిగాను కానీ... పత్రికా విలేకరులు, ఫొటోగ్రాఫర్ల కోసం ఏర్పాటు చేసిన స్నాక్స్, బంగ్లా స్వీట్లు, రెండు పెద్ద ఫ్లాస్కుల్లో టీ, కాఫీని యూనియన్ ఏం చేస్తుందన్న దాని గురించి మాత్రం నేను ఆయనను అడగలేదు. ఆ తర్వాత 25వేల మంది కార్మికులు (వీరిలో అధికం పీఎస్‌యూల నుంచి వచ్చినవారున్నారు) హాజరైన పార్లమెంటు మార్చ్‌ను నేను కవర్ చేశాను. ఇది కొత్తేం కాదు. సుదీర్ఘకాలంగా కార్మిక సంఘాలను నేను కవర్ చేస్తున్నాను. యూనియన్ల రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా... యూనియన్ కార్యక్రమాలకు హాజరయ్యే జర్నలిస్టుల హాజరు మాత్రం పేలవంగా ఉంటుంది. ప్రముఖ కార్మిక నాయకులు ఎం.కే పంధే ఒకసారి జర్నలిస్టు మిత్రులకు ఒక విషయం చెప్పారు. భారత్‌లో యూపీఏ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పిలుపునిచ్చే సమ్మెలో ఎంత మంది కార్మికులు పాల్గొన్నారన్న దాని గురించి తాను బీబీసీ, ది గార్డియన్ వంటి విదేశీ మీడియా పబ్లికేషన్లపై ఆధారపడ్డానని అన్నారు.

12 కేంద్ర కార్మిక సంఘాలకు కలిపి దేశవ్యాప్తంగా ఆరు కోట్ల మందికి పైగా కార్మికుల సభ్యత్వం ఉన్నది. ఈ యూనియన్ల, ఫెడరేషన్ల సభ్యత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలిస్తాయి. కొన్నిసార్లు కేంద్ర ప్రభుత్వ వెరిఫికేషన్ ప్రక్రియ జరగలేదు. మిస్డ్‌కాల్స్‌తో సభ్యత్వ నమోదు జరిపే రాజకీయ పార్టీల్లా కాకుండా, ఈ యూనియన్ల సభ్యత్వానికి సంబంధించి ఆడిట్ జరుగుతుంది. రిజిస్ట్రార్ ఆఫ్ ట్రేడ్ యూనియన్లకు కార్మిక సంఘాలు తమ రిటర్న్‌ను ఫైల్ చేస్తాయి. ఈ సమయంలో సభ్యత్వరశీదు తప్పనిసరి. ఈ యూనియన్లతో లక్షలాది మంది ప్రజలు మిళితమై ఉంటారు. కానీ, వారు వారికి సంబంధించిన సమస్యలు, అంశాలు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

కార్మికులు, రైతులు, నిరుద్యోగ యువత జీవనోపాధికి సంబంధించిన సమస్యలను ట్రేడ్ యూనియన్లు లేవనెత్తుతాయి. వాటి డిమాండ్లు పార్లమెంటులో ప్రతిధ్వనిస్తాయి. వాటి విధానానికి ఒక విలువ ఉంటుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) సమావేశాల్లో అవి ప్రశంసలకు నోచుకుంటాయి. ఇటీవల సింగపూర్‌లో జరిగిన ఐఎల్‌ఓ సమావేశంలో ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల ప్రభుత్వాలు, పలు కంపెనీల యజమానులు, కార్మిక సంఘాలు భారత కార్మిక ప్రతినిధుల మాటలను చాలా శ్రద్ధతో ఆలకించారు. అయితే, భారత్‌లో మాత్రం కార్మిక సంఘాల కార్యకలాపాలు, డిమాండ్లు మాత్రం విస్తృతంగా మీడియాలో కవర్ కావడం లేదు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో పాలుపంచుకున్న కార్మిక సంఘం సీనియర్ నాయకులు అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ... కార్మికుల సమస్యలకు సంబంధించిన నిష్పాక్షికత ప్రాథమిక సూత్రాన్ని అనేక మీడియా సంస్థలు మరిచిపోయాయి. "నయాఉదారవాదం అమలు తర్వాతే ట్రేడ్ యూనియన్లు, కార్మికులను విస్మరించే ట్రెండ్ ఊపందుకున్నది. కార్మిక సంఘాలు ఎల్లప్పుడూ అభివృద్ధికి వ్యతిరేకులుగా చిత్రీకరించబడ్డాయి. విధానకర్తలు, యజమానులకు అనుకూలంగా అనేక మీడియా సంస్థలు పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయి. కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ దీనిని విస్మరించడమే సులువు అని మీడియా గుర్తించింది" అని ఆమె అన్నారు. "బీబీసీ, ఏఎఫ్‌పీ, ఇతరుల కవరేజీకి ధన్యవాదాలు. బ్రిటన్‌లో నర్సులు, ఫ్రాన్స్‌లో కార్మికుల సమ్మె గురించి తెలుసుకున్నాము. అయితే, జార్ఖండ్‌లో కోల్‌మైనర్ల సమ్మెగురించి మనలో ఎంత మందికి తెలుసు?" అని ప్రశ్నించారు.

ఈ అంశం రైతు సంఘాలకు సంబంధించినది కూడా. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు జరిపిన విస్తృత నిరసనలకు మీడియా కవరేజ్ లభించింది. బహుశా, కార్మిక సంఘాల నుంచి కూడా ఇలాంటి నిరసనల కోసం మీడియా సంస్థలు ఎదురుచూస్తున్నాయి.

- 'ది హిందూ' సౌజన్యంతో
అనువాదం: గోవర్ధన్

బలమైన ప్రతిపక్షం అత్యావశ్యకం


దుష్యంత్ దవే

స్వాతంత్ర్యం సాధించి 75సంవత్సరాలు, రిపబ్లిక్ స్థాపన 74సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మన దేశం "ఆజాదీ కా అమృత మహెూత్సవ్"ను జరుపుకొని ఉండవచ్చు. కానీ దేశంలో ఇంకా చాలా తీవ్రమైన వైరుధ్యాలు ఉన్నాయి. దేశంలో దుర్భరమైన పేదరికం ప్రబలుతుంది. ధనికులు, పేదలకు మధ్య తీవ్రమైన విభజన ఏర్పడింది. సందిగ్ధమైన పరిస్థితులు చట్టబద్ధ పాలనపై ప్రభావం చూపుతాయి. అంతగా బాగాలేని పాలన ప్రజాస్వామ్యం, రిపబ్లిక్‌ల ఉనికికి తీవ్రమైన సవాళ్ళను సృష్టిస్తాయి.

కులం, మతాల ప్రాతిపదికన దేశంలో విభజన ఏర్పడిన ఫలితంగా శత్రుత్వం కాకపోయినా తీవ్ర అపనమ్మకం సృష్టించబడింది. ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్యం కోసం, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్ష పార్టీకి ఒక్క అంగుళం మాత్రం అవకాశం కూడా ఇవ్వడానికి ఇష్టపడడం లేదు. మాటల దాడులు, ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాల్లో రాజకీయ అస్థిరతతోపాటు రాజకీయ కుట్రలు, అనేక కేంద్ర సంస్థలతో "దాడులు", "తనిఖీలు" చేయించడం ద్వారా కేంద్రం నిరంతరం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుంటుంది.

బలహీనమైన రాజ్యాంగ సంరక్షణా వ్యవస్థ, సంస్థల కారణంగా భారత సర్వోన్నత న్యాయస్థానంతో సహా న్యాయ వ్యవస్థ కూడా ఈ దాడుల్ని నిరోధించడంలో ఆలస్యం చేస్తుంది. ఉదాహరణకు న్యాయ వ్యవస్థ వర్తించే బల నిరూపణ, ప్రతిపక్ష పార్టీల పాలిత ప్రభుత్వాలను కూల్చడానికి, పాలకపార్టీ ప్రయత్నాలకు సహాయపడడానికి

> స్వాతంత్ర్యం సాధించిన తరువాత దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఈ దేశంలో ఆధిపత్యం చెలాయించిన కాంగ్రెస్ పార్టీ, ఆరోగ్యవంతమైన ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం ద్వారా తన అధికారాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాలనే ప్రయత్నం చేసింది. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రధానమైన ఆయుధంగా ఉండేది.అయినా, నేడు కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు దేశంలో ప్రస్తుత ప్రజాస్వామ్యం పరిస్థితిపై ఫిర్యాదులు చేసే పరిస్థితికి నెట్టబడ్డాయి.

మాత్రమే దోహదం చేస్తున్నట్టు కనిపిస్తుంది. ఇది పూర్తిగా పనికిమాలిన న్యాయ సంబంధిత ఆయుధం. సర్ విన్సన్ చర్చిల్ పేర్కొన్నట్టు... ప్రజాస్వామ్యంలో "చిన్న వ్యక్తి" యొక్క అధికారాన్ని కాపాడేందుకు ఎన్నుకోబడిన ఎంఎల్‌ఏలు ప్రలోభాలకు గురి కాకుండా నిరోధించే నూతన మార్గాలను న్యాయవ్యవస్థ వెతకాల్సిన అవసరం ఇప్పుడు ఉంది.

కాబట్టి, 'అమృత్' ఎక్కడుంది? మన రాజ్యాంగ నిర్మాతలు ఒక భిన్నమైన భారతదేశాన్ని ఊహించినట్లు మన రాజ్యాంగ పరిషత్ చర్చలు తెలియజేస్తున్నాయి. నవంబర్ 5, 1948న హెచ్.వీ.కామత్ ఇలా పేర్కొన్నాడు... "రాజ్యం కోసం వ్యక్తి కంటే కూడా వ్యక్తి కోసమే రాజ్యం ఉనికిలో ఉండే 'రాజ్యం' కోసం ప్రయత్నం చేయడానికి భారతీయులమైన మనం ముందుకు సాగుతామని నేను ఆశిస్తున్నాను. కనీసం మనం ఈ స్ఫూర్తిని మన స్వంత రాజకీయ సంస్థల్లో తీసుకొని వచ్చే ప్రయత్నం చేద్దాం. మనం ఈ పని చేయకుంటే, నేడు రాజ్యాంగ పరిషత్‌లో చేస్తున్న మన ప్రయత్నం భారతీయ ప్రజల యొక్క రాజకీయ మేథోప్రతిభను ప్రతిబింబించదు. యుగాల నాటి భారతదేశం చనిపోదు లేదా తన చివరి సృజనాత్మక మాటను మాట్లాడలేదు. ఆమె జీవిస్తుంది, తన కోసం, మానవ కుటుంబం కోసం ఎంతో కొంత చేయాలని ఆమెకు ఉంది."

ఏడు దశాబ్దాలుగా మనం ఈ మార్గంలో పయనించామా? విభజన శాశ్వతంగా ఉండాలని కోరుకునే వారికి హెచ్.వీ.కామత్ వివరించిన సంఘటనే సమాధానం. 1927లో మద్రాస్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాన్ని గురించి ఇలా చెప్పాడు... "మీరు భారత రాజ్య కార్యదర్శి లేదా భారత ప్రభుత్వం నుండి ఎలాంటి రక్షణలు కావాలని" ముస్లింలను అడిగారు పండిట్ మదన్ మోహన్ మాలవ్య. మేము ఇక్కడే ఉన్నాం గదా, ఇంకా ఎలాంటి రక్షణలు మీరు కోరుతున్నారు? ఆ ఉపన్యాసం తరువాత, మౌలానా మొహమ్మద్ అలీ వేదిక మీదకు వెళ్ళి మాలవ్యను కౌగిలించుకొని ఇలా అన్నారు, "నేను ఏ రక్షణలూ కోరడం లేదు. మేము భారతీయ రాజకీయ సమూహంలో భారతీయులుగా జీవించాలని కోరుకుంటున్నాం. బ్రిటిష్ ప్రభుత్వం నుండి మేము ఎలాంటి రక్షణలను కోరుకోవడం లేదు. పండిట్ మాలవ్యా నే మాకు మంచి రక్షణ."

ప్రతిపక్షం, ఒక 'అవసరమైన చెడు'

రాజ్యాంగంలో చెప్పిన దానికి, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పని చేయడంలో రాజ్యాంగబద్ధమైన, పరిపాలనా అధికారుల వైఫల్యం, భారతదేశం ఎంత అప్రజాస్వామికమైనదో తెలియజేస్తుంది. రాజ్యాంగ పరిషత్‌లో ప్రతిపక్ష సభ్యుల ప్రాముఖ్యతపై చర్చిస్తూ, మే 20, 1949న జెడ్.హెచ్.లారీ ఇలా పేర్కొన్నారు.... "అధికారం కలుషితం చేస్తుంది, సంపూర్ణమైన అధికారం పూర్తిగా కలుషితం చేస్తుందని ప్రతి ఒక్కరికీ తెలుసు. అధికారంలోకి వచ్చే ప్రతీ రాజకీయ పార్టీ తన పట్టును శాశ్వతంగా నిలిపి ఉంచుకునేందుకు ప్రయత్నం చేసే మాట యదార్థం. పాలక పార్టీ ప్రభుత్వం నిరంకుశంగా దిగజారకుండా తనిఖీ చేసేది ఇతర పార్టీల ఉనికి మాత్రమే. పాలక పార్టీ మంత్రివర్గం, పాలక పార్టీ చర్యలపై కఠినమైన నిఘా పెంచడం ద్వారా పార్టీ ప్రభుత్వం నిరంకుశ పాలన వైపు దిగజారిపోకుండా ఈ ఇతర పార్టీలు అడ్డుకుంటాయి. దీనితో పాటు, ప్రభుత్వాన్ని నడిపే పార్టీ చర్యలపై స్థిరమైన విమర్శలు లేకుంటే పార్టీ ప్రభుత్వ పనితీరు సరియైన రీతిలో ఉండదు."

"ఒకవేళ ప్రతిపక్ష నాయకునికి జీతం చెల్లించే విధానం ప్రతిపక్షం సృష్టిని, ఆరోగ్యవంతమైన ప్రతిపక్ష పార్టీ సృష్టిని ప్రోత్సహిస్తే, ప్రతిపక్ష నాయకునికి జీతం చెల్లించాలనే జెడ్.హెచ్. లారీ సూచనను, భవిష్యత్ పార్లమెంట్, ఈ దేశానికి బాధ్యత వహించే వారు దృష్టిలో ఉంచుకుంటారు అనే విషయంలో నాకు ఎలాంటి సందేహం లేదని" టీ.టీ.కృష్ణమాచారి అన్నాడు.

"ఒక ఆరోగ్యకరమైన ప్రతిపక్షం కచ్చితంగా ఉండాలి అనే దానిని నేను అంగీకరిస్తాను. ఈ ఆరోగ్యకరమైన ప్రతిపక్షంలోని ముఖ్యమైన వ్యక్తికి మంచి అవకాశం వచ్చింది. ఆయన ప్రతిపక్షాన్ని ఎందుకు ప్రారంభించలేదో నాకు తెలియదు. ఇదంతా చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలకు మించి దేశ సంక్షేమాన్ని మెరుగుపరిచే విధంగా ఉన్నాయా వారి చర్యలు?" అని ఎం.ఏ.అయ్యంగార్ అన్నారు. "ప్రతిపక్షం ఒక అవసరమైన చెడు అనీ, అధికారంలో ఉన్న పార్టీకి పూర్తి స్థాయిలో పని ఇవ్వడమే ప్రతిపక్షం యొక్క విధి" అని బిశ్వనాథ్ దాస్ అభిప్రాయపడ్డారు.

స్వాతంత్ర్యం సాధించిన తరువాత దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఈ దేశంలో ఆధిపత్యం చెలాయించిన కాంగ్రెస్ పార్టీ, ఆరోగ్యవంతమైన ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం ద్వారా తన అధికారాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాలనే ప్రయత్నం చేసింది. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రధానమైన ఆయుధంగా ఉండేది.అయినా, నేడు కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు దేశంలో ప్రస్తుత ప్రజాస్వామ్యం పరిస్థితిపై ఫిర్యాదులు చేసే పరిస్థితికి నెట్టబడ్డాయి.



కానీ వారంతా సమిష్టిగా ఆరోగ్యకరమైన ఒకే ప్రతిపక్షంగా ఉన్నారా? వారి మాటలు, చేతలు అన్నీ దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. వారి చర్యలు ఈ దేశ సంక్షేమాన్ని మెరుగు పరిచేందుకు ఉద్దేశించినవేనా? వారు ఒకే గొంతుకతో మాట్లాడక పోవడం అనేది పాలక పార్టీ ప్రతీ ఎన్నికలో విజయం సాధించేందుకు మార్గం సుగమం చేస్తుంది.

> ప్రస్తుత పాలక పార్టీ, ఒకప్పుడు రామ్‌నారాయణ్ సింగ్ చెప్పిన ఈ మాటలను గుర్తుంచుకోవాలి... "ఈ దేశంలో మనం ఇప్పుడే స్వేచ్ఛను సాధించుకున్నాం. మన స్వంత పార్టీ అంటే కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షం అనేది లేదు. ఇక్కడ పరిస్థితులు ఎలా మారుతున్నాయో నేను చూస్తూనే ఉన్నాను. కాబట్టి మన చర్యల్ని విమర్శించి, సమీక్షించే ఒక బలమైన ప్రతిపక్షం ఉండాలని నేను అభిప్రాయపడుతున్నాను. ప్రతిపక్షం అంటే ఇష్టం లేని, నిత్యం అధికారంలోనే ఉండాలని కోరుకునే ప్రభుత్వం దేశభక్తియుత ప్రభుత్వం కాదు, అది దేశద్రోహపూరిత ప్రభుత్వం అవుతుంది."

మన రాజ్యాంగాన్ని సంరక్షించడంలో దేశ పౌరుల కర్తవ్యాల పై అవగాహన కల్పించడం ఎలా అన్నదే మన దేశం ముందున్న సవాల్. స్వేచ్ఛను అసంబద్ధం చేస్తున్న రాజకీయ వర్గం ముందు ఇప్పుడు ప్రజలు ప్రేక్షకపాత్రను పోషిస్తున్నారు. ఇజ్రాయిల్‌లో న్యాయ వ్యవస్థను బలహీనపరచడానికి ప్రధాని, బెంజమిన్ నేతన్యాహూ తయారుచేసిన ప్రతిపాదనలను అక్కడి ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. కానీ నేడు మన దేశంలో మనకు ఏముంది?

ఒక బలమైన, ఆరోగ్యవంతమైన ప్రతిపక్షాన్ని కలిగి ఉండడంలో పొందిన వైఫల్యం, అధికార పార్టీ నిరంకుశ ధోరణితో తన స్థానాన్ని శాశ్వతం చేసుకోవడానికి కారణభూతమవుతుంది. భారత సుప్రీంకోర్టుపై మంత్రులు, ఇతరులు నిరంతరం చేస్తున్న దాడులు, ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం పట్ల అంతగా గౌరవం చూపడం లేదని రుజువు చేస్తున్నాయి. ప్రస్తుత పాలక పార్టీ, ఒకప్పుడు రామ్‌నారాయణ్ సింగ్ చెప్పిన ఈ మాటలను గుర్తుంచుకోవాలి... "ఈ దేశంలో మనం ఇప్పుడే స్వేచ్ఛను సాధించుకున్నాం. మన స్వంత పార్టీ అంటే కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షం అనేది లేదు. ఇక్కడ పరిస్థితులు ఎలా మారుతున్నాయో నేను చూస్తూనే ఉన్నాను. కాబట్టి మన చర్యల్ని విమర్శించి, సమీక్షించే ఒక బలమైన ప్రతిపక్షం ఉండాలని నేను అభిప్రాయ పడుతున్నాను. ప్రతిపక్షం అంటే ఇష్టం లేని, నిత్యం అధికారంలోనే ఉండాలని కోరుకునే ప్రభుత్వం దేశభక్తియుత ప్రభుత్వం కాదు, అది దేశద్రోహపూరిత ప్రభుత్వం అవుతుంది." అధికారంలో ఉన్న పార్టీ, ప్రతిపక్ష పార్టీ రాజ్యాంగం పట్ల వాటి విధులను, బాధ్యతలను గుర్తించి, రాజ్యాంగ నిర్మాతల ఆశలను, ఆశయాలను గౌరవించి, భారతదేశ ప్రజల సంక్షేమం కోసం పని చేస్తాయని ఆశిద్దాం.

("ది హిందూ" సౌజన్యంతో)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలు వరమా?శాపమా?


ఫిరోజ్ ఖాన్
9640466464

సహజ, ఖనిజ నిక్షేపాలే కొన్ని దేశాలకు శాపంగా మారినట్టు చరిత్ర చెబుతున్న వాస్తవం. 'డచ్ డిసీజ్' పేరుతో నెదర్లాండ్స్ ఎదుర్కొన్న పరిస్థితులు ప్రపంచానికి ఇప్పటికీ ఒక ఉదాహరణగా ఉన్నాయి. 1959లో నెదర్లాండ్స్‌లో భారీ ఎత్తున గ్యాస్ నిల్వలను కనుగొనగా అప్పటి నుంచి ఆ దేశం వాటిని పెద్ద ఎత్తున ఎగుమతి చేయడం పారంభిం చింది. ఇన్‌స్టంట్‌గా అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో లాభం చేకూర్చినా, దీర్ఘకాలిక వృద్ధిలో తీరని నష్టాన్ని మిగిల్చింది. ఓ దశాబ్దం తర్వాత అంటే 1970–77 మధ్యలో పరిశీలిస్తే ఆ దేశ నిరుద్యోగ రేటు 5.1శాతానికి చేరుకున్నది. అంతకు ముందు అది ఒక శాతానికి మాత్రమే పరిమితమై ఉన్నది. ఎందుకంటే పెట్టుబడు లంతా ఒకే రంగంలో కేంద్రీకతం కావడం, ఇతర రంగాలు, తయారీ పరిశ్రమలను పట్టించుకోక పోవడంతో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని ఆర్థిక విశ్లేషకులు నిర్ధారించారు.

బ్యాటరీ తయారీలో కీలకమైన లిథియమ్ నిల్వలను జమ్మూకాశ్మీర్‌లో ఇటీవల కనుగొన్నట్టు కేంద్ర గనుల శాఖ ప్రకటించింది. 59లక్షల మెట్రిక్ టన్నుల లిథియం ఉన్నట్లు అంచనా వేసింది. ఈ అంచనా నిజమైతే ప్రపంచంలోనే అత్యధిక లిథియమ్ నిల్వలున్న దేశాల్లో భారతదేశం రెండో స్థానంలో ఉంటుంది. అంతేకాకుండా జమ్మూకాశ్మీర్, ఏపీ, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, జార్ఖండ్, కర్నాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణల్లో 51 చోట్ల ఖనిజ నిల్వలను గుర్తించారు. వాటిలో ఐదు బంగారు గనులు సైతం ఉన్నాయి. అంతేకాకుండా పొటాష్, మాలిబ్డినం వంటి లోహాలను గుర్తించారు. అయితే ఇలాంటి సహజ, ఖనిజ నిక్షేపాలు ఆయా ప్రాంతాలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు, భవిష్యత్తుకు వరమా? శాపమా? అనే చర్చ అవసరమవు తున్నది.

పర్యావరణంపై తీవ్ర ప్రభావం

లిథియమ్ అయినా ఇతర ఖనిజ నిక్షేపాలైనా వాటిని మైనింగ్ చేసి, వెలికి తీయాలంటే ప్రకృతి, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. నేల, నీరు, గాలి కలుషితమవుతాయి. ఉదాహరణకు ఒక టన్ను లిథియమ్‌ను ఉత్పత్తి చేయడానికి 2.2 మిలియన్ లీటర్ల నీరు అవసరమవుతుంది. పర్యావరణంపై పడే ప్రభావాన్ని పట్టించుకోకుండా లిథియమ్‌ను వెలికి తీయడానికి ప్రయత్నిస్తే 'జోషి మఠ్' లాంటి సంఘటనలు మరింత పెరిగే ప్రమాదముంటుంది. ఎలక్ట్రిక్ వాహనాల్లో వాడే బ్యాటరీల్లో లిథియమ్‌ను వినియోగిస్తున్నారు. దీంతో కర్బన ఉద్గారాలు ఎంతో మేర తగ్గించవచ్చని వాదించే వారూ ఉన్నారు. అయితే లిథియమ్ మైనింగ్ ద్వారా ఉత్పత్తి అయ్యే కర్బన ఉద్గారాలను కూడా మనం తోసిపుచ్చలేం. లాభనష్టాలను బేరీజు వేసుకొని, అన్నింటిని సమతుల్యం చేసి ముందుకు సాగితేనే ఫలితముంటుంది. పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుండడంతో లిథియమ్ వెలికితీతపై ఇప్పటికే అర్జెంటీనా, బొలీవియా వంటి దేశాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. కేంద్ర గనుల శాఖ అంచనా వేసినట్టు జమ్మూకాశ్మీర్‌లో 59 లక్షల టన్నుల లిథియమ్ నిల్వలు ఉండి, పర్యావరణంపై కనీస ప్రభా వంతో వాటిని వెలికితీసినా... అది దేశ ఆర్థిక వ్యవస్థకు, భౌగోళిక పరిస్థితులకు ఏ మేరకు లాభసాటిగా ఉంటుందనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. చమురు నిల్వలను కనుగొన్నప్పుడు గల్ఫ్ దేశాలు జాక్ పాట్ కొట్టినట్టే భారతదేశ పరిస్థితి ఉండబోతున్నదనే వాదనా ఉన్నది.

చరిత్రను పరిశీలిస్తే...

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే వివిధ దేశాల్లో పెద్ద ఎత్తున సహజ నిక్షేపాలను కనుగొన్నప్పుడు ఆ దేశాలపై పడ్డ ప్రభావాన్ని చూస్తే అనేక ఆసక్తికర విషయాలను మనం గమనించవచ్చు. కొన్ని దేశాలు సానుకూల పరిస్థితులను సష్టించుకొని



అభివృద్ధి దిశలో పయనించగా, సరైన ప్రణాళికలు లేకుండా మరికొన్ని దేశాలు దీర్ఘకాలికంగా అనేక రంగాల్లో వెనకబాటుకు గురయ్యాయి. గతంలో గల్ఫ్ దేశాలతోపాటు నార్వే, ఆస్ట్రేలియా, రువాండా లాంటి దేశాల్లో పెద్ద ఎత్తున చమురు నిల్వలను కనుగొన్నారు. వీటి వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలే మారిపోయాయి. అదే సమయంలో వీటికి భిన్నమైన ఉదాహరణలు సైతం మనకు కనిపిస్తాయి.

'డచ్ డిసీజ్' ఒక ఉదాహరణ

సహజ, ఖనిజ నిక్షేపాలే కొన్ని దేశాలకు శాపంగా మారినట్టు చరిత్ర చెబుతున్న వాస్తవం. 'డచ్ డిసీజ్' పేరుతో నెదర్లాండ్స్ ఎదుర్కొన్న పరిస్థితులు ప్రపంచానికి ఇప్పటికీ ఒక ఉదాహరణగా ఉన్నాయి. 1959లో నెదర్లాండ్స్‌లో భారీ ఎత్తున గ్యాస్ నిల్వలను కనుగొనగా అప్పటి నుంచి ఆ దేశం వాటిని పెద్ద ఎత్తున ఎగుమతి చేయడం ప్రారంభించింది. ఇన్‌స్టంట్‌గా అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో లాభం చేకూర్చినా, దీర్ఘకాలిక వద్ధిలో తీరని నష్టాన్ని మిగిల్చింది. ఓ దశాబ్దం తర్వాత అంటే 1970–77 మధ్యలో పరిశీలిస్తే ఆ దేశ నిరుద్యోగ రేటు 5.1శాతానికి చేరుకున్నది. అంతకు ముందు అది ఒక శాతానికి మాత్రమే పరిమితమై ఉన్నది. ఎందుకంటే పెట్టుబడులంతా ఒకే రంగంలో కేంద్రీకృతం కావడం, ఇతర రంగాలు, తయారీ పరిశ్రమలను పట్టించుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని ఆర్థిక విశ్లేషకులు నిర్ధారించారు. అంతేకాకుండా 1908లో ఇరాన్‌లో ఆయిల్ నిల్వలను కనుగొన్నారు. అక్కడ ఇతర రంగాలు అభివద్ధి చెందకపోవడం, అక్షరాస్యత అంతంత మాత్రంగానే ఉండడంతో పెట్టుబడులు, మానవ వనరులన్నీ 'ఆయిల్' రంగం వైపు మళ్లాయి. దీంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం ఒకే వనరుపై ఆధారపడి నడపాల్సి వచ్చింది. దీంతో మిగిలిన రంగాలు భారీ నష్టాలను చవిచూశాయి. ఎన్నో సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలున్నా అవినీతి, సరైన ప్రణాళిక లేకపోవడంతో కాంగో, జింబాబ్వే లాంటి దేశాలు ఇప్పటికీ పేదరికంలోనే మగ్గుతున్నాయి.

ఇతర దేశాలను పరిశీలిస్తే...

గల్ఫ్ దేశాల కరెన్సీ పూర్తి స్థాయిలో పెట్రో ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నది. ఇతర ఎలాంటి వస్తువులను ఆ దేశాలు ఎగుమతి చేయవు. దీంతో 'డచ్ డిసీజ్' లాంటి పరిస్థితులను అవి ఎదుర్కోలేదు. అదే సమయంలో ఆస్ట్రేలియా, నార్వే దేశాలను పరిశీలిస్తే ఖనిజ నిక్షేపాలతోపాటు ఇతర రంగాలపై కూడా దృష్టి సారించాయి. విద్య, మౌలిక సదుపాయాల కల్పనలో పెద్ద ఎత్తున ఖర్చు చేసి 'డచ్ డిసీజ్' లాంటి పరిస్థితులు రాకుండా తప్పించు కోగలిగాయి. అంతేకాకుండా సౌది, దుబాయి, యుఎఇ వంటి దేశాలు తమ ప్రాంతాలను టూరిస్ట్ హబ్‌లుగా మార్చి తమ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

> ఎంత పెద్ద ఎత్తున సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలు దొరికినా..పూర్తి స్థాయిలో వాటిపై ఆధారపడక పోవడమే మంచిది. ఆ నిక్షేపాల వద్ద ఒకరిద్దరు వ్యాపారులు మాత్రమే లాభపడేలా కాకుండా... సరైన ప్రణాళికలు రూపొందించి ప్రజలందరికీ లాభం జరిగేలా చర్యలు చేపట్టాలి. ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి లాభాలను విద్య, మౌలిక సదుపాయాల కల్పనలో ఖర్చు చేయాలి. అంతేకాకుండా వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను వైవిధ్యపర్చాలి. అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దు.

ఎంత పెద్ద ఎత్తున సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలు దొరికినా..పూర్తి స్థాయిలో వాటిపై ఆధారపడక పోవడమే మంచిది. ఆ నిక్షేపాల వద్ద ఒకరిద్దరు వ్యాపారులు మాత్రమే లాభపడేలా కాకుండా... సరైన ప్రణాళికలు రూపొందించి ప్రజలందరికీ లాభం జరిగేలా చర్యలు చేపట్టాలి. ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి లాభాలను విద్య, మౌలిక సదుపాయాల కల్పనలో ఖర్చు చేయాలి. అంతేకాకుండా వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను వైవిధ్యపర్చాలి. అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దు. అప్పుడే అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా దేశ ఆర్థిక వ్యవస్థను తయారు చేయవచ్చు. లేకుంటే ఆ సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలే దేశానికి శాపంగా మారుతాయి.

ఎదురైన సమస్యల్ని ఇతర ఉద్యోగులతో పంచుకోవడం, వారి ప్రవర్తన గురించి అసహనం వ్యక్తం చేయడం వంటివి చేస్తుంటారు. అయితే దీనికి బదులు మీకు ఎవరితోనైతే సమస్య ఎదురైందో ఆ విషయం గురించి వారితోనే నేరుగా మాట్లాడడం మంచిది.



కెరీర్‌లో ఎదగాలంటే..?

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా, ఉద్యోగాల్లో ఉన్నత పదవుల్ని అధిరోహిస్తున్నా జీతభత్యాలు, అవకాశాలు.. వంటి విషయాల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల సమస్యలు తప్పడం లేదు. మరి పని ప్రదేశంలో నెలకొన్న ఇలాంటి పురుషాధిక్య ధోరణి నుంచి బయటపడాలంటే కొన్ని అంశాల్ని దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. అవేంటో మనమూ తెలుసుకుందాం...

ఆఫీసుల్లో జరిగే మీటింగుల్లో మాట్లాడడానికి, తమ అభిప్రాయాల్ని వెల్లడించడానికి పురుషుల కంటే మహిళలు తక్కువ ఆసక్తి కనబరుస్తున్నారని ఓ అధ్యయనంలో తేలింది. అయితే ఒకవేళ మహిళలు సమావేశాల్లో మాట్లాడినప్పటికీ ఇతరులు మధ్యలో కలగజేసుకుని డిస్టర్బ్ చేయడానికి ప్రయత్నిస్తారట. మహిళలు చెప్పేది అంత విలువైన విషయం కాదని వారు భావించడమే అందుకు కారణంగా భావిస్తారని ఈ అధ్యయనం చెబుతుంది. దాంతో మహిళలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. కాబట్టి మన అభిప్రాయాలను విలువైనవిగా గుర్తించి వాటిని ఆఫీసు మీటింగుల్లో నిర్భయంగా, నిస్సందేహంగా వ్యక్తపరచాలని సూచిస్తున్నారు నిపుణులు. ఇలా మనం మన అభిప్రాయాల్ని పంచుకోవడం మొదలుపెట్టి దాన్నే కొనసాగించడం వల్ల వినేవారు కూడా మరింత శ్రద్ధ, ఆసక్తిని కనబరిచే అవకాశం ఉంది. దాంతో మనలో ఆత్మవిశ్వాసం మరింతగా రెట్టింపవుతుంది. అది మనం చేసే పనిపై సానుకూల ప్రభావం చూపి మనల్ని మరింత ముందుకు తీసుకెళ్తుందనడంలో సందేహం లేదు.

నేరుగా వారితోనే...

పని ప్రదేశాల్లో అటు బాస్‌తోనైనా, ఇటు ఇతర ఉద్యోగులతోనైనా అప్పుడప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అయితే ఇలాంటప్పుడు కొందరు ఫలానా వారి నుంచి వారికి ఎదురైన సమస్యల్ని ఇతర ఉద్యోగులతో పంచుకోవడం, వారి ప్రవర్తన గురించి అసహనం వ్యక్తం చేయడం వంటివి చేస్తుంటారు. అయితే దీనికి బదులు మీకు ఎవరితోనైతే సమస్య ఎదురైందో ఆ విషయం గురించి వారితోనే నేరుగా మాట్లాడడం మంచిది. దాంతో మీ సమస్యకు పరిష్కారం దొరకడంతో పాటు మీలో ఉన్న ధైర్యం గురించి కూడా వారికి తెలుస్తుంది. మీవైపు నుంచి ఎలాంటి తప్పు లేకుండా ఉంటే మీ ఈ ప్రవర్తన మిమ్మల్ని మరింత ముందుకు వెళ్లేందుకు దోహదం చేస్తుందే తప్ప మీ పురోగతిపై ఎలాంటి ప్రతికూలత చూపదు.

ప్రశంసలు స్వీకరించండి

ఒక ప్రాజెక్ట్ పైన పని చేస్తున్నప్పుడు అది విజయవంతం కావడానికి సర్వశక్తులూ ధారపోస్తాం. మన ప్రయత్నంలో విజయం సాధించినప్పుడు పైఅధికారులు మన పనిని మెచ్చుకోవడం సహజమే. ఇలాంటి సందర్భాలలో కొంతమంది 'ఇందులో నాదేం లేదు..' అంటూ ఆ ప్రాజెక్ట్ కోసం తాము ఎంతగా కష్టపడిందీ చెప్పుకోరు. ఇలా చేయడం వల్ల వారే ఆ పనిని పూర్తిచేయడంలో ముఖ్య భూమిక పోషించినప్పటికీ వారి ప్రతిభ, శక్తియుక్తుల గురించి ఇతరులకు తెలియకపోవచ్చు. కాబట్టి మీరు చేసిన పనికి పైఅధికారుల నుంచి అందిన ప్రశంసల్ని హుందాగా స్వీకరించండి. తద్వారా మీలో ఆత్మవిశ్వాసం, పని పట్ల మక్కువ పెరగడంతో పాటు కెరీర్‌లోనూ పురోగతి సాధించవచ్చు.

నాయకులు మీరే...

పని ప్రదేశంలో మహిళలు పురుషుల కంటే మెరుగ్గా రాణిస్తున్నప్పటికీ, తమ



సృజనాత్మక ఆలోచనల్ని వ్యక్తపరుస్తున్నప్పటికీ ఒక్కోసారి కెరీర్‌లో ఎదగలేకపోతుంటారు. కారణం.. అసమానత. మీరూ ఇలాంటి వారిలో ఒకరా? అయితే బాధపడాల్సిన పనిలేదంటున్నారు నిపుణులు. మీ అందరికీ ఒక టీమ్ లీడర్ ఉన్నప్పటికీ మీకు మీరే నాయకురాలిగా భావించాలి. మీరు చేసే పనిలో నాణ్యత, మీ సృజనాత్మకతను సందర్భం వచ్చినప్పుడల్లా బయటపెట్టాలి. మీకు వచ్చిన ఆలోచనల్ని మీలోనే దాచుకోకుండా మీరేం చేయాలనుకుంటున్నారో అందరి ముందు ధైర్యంగా చెప్పగలగాలి. అప్పుడే మీలోని నాయకురాలి గురించి అందరికీ తెలుస్తుంది. ఇలా మీరు చూపిన ధైర్యాన్నే మార్గదర్శకంగా తీసుకొని మరింతమంది ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి వారందరికీ మీరే లీడర్ అవుతారు. దాంతో మీరు అంచెలంచెలుగా ఎదుగుతూ కెరీర్‌లో ఉన్నతి సాధిస్తారనడంలో సందేహం లేదు.

అందుకు భయమెందుకు?

మనకు అప్పగించిన బాధ్యతల విషయంలో ఎంతటి ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ కొంతమంది తగిన పదోన్నతులు అందుకోలేకపోతుంటారు. తమ ప్రతిభ గురించి ఉన్నతాధికారులతో స్పష్టంగా మాట్లాడకపోవడమే ఇందుకు కారణం అంటున్నారు నిపుణులు. 'నేను సమర్థంగా పనిచేస్తున్నాను..' అని మీరు పూర్తి విశ్వాసంగా ఉన్నట్లయితే మీ పనికి తగిన గుర్తింపు లభించట్లేదని మీ పైఅధికారులతో నిర్భయంగా మాట్లాడండి. మీరు చేసే పనికి తగిన జీతం లభించట్లేదని కూడా వారితో చర్చించండి. అప్పుడు వారు మీ ధైర్యాన్ని గ్రహించడంతో పాటు మీ పని గురించి సమీక్షించి మీరు అర్హులైతే మీకు ప్రమోషన్ ఇవ్వడం, జీతభత్యాలు పెంచడం.. వంటివి చేస్తారు. దాంతో మీలో ఆత్మవిశ్వాసం, పని పట్ల మక్కువ మరింత పెరుగుతాయి. అలా కాకుండా ఎంత పని చేస్తున్నా ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నట్లయితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మీరు మీ ఉద్యోగంలో ఎదగలేరు. ఉన్నత స్థానాల్ని అధిరోహించలేరు.

పిల్లలు పరీక్షలకు సిద్ధమవుతుంటే..?



పిల్లలకు పరీక్షలు. చదివినవన్నీ జ్ఞాపకం ఉండాలిలి.. చదవడానికి ఓపిక ఉండాలంటే పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలంటున్నారు నిపుణులు.

- పరీక్షలప్పుడు పిల్లల్లో సాధారణంగానే ఆందోళన, ఒత్తిడి మొదలవుతుంది. ఇవి కూడా శరీరంలోని శక్తిని హరిస్తాయి. నిస్సత్తువగా మారుస్తాయి. ఆరోగ్యంతోపాటు జీవక్రియలు సమన్వయం చేయగల శక్తి పిల్లలకు ఉండాలంటే పోషక విలువలున్న బ్యాలెన్స్‌డ్ డైట్ ద్వారానే వీలవుతుంది.
- శరీరం డీహైడ్రేట్ కాకుండా మంచినీళ్లను తాగించాలి. శారీరకంతోపాటు శ్వాస సంబంధిత వ్యాయామాలను చేయిస్తే తగినంత ఆక్సిజన్ అంది, శరీరం శక్తిమంతమవుతుంది.
- కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్లుసహా పాల ఉత్పత్తులు, తాజా కూరగాయలు, పండ్లు వంటివి రోజువారీ ఆహారంలో ఉండాలి. కార్బొహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని తీసుకుంటే నిద్ర వస్తుందని కొందరు భావిస్తారు. కానీ వీటిలో పీచు, చక్కెర స్థాయులు పుష్కలంగా ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగ్గా ఉంచడమే కాకుండా శరీరాన్ని శక్తిమంతంగా మారుస్తాయి.
- అన్నం, గోధుమ, బీన్స్, అరటిపండ్లు వంటివి జీర్ణమవడానికి కొంత సమయం పడుతుంది. దీంతో కాస్తంత మందంగా అనిపించే అవకాశం మాత్రమే ఉంటుంది. అయితే వీటిని పిల్లలకు అందించడం తప్పనిసరి. అలాగే పండ్లు, పాల ఉత్పత్తుల్లోని కార్బొహైడ్రేట్లు, కాల్షియం వంటివి పిల్లలను ఒత్తిడికి దూరంగా ఉంచుతాయి. పండ్లతో చేసే స్మూతీలు రుచికరంగానూ ఉంటాయి. చదువుపై ఏకాగ్రతను పెంచుతాయి.
- మూడుపూట్ల కడుపునిండా తినిపించాలి అనుకోవద్దు. కాస్త వెలితిగానే పెట్టండి. అయితే అన్నిరకాల ప్రయోజనాలూ అందేలా చూడాలి. ఉదయం ఇడ్లీ, దోశ, ఉడికించిన గుడ్లు, పండ్లు, టోస్ట్, కూరగాయల ముక్కలు, మొలకలు ఉంచిన శాండ్‌విచ్ వంటివి కడుపు నిండేలా ఇవ్వాలి.
- మధ్యాహ్నభోజనం తేలికగా అరిగేలా ఉండాలి. ఇందులో తక్కువ మోతాదులో గింజధాన్యాలు, విత్తనాలు వంటివి మంచిది. ఇవి విటమిన్ ఈ, అసంతృప్త కొవ్వులు, ప్రొటీన్లను పుష్కలంగా శరీరానికి అందిస్తాయి. కార్బొహైడ్రేట్లను సమన్వయం చేస్తాయి. ఈ పోషకాలన్నీ మెదడు పనితీరును ఆరోగ్యంగా ఉంచి జ్ఞాపకశక్తిని పెంచుతాయి.
- సాయంకాలం స్నాక్స్‌గా చేప లేదా చికెన్‌ను నూనెతోకాకుండా ఎయిర్‌ఫ్రై చేసి ఇస్తే మంచిది. అలాగే డిన్నర్ తక్కువగా తేలికగా జీర్ణమయ్యేలా క్రీంలేని వెజిటబుల్ లేదా ప్రొటీన్లుండేలా సూప్స్ ఇవ్వాలి.

ఒత్తిడిని మాయం చేస్తాయి

వ్యక్తిగత లేదా వృత్తిపరమైన జీవితాల్లో భాగంగా మనకు అప్పుడప్పుడూ ఎదురయ్యే సమస్యలు మనలో మానసిక ఒత్తిడి, ఆందోళనను కలిగిస్తుంటాయి. ఇలాంటి పరిస్థితులు ప్రస్తుతం అందరి జీవితాల్లోనూ సర్వసాధారణంగా మారిపోయాయి. అందుకే వీటి నుంచి బయటపడడానికి చాలామంది వ్యాయామం, ధ్యానం.. వంటివి చేయడంతో పాటు వారికి నచ్చిన పనులు చేయడం.. వంటి ప్రత్యామ్నాయ మార్గాల్ని కూడా అనుసరిస్తున్నారు. అయితే ఇంట్లో మనం ఎంతో ఇష్టంగా పెంచుకునే కొన్ని మొక్కలు కూడా మనలో ఉండే మానసిక ఆందోళనల్ని దూరం చేస్తాయి. కొన్ని మొక్కలు మన మూడ్‌ని ప్రభావితం చేయడమే కాదు.. ఒత్తిడి, ఆందోళనల్ని తగ్గించి తిరిగి మనల్ని ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి. ఇంతకీ ఆ మొక్కలేంటో తెలుసుకుందాం...



తులసి: మన చుట్టూ ఉండే ఆకుపచ్చని మొక్కలు కంటికి ఇంపుగా కనిపించడమే కాదు.. వాటి నుంచి వెదజల్లే సువాసనలూ మనలోని ఒత్తిడిని దూరం చేస్తాయి. అలాంటి వాటిలో తులసి కూడా ఒకటి. దీనిలో ఉండే లినాలూల్ అనే సమ్మేళనం సువాసనల్ని వెదజల్లుతుంటుంది. దీన్ని పీల్చడం వల్ల ఎంత ఒత్తిడిలో ఉన్నా సరే ఉపశమనం కలుగుతుందట. ఇలా తులసి ఒత్తిడి, ఆందోళనల్ని దూరం చేసి మనసుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది.



రోజ్‌మేరీ: ఇంటీరియర్ డిజైనింగ్‌లో భాగంగా చాలామంది దీన్ని ఇంటి అలంకరణకు ఉపయోగిస్తుంటారు. ఇలా ఇంటి అందాన్ని రెట్టింపు చేసే ఈ మొక్క మానసిక సమస్యల్ని సైతం దూరం చేసి సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది. కారణం దీన్నుంచి వెలువడే సువాసనే. అంతేకాదు దీని నుంచి తయారుచేసిన నూనెను సౌందర్యపరంగా ఉపయోగించడం, వంటకాల్లో వాడడం వంటివి మనకు తెలిసిందే. ఇలా ఇటు ఆరోగ్యాన్నీ, అటు అందాన్ని కూడా పెంపొందిస్తుందీ మొక్క.

గులాబీ: గులాబీ మొక్కతో మనలోని ఒత్తిడి, ఆందోళనలు దూరమవుతాయి. ఓ అధ్యయనం ప్రకారం.. ఒత్తిడితో సతమతమవుతున్న వారు ఈ పూల మొక్క వైపు కాసేపు తదేకంగా చూస్తే చాలు వారి ఒత్తిళ్లన్నీ మాయమై మనసంతా సంతోషంతో నిండిపోతుందట. మరి మీ మూడ్ కూడా సంతోషంగా మారిపోవాలంటే గులాబీ మొక్కపై మీరూ ఓ లుక్కేయండి.



లావెండర్: పర్పుల్ కలర్‌లో కంటికి ఇంపుగా కనిపించే పూల మొక్క లావెండర్. చాలా అరుదుగా కనిపించే ఈ మొక్క ఖరీదు కూడా చాలా ఎక్కువే. ఇది వెదజల్లే సువాసనలు మనలోని మానసిక ఆందోళనల్ని దూరం చేసి మనసుకు ప్రశాంతతను చేకూరుస్తాయి. కాబట్టి ఇంత ఖరీదైన మొక్కను ఇంట్లో పెంచుకునే అవకాశం లేనప్పుడు లావెండర్ ఫ్లేవర్‌తో తయారుచేసిన సెంటెడ్ క్యాండిల్స్, రూమ్ ఫ్రెషనర్స్.. మొదలైన వాటిని ఇంట్లో భాగం చేసుకోవాలి. దాంతో కూడా ఆందోళనగా ఉన్నప్పుడు మన మూడ్‌ని సంతోషంగా మార్చుకునే వీలు ఉంటుంది.

గిరిజనులను గెంటేసేందుకే బీజేపీ కుట్ర..

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేట్ల కోసమే.. : ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న అటవీ భూముల్లో బహుళ జాతి కంపెనీల ప్రవేశానికి అటవీ చట్టాలు అడ్డంకిగా వున్నాయి. విలువైన సహజ వనరులు, ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు ఆటంకంగా వున్న చట్టాలను వారికి అనుకూలంగా సవరించే పని మోడీ ప్రభుత్వం నెత్తినెత్తుకుంది. అందుకు కొత్త నియమ నిబంధనలు ప్రతిపాదించింది. అటవీ ప్రాంతంలో లీనియర్ ప్రాజెక్టులను (జాతీయ రహదారులు, పైపులైన్లు, ట్రాన్స్‌మిషన్...) ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. లీనియర్ ప్రాజెక్టుల నిర్మాణానికి గిరిజన గ్రామసభ అనుమతి అక్కర్లేదని 2013లో కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ జారీ చేసిన ఉత్తర్వులను 2019లో ఎ.పి హైకోర్టు కొట్టేసింది. గిరిజన గ్రామసభకు వున్న విస్తృత అధికారాన్ని న్యాయస్థానం గుర్తించడంతో, ముసాయిదా బిల్లులో గ్రామసభను సంప్రదించాలని మాత్రమే కేంద్ర బీజేపీ ప్రభుత్వం పేర్కొన్నది.

నిబంధనలకు పాతర..

అటవీ సంరక్షణ చట్టం 1980 ప్రకారం అటవీ భూమిని ఇతర ప్రయోజనాలకు వినియోగించాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా చట్టంలోని నిబంధనలు పాటించాలి. 1. ముందుస్తు గ్రామసభ అనుమతి తీసుకోవాలి. 2. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి. 3. అడవులు పెంచడానికి ప్రత్యేక భూమి కేటాయించాలి.



ఈ నిబంధనలు కార్పొరేట్ శక్తులకు అడ్డుగా వుండడంతో వీటికి సవరణ పేరుతో పాతరేసింది. మైనింగ్ కోసం ఐదు హెక్టార్ల భూమిని డి-రిజర్వ్ చేయడానికి, ఆక్రమణ భూమిని క్రమబద్ధీకరించడానికి కేంద్ర ప్రభుత్వ సలహా కమిటీ సిఫార్సు అవసర మనీ, 2003లో జారీ చేసిన నియమాలను పక్కనబెట్టి, మోడీ సర్కారు కొత్త నియమాలు తీసుకొచ్చింది. క్లాజ్ 9(బి)-1 ప్రకారం గ్రామసభ లేదా హక్కుల పరిష్కార ప్రస్తావన లేదు. క్లాజ్ 9(బి)-2 ప్రకారం డి-రిజర్వుడు ఆర్డర్‌ను జారీ చేయడానికి గ్రామసభకు వున్న అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం బలవంతంగా లాక్కొన్నది. ఈ నిబంధనలు అమల్లోకి వస్తే ఆదివాసుల హక్కులు హరించబడతాయి.

సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా..

కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును కూడా పరిగణలోకి తీసుకోవటం లేదు. ఆదివాసుల సాంప్రదాయ హక్కులతో ముడిపడిన హక్కుల నిర్ధారణ తర్వాతే... అటవీ భూమి మళ్లింపు అనుమతులను పరిశీలించాలని ఒడిశా మైనింగ్ కార్పొరేషన్‌కు కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖకు మధ్య నడిచిన కేసులో...2013 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అటవీ హక్కుల అమలు విషయంలో గ్రామసభ పాత్రను, అటవీ భూమి మళ్లింపు విషయంలో వాటి అనుమతి అవసరాన్ని తీర్పులో స్పష్టం చేసింది. అయినా మోడీ సర్కారు మొండిగా గ్రామసభ, అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులను లెక్క చేయకుండా రాజ్యాంగ హక్కులను హరిస్తున్నది.

ఉద్యమమే..

అటవీ భూముల వాడకంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రమాదకరమని పలువురు రాజకీయ, పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమల ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు కేంద్రం సిద్ధపడితే..గిరిజనులు, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించారు. దీంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గింది. ఈ తరహాలోనే కేంద్రం తెస్తున్న నియమాలను నిలవరించేందుకు తగిన విధంగా ఉద్యమాలను నిర్మించటమొక్కటే మార్గమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రయివేటు డెవలపర్స్‌కు అన్ని అనుమతులు కేంద్రమే ఇచ్చిన తర్వాత..ఇక కలెక్టర్లతో పనేముంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. గిరిజనుల హక్కులు,పరిరక్షణ, అంతా తూతూమంత్రంగా చేయటం తగదని వారు హితవు పలుకుతున్నారు.

మాణిక్‌రెడ్డికే మా మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

నిలిచిందని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కూడా తమ సమస్యలపై పోరాడుతున్నారని తెలిపారు. తమ పోరాటాలకు మద్దతుగా నిలుస్తున్న, సమస్యల పరిష్కారం కోసం కొట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు.

ఈడీకి మరిన్ని అధికారాలు

(మొదటిపేజీ తరువాయి)

లాండరింగ్ చట్ట' (పీఎంఎల్‌ఏ) పరిధిని మరింత విస్తరిస్తూ, 'ఎన్‌ఫోర్స్‌మేంట్ డైరెక్టరేట్‌'ను రాజకీయ ఆయుధంగా మార్చుతోంది. ప్రతి రాష్ట్రంలో రాజకీయ నాయకుల్ని, ఎన్జీవో సంస్థల్ని 'ఈడీ' టార్గెట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్షాల ప్రభుత్వాల్ని కూల్చడానికి ఈడీ సోదాలు, సీబీఐ కేసులు, ఐటీ దాడుల్ని...మోడీ సర్కార్ ప్రయోగిస్తూ వస్తోంది. తద్వారా ప్రతిపక్షాల్ని బలహీనపరుస్తూ ఆయా రాష్ట్రాల్లో రాజకీయ లక్ష్యాల్ని సాధించుకుంటోందన్న విమర్శలున్నాయి. మరికొద్ది నెలల్లో దేశమంతటా సార్వత్రిక ఎన్నికల వేడి ఏర్పడనున్నది. ఈ నేపథ్యంలో 'ఈడీ' అధికారాల్ని విస్తరిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ తాజాగా రెండు నోటిఫికేషన్లు జారీచేయటం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఏమిటా మార్పులు?

రాజకీయ నాయకులు, ప్రముఖులు, రాష్ట్రాల సీఎంలు, రాష్ట్ర ప్రభుత్వ అధిపతులు, సీనియర్ నాయకులు, సైనిక అధికారులు, న్యాయ వ్యవస్థ, మిలటరీ ఉన్నతాధికారులు, రాష్ట్రాల కార్పొరేషన్ అధిపతులు, ప్రముఖ రాజకీయ పార్టీల ప్రతినిధులు..వీరందర్నీ 'పొలిటికల్లీ ఎక్స్‌పోజ్డ్ పర్సన్స్'గా (పీఈపీ) నోటిఫికేషన్ పేర్కొన్నది. ఈ నోటిఫికేషన్ ప్రకారం, వీరి ఆర్థిక లావాదేవీల్ని ప్రత్యేకంగా వర్గీకరిస్తూ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇకపై ఆ సమాచారాన్ని నిల్వ చేయాల్సి ఉంటుంది. ఈడీ ఎప్పుడు కావాలంటే, అప్పుడు ఆ సమాచారం పొందే అధికారముంది. ఎన్జీవో సంస్థల నగదు లావాదేవీల్ని బ్యాంకులు ప్రత్యేకంగా వర్గీకరిస్తాయి. తమ క్లయింట్స్ వివరాల్ని 'నిటి ఆయోగ్'కు తెలపాల్సి ఉంటుంది. ఆర్థిక లావాదేవీల చరిత్ర అంతా ఈడీకి అందుబాటులో ఉంచుతాయి. ఆర్థిక సమాచారాన్ని బ్యాంకులు ఎలా అందజేయాలి, ఎంతకాలం పాటు ఆ సమాచారాన్ని నిల్వ ఉంచాలి? అన్నది వివరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే..దేశంలోని ప్రతిఒక్క రాజకీయ ప్రముఖుడి ఆర్థిక సమాచారం ఇకపై ఈడీకి అందుబాటులో రానున్నది.

121 మందిపై ఈడీ దాడులు

ఈ ఏడాది రాజస్థాన్, తెలంగాణ, కర్నాటక సహా కీలక రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2024 మే తర్వాత సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. పలు రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థులపైకి కేంద్ర దర్యాప్తు సంస్థల్ని మోడీ సర్కార్ ఉసిగొల్పుతోంది. కేసుల పేరుతో వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతోంది. 2014 తర్వాత ప్రతిపక్షాలకు చెందిన 121మంది రాజకీయ నాయకులపై ఈడీ దాడులు జరిగాయి. బీహార్‌లో ఆర్జేడీ నేతలపై గతకొన్ని రోజులుగా ఈడీ దాడులు చేస్తోంది. దేశవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎన్జీవోలను కేంద్రం టార్గెట్ చేస్తోంది. ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనల్ని కఠినతరం చేసి విదేశాల నుంచి ఎన్జీవో సంస్థలు విరాళాలు స్వీకరించకుండా చేసింది.

దాచుకున్న డబ్బులేవి..!

(మొదటిపేజీ తరువాయి)

జమ అవుతాయి. కానీ "ప్రభుత్వ అనుమతి కోసం" అని దరఖాస్తుదారులకు సమాధానం వస్తోంది. ఏండ్లకొద్ది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కారణం ప్రభుత్వం వద్ద నిధుల్లేకనని కార్మిక సంఘాలు చెప్తున్నాయి. ప్రభుత్వం తమ సమస్యలు గుర్తించి సకాలంలో డబ్బులు జమ అయ్యేట్టు చూడాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఆర్‌బీఐ నుంచి ఖాతాలో జమ అవుతాయి

జనరల్ ప్రావిడెంట్ ఫండ్ కోసం వచ్చిన దరఖాస్తులు జిల్లాలో సుమారు నాలుగు వేల వరకు ఉంటాయి. ఇక్కడి నుంచి ప్రభుత్వానికి పంపించాం. ఈ కుబేరు నుంచి ఆర్‌బీఐకి వెళ్తుంది. ఆర్‌బీఐ నుంచి డబ్బులు నేరుగా దరఖాస్తుదారుల ఖాతాలో జమ అవుతాయి.

- వెంకట్‌రెడ్డి , రంగారెడ్డి జిల్లా డీటీవో

తేజస్వీ యాదవ్ నివాసంలో ఈడీ సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

ఘజియాబాద్‌లోని సమాజ్‌వాదీ పార్టీ నేత జితేంద్ర యాదవ్ నివాసానికి కూడా ఈడీ అధికారులు చేరుకున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రాగిణి భర్త జితేంద్ర యాదవ్. ఉద్యోగాలు ఇప్పించేందుకు కొంతమంది అభ్యర్థుల నుంచి ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం భూములు తీసుకుందని 'ల్యాండ్ ఫర్ జాబ్' కేసులో అభియోగాలు నమోదయ్యాయి. లాలూ, ఆయన భార్య రబ్రీదేవిని కొద్ది రోజుల క్రితం సీబీఐ ప్రశ్నించింది. తాజా తనిఖీల్లో ఆయన కుమారుడు, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఢిల్లీ నివాసం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. బీహార్, ఉత్తరప్రదేశ్, ముంబయిలోని ఆయన కుటుంబానికి చెందిన పదులకుపైగా ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. లాలూ సన్నిహితుడు, ఎమ్మెల్యే అబూ దోజానా ఇంట్లో తనిఖీలు చేపట్టారు. మనీలాండరింగ్ కేసులో భాగంగా ఆధారాలను గుర్తించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్టు ఈడీ సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2004 నుంచి 2009 వరకు కేంద్రలో యూపీఏ హయాంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్నారు. ఈ క్రమంలోనే 2008-09 మధ్య రైల్వే ఉద్యోగాలకు నియామక ప్రక్రియ జరగ్గా..కొందరు అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు వారి నుంచి లాలూ కుటుంబం భూములు, ఇతర ఆస్తులను లంచంగా తీసుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై సీబీఐ విచారిస్తోంది. ఇప్పుడు మనీలాండరింగ్ విచారణలో భాగంగా ఈడీ సోదాలు నిర్వహించింది.

జిన్‌పింగ్‌కు మూడోసారి అధ్యక్ష బాధ్యతలు

(మొదటిపేజీ తరువాయి)

మూడోసారి పార్టీ పగ్గాలు అందుకున్న తొలినేతగా జిన్‌పింగ్ ఘనత సాధించారు. మొత్తం 2950మందికిపైగా సభ్యులు జిన్‌పింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక తర్వాత జిన్‌పింగ్ రాజ్యాంగంపై ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. హన్ జెంగ్‌ను దేశ ఉపాధ్యక్షుడిగా పార్లమెంట్ ఎన్నుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద సైన్యంగా గుర్తింపు తెచ్చుకున్న 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ'కి నాయకత్వం వహించే 'కేంద్ర మిలటరీ కమిషన్' చైర్మెన్‌గా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఎన్నుకుంటూ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ శుక్రవారం తీర్మానించింది.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఊహించని ట్విస్ట్

(మొదటిపేజీ తరువాయి)

అయ్యారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఉపసంహరించుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరుతూ కోర్టులో దరఖాస్తు చేశారు. పిళ్లై దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు.. ఈడీకి నోటీసులు పంపించింది. శనివారం రామచంద్ర పిళ్లై వాంగ్మూలం ఆధారంగానే కవితను విచారించేందుకు ఈడీ సిద్ధమవుతున్నది. నిజానికి 9న ఆమెను విచారించాల్సి ఉంది. అయితే ఆమె ముందుగానే ఖరారైన షెడ్యూల్ కారణంగా విచారణకు హాజరు కాలేకపోతున్నానని.. 11న విచారణకు హాజరవుతానని ఈడీకి తెలిపారు. ఈ నేపథ్యంలో అరుణ్ రామచంద్ర పిళ్లై ట్విస్ట్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది.

ఇప్పటికే పిళ్లై తన వాంగ్మూలంలో తను కవిత బినామీనని చెప్పారు. అలాగే ఆమె చెప్పినందునే తన ఖాతాలోకి రూ.32 కోట్లు వచ్చాయని ఈడీకి తెలిపారు. అలాగే కోటి రూపాయలు సైతం ఆయన సొంత అకౌంట్‌లో పడ్డాయి. అలాగే ఢిల్లీ లిక్కర్ స్కాంలో సౌత్ గ్రూప్‌నకు 32.5 శాతం వాటాలున్నాయి. వీటిలో సైతం కవితకు వాటాలందాయని ఈడీ చెబుతోంది. రేపు కవితను అరుణ్ రామచంద్ర పిళ్లై సమక్షంలోనే విచారించనున్నారు.

మనీశ్ సిసోడియాకు వారం రోజులు కస్టడీ పొడిగింపు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు మరో వారం రోజుల ఈడీ కస్టడి పొడిగించింది. అంతకు ముందు సిసోడియాను 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో ఈడీ కోరింది. ఇప్పటివరకూ ఆయన సీబీఐ రిమాండ్‌లో ఉన్నారు. సీబీఐ రిమాండ్‌పై విచారణ ఇప్పటికే ఈనెల 21కి వాయిదా పడగా తాజాగా న్యాయస్థానం ఆయనను వారం రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. మనీశ్ సిసోడియాతో పాటు కలిపి విచారించేందుకు ఇప్పటికే ఏడుగురికి నోటీసులు జారీ చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు తెలిపారు.

శ్రమ జీవుల సంస్కృతిని సర్వనాశనం చేస్తున్న మనువాదం

- దాన్ని ప్రతిఘటించాలి
- ప్రొఫెసర్ కంచ ఐలయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

శ్రమ జీవుల పోరాటాలను, సంస్కృతిని, వేల సంవత్సరాలుగా దేశనిర్మాణం కోసం చేసిన మహత్తర ప్రక్రియను సర్వనాశనం చేస్తున్న మనువాదాన్ని ప్రతిఘటించాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. సావిత్రి బాయి పూలే 126వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వేచ్ఛ జేఏసీ అధ్వర్యంలో సావిత్రి బాయి యాదిలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, మతోన్మాదం, మనువాదాన్ని వ్యతిరేకిద్దాం అంటూ సాంస్కృతికోత్సవాలు ఆటపాట నిర్వహించారు. ఈ సందర్భంగా కంచ ఐలయ్య మాట్లాడుతూ.. విభిన్న సంస్కృతుల మధ్య జరుగుతున్న పోరాటలపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి పాటలు, నాటికలు, పాటలు రాయాలన్నారు. జేఏసీ కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ.. మనువాదుల దాడులను ప్రతిఘటించడానికి, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాటానికి స్వేచ్ఛ జేఏసీ ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా కవి జయరాజ్, అరుణోదయ గాయకులు విమలక్క, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, కళాకారులు మష్టార్జీ, పులి కల్పన, భాస్కర్, స్వేచ్ఛ జేఏసీ భాగస్వామ్య సంస్థల నాయకులు కొల జనార్ధన్, జిడి సారయ్య, సంధ్య, ఝాన్సీ, వరలక్ష్మి, పి.శంకర్, తదితరులు ప్రసంగించారు.

బిజినెస్



రూ.1.6 లక్షల కోట్లు ఆవిరి


- సెన్సెక్స్ 671 పాయింట్ల పతనం
- ఒత్తిడిలో పలు అదానీ షేర్లు

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాలు చవి చూశాయి. గురువారం సెషన్‌లో పలు అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలకు తోడు దేశీయంగా రిలయన్స్, అదానీ, హెచ్‌డిఎఫ్‌సి షేర్ల పతనంతో మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. ఉదయం నుంచే నష్టాల బాటలో ప్రారంభమైన బిఎస్ఇ సెన్సెక్స్ తుదకు 671 పాయింట్లు లేదా 1.12 శాతం పతనమై 59,135కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 177 పాయింట్లు కోల్పోయి 17,413 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 58,885, నిఫ్టీ 17,324 కనిష్ట స్థాయిల వద్ద నమోదయ్యాయి. బిఎస్ఇలోని లిస్టెడ్ స్టాక్స్ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.262.7 లక్షల కోట్లకు పడిపోయింది. దీంతో ఇన్వెస్టర్లు ఒక్క పూటలోనే రూ.1.6 లక్షల కోట్లు నష్టపోయినట్లయ్యింది. బిఎస్ఇలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్క శాతం చొప్పున పడిపోయాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అధికంగా 2.6 శాతం నష్టపోగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్అండ్‌టి, మహీంద్రా అండ్ మహీంద్రా, ఆసియన్ పెయింట్స్ 1.5 శాతం వరకు నష్టపోయి.. సూచీలను మరింత ఒత్తిడికి గురి చేశాయి. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్ రంగాల సూచీలు అధికంగా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

ప్రధాన కారణాలు..


అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు వర్థమాన దేశాల మార్కెట్లపై పడింది. అమెరికా ఫ్యూచర్ మార్కెట్లు నష్టాలను చవి చూశాయి. అమెరికా కేంద్రంగా పని చేస్తున్న ఎస్‌విబి ఫైనాన్షియల్ గ్రూప్ సంక్షోభం అంచుకు చేరుకుందన్న వార్తలు అమెరికా బ్యాంకింగ్ స్టాక్స్‌ను తీవ్ర కలవరానికి గురి చేశాయి. ఆ బ్యాంక్ మార్కెట్ కాపిటలైజేషన్ 80 బిలియన్ డాలర్లు తుడుచుకుపెట్టుకుపోయింది. ఇది భారత బ్యాంకింగ్ స్టాక్స్‌పై ప్రభావం చూపింది. అదాని గ్రూపు కంపెనీల షేర్లు మిశ్రమంగా నమోదయ్యాయి. ప్రధానమైన అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ 2.9 శాతం పతనమై 1,896.45కు దిగజారింది. అదాని విల్మర్ సూచీ 4.5 శాతం, ఎన్‌డిటివి 5 శాతం చొప్పున నష్టపోయాయి.

18 ఏండ్ల తర్వాత ఐపిఒకు టాటా కంపెనీ



ముంబయి : టాటా గ్రూపు నుంచి 18 ఏండ్ల తర్వాత ఓ కంపెనీ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వస్తోంది. ఐపిఒ కోసం సెబీకి టాటా టెక్నలాజీస్ ప్రతిపాదన పత్రాలను సమర్పించింది. ఇందులోని టాటా మోటార్స్ సహా మరో ఇద్దరు ఇన్వెస్టర్లు 23.60 శాతం వాటాను విక్రయించనున్నారు. దీనికి సమానమయ్యే 95,708,984 ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ఈ ఆఫర్‌లో భాగంగా టాటా మోటార్స్ లిమిటెడ్ 81,133,706 ఈక్విటీ షేర్లను, అల్ఫా టిసి హోల్డింగ్స్ పిటిఇ లిమిటెడ్ 9,716,853 ఈక్విటీ షేర్లను, టాటా క్యాపిటల్ గ్రోత్ ఫండ్ సంస్థ 4,858,425 ఈక్విటీ షేర్లను విక్రయించనున్నాయి. ఈ కంపెనీలకు టాటా టెక్నాలజీస్ పెయిడ్ అప్ షేర్ క్యాపిటల్‌లో వరుసగా 20 శాతం, 2.40శాతం, 1.20 శాతం చొప్పున వాటాలను అమ్మనున్నాయి. టాటా గ్రూపు చివరి సారిగా 2004లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ను ఐపిఒకు తెచ్చింది. ఆ తర్వాత ఇప్పుడు టాటా టెక్నలాజీస్ ఇష్యూకు సిద్ధం అయ్యింది.

యాక్సిస్ బ్యాంక్ ఎఫ్‌డీలపై వడ్డీ పెంపు



న్యూఢిల్లీ: ప్రయివేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించింది. రూ.2 కోట్ల కంటే తక్కువ మొత్తాలపై 40 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేటును పెంచినట్లు పేర్కొంది. సాధారణ డిపాజిటర్లు 7 రోజుల నుంచి 45 రోజుల వ్యవధి గల ఎఫ్‌డీలపై ఇక నుంచి 3.50 శాతం కనిష్ఠ వడ్డీని పొందవచ్చని పేర్కొంది. 13 నెలల నుంచి 2 సంవత్సరాల ఎఫ్‌డీలపై 7.15 శాతం, 2 ఏండ్ల నుంచి 30 నెలల ఎఫ్‌డీలపై 7.26 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. సీనియర్ సిటిజన్లు గరిష్ఠంగా 8.01 శాతం వడ్డీ పొందే వీలుందని తెలిపింది.

డిగ్జాన్‌తో అర్జూ భాగస్వామ్యం



ముంబయి: డిగ్జాన్, ఇతర సంస్థలతో భాగస్వామ్యం ద్వారా వినియోగదారుల గృహోపకరణాల ఉత్పత్తులను విడుదల చేసినట్లు అర్జూ తెలిపింది. కన్స్యూమర్ డ్యూరెబుల్ వేదిక అయిన అర్జు ఇప్పుడు స్మార్ట్ శ్రేణీ గృహోపకరణాల నిర్మాణంపై దృష్టి సారించినట్లు పేర్కొంది. ఈ భావితరపు ఉత్పత్తులు నూతన తరపు సాంకేతికతలు, అత్యున్నత నాణ్యత, డిజైన్లతో తీర్చిదిద్దబడ్డాయని అర్జూ సిఇఒ, కో ఫౌండర్ ఖుష్నుద్ ఖాన్ పేర్కొన్నారు. తాము ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ తయారీలోని కీలక డిగ్జాన్, అంబర్ సహా పలు గ్రూప్‌లతో భాగస్వామ్యం చేసుకుందన్నారు.

సర్వికల్ క్యాన్సర్ ప్రమాద ఘంటికలు

- కార్కినోస్ వెల్లడి



హైదరాబాద్ : దేశంలో సర్వికల్ క్యాన్సర్ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని ఆంకాలజీ టెక్నలాజీ వేదిక కార్కినోస్ హెల్త్‌కేర్ పేర్కొంది. ప్రతీ ఎనిమిది నిమిషాలకు ఓ మహిళ సర్వికల్ క్యాన్సర్ బారిన పడుతున్నారని పలు నివేదికలు వెల్లడించాయని గుర్తు చేసింది. మూడు రోజుల పాటు సాగిన బిజినెస్ వుమెన్ ఎక్స్‌పో 2023లో కార్కినోస్ హెల్త్‌కేర్ కో ఫౌండర్ సుప్రియ రావ్ మాట్లాడుతూ.. మాతృమూర్తులతో పాటుగా కుమార్తెలను ఈ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను కార్కినోస్ నొక్కి చెప్పారు. అంతర్జాతీయంగా సర్వికల్ క్యాన్సర్ కేసుల మరణాల్లో నాలుగో వంతు భారత్‌లోనే చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రతీ ఏడాది 6 లక్షల కొత్త కేసులు నమోదు కాగా.. 3,41,831 మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వ్యాధి తీవ్రతను ముందుగానే గుర్తించడం ద్వారా కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఎక్సాన్ మొబిల్ నుంచి కొత్త చమురు

హైదరాబాద్ : ఎక్సాన్ మొబిల్ కొత్తగా పూర్తి సింథటిక్ ఇంజిన్ ఆయిల్ అయినా మొబిల్ 1 ట్రిపుల్ యాక్షన్ పవర్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇది ఇంధన పొదుపు అదనపు ప్రయోజనంతో పాటు అద్భుతమైన ఇంజిన్ పనితీరు, రక్షణ, పరిశుభ్రతను అందిస్తుందని ఆ కంపెనీ పేర్కొంది.

కారు యాజమానులకు వారి వాహనాల్లో శక్తిని అన్‌లాక్ చేయడంలో సాయపడేందుకు ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపింది. మొబిల్ 1 ఇంజిన్ ఆయిల్స్‌ని ప్రపంచంలో అత్యంత కఠినమైన, అత్యంత తీవ్రమైన ట్రాక్‌ల్లో పరీక్షించామని ఎక్సాన్ మొబైల్ లూబ్రికెంట్స్ సిఇఒ విపిన్ రాణా పేర్కొన్నారు.

మరో అమెరికన్ బ్యాంక్ దివాళా..!

- తీవ్ర సంక్షోభంలో ఎస్‌విబి నిధుల కటకట
- పెరిగిన నష్టాలు
- కంపెనీ షేర్ 60% పతనం
- ఒక్క పూటలో రూ.6.5 లక్షల కోట్లు ఆవిరి



వాషింగ్టన్ : అమెరికాలో ఆర్థిక సంక్షోభం ముదురుతోంది. అతిపెద్ద అమెరికా వాణిజ్య బ్యాంక్‌ల్లో ఒక్కటైన సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి) తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకుంది. 2008 నాటి లెమన్ బ్రదర్స్ సంక్షోభాన్ని మర్చిపోకముందే ఈ ఘటన చోటు చేసుకోవడం ప్రపంచ దేశాలను తీవ్ర ఆందోళన గురి చేస్తోంది. ఎస్‌విబి ఫైనాన్షియల్ గ్రూప్ నిధుల సమీకరణ పడిపోవడం, సెక్యూరిటీస్ పోర్టుపోలియోలో నష్టాలు పెరగడంతో ఆ బ్యాంక్ బాండ్లు, షేర్లు భారీ పతనాన్ని (క్రాష్) చవి చూశాయి. శాంటా క్లారాలో ప్రధాన కార్యాలయం కలిగి పని చేస్తున్న ఈ బ్యాంక్ డిపాజిట్లు, రుణాలు ఇవ్వడం, ట్రెజరీ నిర్వహణ, ఆన్‌లైన్ బ్యాంకింగ్, విదేశీ మారక వాణిజ్యం, అనేక ఇతర విత్త సేవలను నిర్వహిస్తుంది. ఇది అంతర్జాతీయ బ్యాంకింగ్‌ను కూడా అందిస్తూ అమెరికాలో ప్రధాన బ్యాంక్‌గా పరిగణించబడుతోంది. ఫోర్చూన్.కమ్ రిపోర్ట్ ప్రకారం.. యుఎస్‌లోని 50 శాతం వెంచర్ బ్యాక్డ్ (టెక్, స్టార్టప్) కంపెనీలకు సేవలందిస్తుంది. దేశంలోని సంపన్నులందరూ ఈ బ్యాంక్ సేవలను పొందుతున్నారు.

ఏమి జరిగింది..!

సంక్షోభం నుంచి గట్టెక్కడానికి ఎస్‌విబి గ్రూపు 21 బిలియన్ల సెక్యూరిటీలను విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు 2.25 బిలియన్ డాలర్ల విలువ చేసే షేర్లను అమ్మకానికి పెట్టింది. నిధుల సమీకరణ కోసం వాటాలను విక్రయానికి పెట్టగా విఫలమైందని రిపోర్టులు వచ్చాయి. ప్రస్తుత వారం ప్రారంభంలోనే ఈ సంక్షోభం బయటికి వచ్చినట్లు రిపోర్టులు వస్తున్నాయి. అమెరికా ట్రెజరీ పోర్టుపోలియోలను నష్టాలకు విక్రయించిందని సమాచారం. బ్యాంక్ వద్ద డిపాజిట్లు కరిగిపోవడంతో ఈ పరిస్థితి చోటు చేసుకుంది. మరోవైపు ఇచ్చిన రుణాలపై వచ్చే నికర వడ్డీ ఆదాయంలో కూడా క్షీణతను చవి చూసింది. వీటికి తోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వరుసగా వడ్డీ రేట్లను పెంచుతోంది. దీంతో తనఖా సెక్యూరిటీలపై అధికంగా వడ్డీ చెల్లించాల్సి రావడం మరింత ఒత్తిడిని పెంచింది.

యూరప్ బ్యాంక్‌లపై ప్రభావం

అనిశ్చితి పరిణామాలతో గురువారం సెషన్‌లో ఎస్‌విబి షేర్ విలువ 60 శాతం పతనమయ్యింది. దీంతో ఒక్క పూటలోనే దాదాపు 80 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6.5 లక్షల కోట్లు) మార్కెట్ విలువ కోల్పోయింది. ఆ బ్యాంక్ షేర్లు మాత్రమే కాకుండా బాండ్ల విలువ కూడా భారీ పతనాన్ని చవి చూసింది. ఆ బ్యాంక్ 35 ఏళ్ల ట్రేడింగ్‌లో అతిచెత్త సెషన్‌గా నమోదయ్యింది. ఇది యూరప్‌లోని బ్యాంకింగ్ స్టాక్స్‌ను గత తొమ్మిది మాసాల్లో ఎప్పుడూ లేని విధంగా పడేసింది.

వరుసగా రెండో రోజూ అమెరికన్ బ్యాంక్‌ల సూచీలు పతనాన్ని చవి చూశాయి. భారత్‌లోని దిగ్గజ బ్యాంక్ షేర్లపైన ఒత్తిడి చోటు చేసుకుంది. ఎస్‌విబి ప్రభావంతో వారాంతం సెషన్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 2.63 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 2.27 శాతం, ఎస్‌బిఐ 2.12 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.06 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.89 శాతం చొప్పున పడిపోయాయి. నిఫ్టీలో బ్యాంకింగ్ సూచీ 1 శాతం నష్టపోయింది.

డబ్బు సురక్షితమేనా..?

ఎస్‌విబి ట్రెజరీ పోర్టుపోలియోలో సగటున 1.79శాతం రాబడిని ఇస్తోంది. ఇది ప్రస్తుత 10-సంవత్సరాల ట్రెజరీ దిగుబడి 3.9 శాతం కంటే చాలా తక్కువగా ఉందని రాయిటర్స్ తెలిపింది. దీంతో పెట్టుబడిదారుల డబ్బు సురక్షితంగా ఉందా..? నష్టాలను భర్తీ చేయడానికి నిధుల సేకరణ సరిపోతుందా..? అనే ఆందోళనలను పెంచింది. ఈ పరిణామాలు పీటర్ థీల్ ఫౌండర్స్ ఫండ్, కోట్యు మేనేజ్‌మెంట్, యూనియన్ స్క్వేర్ వెంచర్స్‌తో సహా అనేక మంది ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్టులను తీవ్ర భయాందోళనలకు గురి చేశాయి. ఆ బ్యాంక్ సుస్థిర వ్యాపారంపై అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు. అనిశ్చితిని ఎదుర్కొంటున్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్ పరపతిని సమీక్షించనున్నట్లు గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ పేర్కొంది.

భవిష్యత్తు భయానకమే..!

చాలా మంది నిపుణులు ఈ సంక్షోభాన్ని లెమాన్ బ్రదర్స్ సంక్షోభం, ఎన్రాన్ కార్పొరేషన్‌తో పోల్చుతున్నారు. మరోవైపు అమెరికా మాంద్యం అంచున ఉంది. దీనికి తోడు వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్న సమయంలో సంక్షోభం ఏర్పడింది. టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు తమ డబ్బును బ్యాంకు నుండి బయటకు తీయడాన్ని కొన సాగిస్తే, ఎస్‌విబి గ్రూప్ దివాళా తీయడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అదే జరిగితే మాంద్యం మరింత పెరగడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదాన్ని సష్టించగలదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్తి పన్నును వ్యతిరేకిస్తూ నేడు జమ్ముకాశ్మీర్‌లో బంద్

శ్రీనగర్ : కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకాశ్మీర్‌లో మోడీ ప్రభుత్వం విధించిన ఆస్తిపన్నుతో కాశ్మీర్‌లోయలో కలకలం మొదలైంది. ఈ పన్నును వ్యతిరేకిస్తూ శనివారం ప్రతిపక్షాలు, వ్యాపారులు, వాణిజ్య సంస్థలతో పాటు స్థానిక బిజెపి విభాగం జెసిసిఐ కూడా ఈ బంద్‌కు పిలుపునివ్వడం గమనార్హం. మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. ఏప్రిల్ 1 నుండి అమల్లోకి రానున్న ఈ పన్నును ఉపసంహరించుకోవాలని ధ్వజమెత్తాయి. ఆస్తిపన్ను విధించే అధికారం ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఉందని, పన్ను విధించేందుకు ఓ విధానముందని జమ్ము చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (జెసిసిఐ) అధ్యక్షుడు అరుణ్ గుప్తా పేర్కొన్నారు. ప్రస్తుతం జమ్ముకాశ్మీర్‌లో ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వం లేదని అన్నారు. ఈ సమస్యపై నిర్ణయం తీసుకోవడానికి ఎన్నికైన మున్సిపాలిటీలను పరిపాలనా యంత్రాంగం అనుమతించాలని అన్నారు. ఎస్ఆర్ఒ జారీ చేయడం ద్వారా పరిపాలనా యంత్రాంగం స్థానిక సంస్థలను దాటవేసిందని అన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) ఆస్తిపన్ను విధించడం దురదృష్టకరమని.. ఇది ఎన్నికైన ప్రభుత్వానికి వచ్చే ప్రత్యేకాధికారమని చెప్పారు. సంప్రదింపులు, చర్చలు, సలహాలులేకుండా ఏకపక్షంగా పన్ను విధింపు నిర్ణయాన్ని తీసుకున్నారని మండిపడ్డారు. జెసిసిఐ జమ్ము ప్రాంతంలోని ప్రముఖ వ్యాపారుల కూటమి. బిజెపికి కంచుకోటగా ఉన్న జెసిసిఐ సమ్మెకు పిలుపునివ్వడంతో.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావచ్చని రాజకీయ విమర్శకులు పేర్కొంటున్నారు. ఆస్తిపన్ను విధించని ఏకైక రాష్ట్రం జమ్ముకాశ్మీర్. ఆర్టికల్ 370 రద్దు ముందు వరకు ప్రజల ఆందోళనలతో పాలక ప్రభుత్వాలు ఆ పన్ను నిర్ణయాన్ని వెనక్కుతీసుకున్నాయి.

నేడు ఈడీ ముందుకు కవిత

- లిక్కర్ స్కామ్‌లో విచారించనున్న అధికారులు
- మనీశ్ సిసోడియా, రామచంద్రపిళ్లైలతో కలిపి ప్రశ్నించే అవకాశం
- ఢిల్లీకి హుటాహుటిన వెళ్లిన మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-ప్రత్యేకప్రతినిధి

దేశంలో సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె. కవిత శనివారం ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి ఆమె వెళ్లనున్నట్టు సమాచారం. కాగా, ఈ స్కామ్‌లో హవాలా ద్వారా వంద కోట్ల రూపాయలు ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియాకు చేరినట్టు వచ్చిన అభియోగాలపై కవితను ప్రశ్నించనున్నారని తెలిసింది. ఇప్పటికే ఈ స్కామ్‌లో కవిత పాత్ర ఉన్నట్టుగా ఇప్పటికే అరెస్టైన ఆడిటర్ బుచ్చిబాబు, అభిషేక్ బోయిన్‌పల్లి, రామచంద్రపిళ్లైల నుంచి ఈడీ అధికారులు వాంగ్మూలాన్ని సేకరించారు. కాగా, తాజాగా ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియాను అరెస్టు చేసిన ఈడీ అధికారులు అతని రిమాండ్ రిపోర్టులో సైతం పలు మార్లు కవిత పేరును పేర్కొన్నారు. అలాగే ఈ కేసు తదుపరి విచారణ నిమిత్తం సిసోడియాను శుక్రవారం నుంచి ఏడు రోజుల పాటు ఈడీ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఇప్పటికే మరో నిందితుడు రామచంద్రపిళ్లైను కూడా ఈడీ కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నది. ఈ నేపథ్యంలో విచారణకు హాజరుకానున్న కవితను మనీశ్ సిసోడియా, రామచంద్రపిళ్లైలతో కలిపి ఈడీ అధికారులు విచారించే అవకాశాలున్నాయని తెలుస్తున్నది. ముఖ్యంగా, హవాలా రూపంలో కవితతో పాటు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, రామచంద్రపిళ్లైలతో కూడిన సిండికేటు ఆడిటర్ బుచ్చిబాబు ద్వారా హవాలా రూపంలో ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియాకు లిక్కర్ పాలసీ మార్పునకు సంబంధించి అందజేసి నట్టుగా చెప్తున్న వంద కోట్ల రూపాయల గురించి ఈడీ నిశితంగా కవితను ప్రశ్నించే అవకాశాలు న్నాయని తెలుస్తున్నది. ఇదిలా ఉంటే, కవితకు తాను బినామీనంటూ రామచంద్రపిళ్లై ఇదివరకు ఈడీ కిచ్చిన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు అతని తరపు న్యాయవాది ఈడీ ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేయడం ఈ కేసు మరోమలుపు తిరిగినట్ట య్యింది. దీనిపై సోమవారం కోర్టు విచారించ నున్నది. ఈ పరిస్థితుల్లో ఈడీ అధికారుల ఎదుటకు విచారణ నిమిత్తం కవిత హాజరవుతుండటంతో బీఆర్ఎస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. మరోవైపు, కవిత సోదరుడు, రాష్ట్ర మునిసిపల్ వ్యవహారాల శాఖా మంత్రి కేటీఆర్ సైతం ఢిల్లీకి హుటాహుటిన శుక్రవారం బయలుదేరి వెళ్లారు. ఆయన రెండ్రోజుల పాటు ఢిల్లీలోనే మకాం వేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ప్రతిపక్షాలపై బీజేపీ తీవ్ర దాడులు

- విపక్షాల గొంతు నొక్కుతున్న టీఎంసీ
- త్రిపురలో ఎన్నికల అనంతర అల్లర్లకు వ్యతిరేకంగా బెంగాల్‌లో లెఫ్ట్ సంఘీభావ ర్యాలీ
- హాజరైన పలువురు నాయకులు, కార్యకర్తలు

న్యూఢిల్లీ : త్రిపురలో లెఫ్ట్, ప్రతిపక్షాలపై బీజేపీ తీవ్ర దాడులను చేస్తున్నదని వామపక్ష కూటమి ఆరోపించింది. అలాగే, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తరహా విధానాన్ని అనుసరిస్తూ ప్రతిపక్షాల గొంతును అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ప్రభుత్వం నొక్కివేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం చెలరేగిన హింసాత్మక అల్లర్లను నిరసిస్తూ పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష కూటమి సంఘీభావ ర్యాలీని నిర్వహించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న నాయ కులు బీజేపీ, టీఎంసీల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "త్రిపురలో ఉక్కిరి బిక్కిరి చేసే వాతావరణం తయారైంది. ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన దాడుల్లో ముగ్గురు మృతి చెందారు. అనేక మంది గాయాలతో చికిత్స పొందుతున్నారు. 600కు పైగా దాడులు జరిగాయి. అనేక పార్టీల కార్యాలయాలకు నిప్పుపెట్టారు. ఒక భయానక వాతావరణం తయా రైంది" అని కోల్‌కతాలో నిర్వహించిన సంఘీభావ ర్యాలీ ముగింపు సందర్భంగా బెంగాల్ వామపక్ష కూటమి చైర్మెన్ బిమన్ బోస్ అన్నారు. మార్చి 2న త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంట నే ఆ రాష్ట్రంలో ప్రతిపక్షాలపై దాడులు జరుగుతు న్నాయి. ముఖ్యంగా, రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష కూటమి కార్యకర్తలు, మద్దతుదారులపై బీజేపీ దాడు లు కొనసాగుతున్నాయి. ఈ దాడులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఇప్పటికే దేశ వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

కోల్‌కతాలో వామపక్ష కూటమి జరిపిన నిర సన ర్యాలీకి పలువురు వామపక్ష కూటమి నాయ కులు పాల్గొన్నారు. బీజేపీ తీరును ఖండించారు. అలాగే, వేలాది మంది కార్యకర్తలు వచ్చారు. ఇది త్రిపురకు అండగా నిలిచే ర్యాలీ అని మార్చ్ ప్రారం భానికి ముందు బిమన్ బోస్ అన్నారు.నేరస్థుల చేతుల్లో సాధారణ ప్రజలు దారుణంగా దాడులకు గురవుతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో 668 హింసాత్మక ఘటనలు చోటు చేసు కున్నాయని వామపక్ష కూటమి తెలిపింది. కనీసం ముగ్గురు మృతి చెందగా వంద మందికి పైగా గాయాలపాలయ్యారు. ఈ హింసా త్మక ఘటనల్లో అనేక ఇండ్లు ధ్వంసమయ్యాయనీ, లూటీకి గురయ్యాయని వివరించింది.

కొన్నింటికి ఓకే...

- పీఆర్సీ నిర్ణయం ప్రభుత్వానిదే
- విద్యుత్ జేఏసీ నేతలతో అధికారులు
- చర్చలకు మంత్రి గైర్హాజరు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన చర్చలు శుక్రవారం విద్యుత్‌సౌధలో జరిగాయి. విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు, సీఎమ్‌డీలు ఈ చర్చల్లో పాల్గొన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ చర్చలు జరగాల్సి ఉండగా, ఆయన గైర్హాజరు అయ్యారు. దీనితో సీఎమ్‌డీలే జేఏసీ నేతలతో చర్చలు జరిపారు. అయితే పీఆర్సీ ఎంత శాతం ఇస్తారనే విషయంపై ప్రభుత్వానిదే తుది నిర్ణయమనీ, దాన్ని మంత్రి ప్రకటిస్తారని సీఎమ్‌డీలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డిమాండ్లలో కొన్నింటిని పరిష్కరించేందుకు అధికారులు అంగీకరించినట్టు జేఏసీ నేతలు తెలిపారు. చర్చల్లో సీఎమ్‌డీలు దేవులపల్లి ప్రభాకరరావు, జీ రఘుమారెడ్డి, ఏ గోపాలరావుతో పాటు టీఎస్‌పీఈజేఏసీ చైర్మెన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకరరావు, కో చైర్మెన్ శ్రీధర్, కో కన్వీనర్ బిసి రెడ్డి, వైస్ చైర్మెన్‌లు వజీర్, అనిల్, జాయింట్ సెక్రటరీ గోవర్ధన్, టీఈఈజేఏసీ అధ్యక్షులు ఎన్ శివాజీ తదితరులు పాల్గొన్నారు. సింగిల్ మాస్టర్ స్కేల్‌కు యాజమాన్యం ఆమోదించింది. ఆర్టిజన్ ఉద్యోగుల పర్సనల్ పే ను బేసిక్‌లో కలిపేందుకు అంగీకరించారు. మెడికల్ క్రెడిట్ కార్డుల విషయంలో చిన్న ఆరోగ్య సమస్యలకు సంబంధించి రూ.5 లక్షలుగా ఉన్న సదుపాయాన్ని రూ.7 లక్షలకు, సెల్ఫ్ ఫండింగ్ స్కీంను రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచేందుకు అధికారులు ఒప్పుకున్నారు. గవర్నమెంట్ ఉద్యోగులకి వర్తించే గ్రాట్యూటీని విద్యుత్ ఉద్యోగులకు వర్తింపచేసేందుకు అనుకూలతను వ్యక్తం చేశారు. హౌస్ రెంట్ అలవెన్స్ సీలింగ్ పెంపుపై చర్చలు జరిగాయి. ఫిట్‌మెంట్, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్పు అంశాలను మాత్రం మంత్రి సమక్షంలో చర్చించాలని నిర్ణయిస్తూ, చర్చలను వాయిదా వేశారు. వారం రోజుల్లో మరోసారి మంత్రితో చర్చలకు ఆహ్వానిస్తామని సీఎమ్‌డీలు తెలిపారు.

మార్చి చివరి నాటికి హెచ్3ఎన్2 వైరస్ కేసులు తగ్గుముఖం

- నిశితంగా పర్యవేక్షిస్తున్నాం : కేంద్రం

న్యూఢిల్లీ : దేశంలోని ఇతర రకాల కన్నా ఈ వైరస్ కారణంగా ఎక్కువమంది ఆస్పత్రుల్లో చేరాల్సి వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తలెత్తుతున్న ఈ ఇన్‌ఫ్లూయంజా వైరస్ కారణంగా తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వస్తోంది, రాబోయే కొన్ని నెలల్లో ఇవి పెరిగే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. భారత్‌లో ప్రతి ఏటా రెండు సీజన్లలో ఫ్లూ చాలా ఎక్కువగా వుంటుంది. ఒకటి జనవరి నుండి మార్చి వరకు, రెండోది వర్షాకాలం తర్వాత. సీజన్ కారణంగా వచ్చే ఫ్లూ కేసులు మార్చి చివరి నుండి తగ్గడం ప్రారంభమవుతాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు హెచ్3ఎన్2, హెచ్1ఎన్1 ఇన్‌ఫెక్షన్లను గుర్తించారు.

నేటితో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పూర్తి

- సోమవారం పోలింగ్
- జోరుగా ప్రచారం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరింది. శనివారంతో ముగియనుంది. నియోజకవర్గంలో దాదాపు 29,749 వేల మందికిపైగా ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకున్నారు. సుమారు 137 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. ఎమ్మెల్సీగా ఎన్నికయ్యేందుకు 21 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. వచ్చే సోమవారం పోలింగ్ జరగనుంది. ఉదయం ఎని మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తారు. అలాగే 16న కౌంటింగ్ నిర్వహిస్తారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఈనెల 21తో ముగుస్తుంది. ఇప్పటికే అభ్యర్థులంతా జోరుగా ప్రచార కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. తొలిదశలో పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. మలిదశలో వ్యక్తిగతంగా ఇండ్లల్లోకి వెళ్లి ఓటర్లను కలిశారు. తుది దశలో ఆత్మీయ సమ్మేళనాలను చేపడుతున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోనూ ఈ కార్యక్రమాలు వేగాన్నందుకున్నాయి. ఈ మారు పోటీ తీవ్రంగానే కనిపిస్తున్నది. మొత్తం 21 మంది అభ్యర్థుల్లో పోటీ ముగ్గురి మధ్యే ఉండే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు, ఉపాధ్యాయ నేతలు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమర్థిస్తూ వారి అడుగు లకు మడుగులొత్తే అభ్యర్థుల విషయంలో ఉపాధ్యాయ ఓటర్లు ఒకింత గుర్రుగా ఉన్నారనే ప్రచారమూ చోటుచేసుకుంటున్నది. దీంతో ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఎన్నికల్లోఎవరికి పట్టం కట్టబోతున్నారనే అంశంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

మాణిక్‌రెడ్డివైపే చూపు..

దాదాపు 11 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా దిగిన టీఎస్‌యూటీఎఫ్ నేత పాపన్నగారి మాణిక్‌రెడ్డి వైపు ఉపాధ్యాయ ఓటర్లు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం సాగుతున్నది. పోరాడే సంఘం నాయకుడిగా, ఉద్యమాలకు నాయకత్వం వహించిన నేతగా ఆయనకు మంచి పేరుందని ఆయా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సంఘం మాణిక్‌రెడ్డికి బ్యాలెట్‌లో సీరియల్ నెంబరు 17ను కేటాయించిన విషయం విదితమే. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి. జంగయ్య చావ రవి, ఉపాధ్యక్షురాలు సిహెచ్.దుర్గాభవాని, కార్యదర్శులు వి. శాంతికుమారి, వై.జ్ఞానమంజరి, వి.నాగమణి, లక్ష్మారెడ్డి, రాములు తోపాటు సీనియర్ నేతలంతా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పాఠశా లలకు వెళ్లడం, వ్యక్తిగతంగా కలవడం ఎక్కువగా చేశారు. ఇతర అభ్యర్థు లు విందులు, వినోదాలతో ఉపాధ్యాయ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదనే వ్యాఖ్యానాలు వస్తున్నాయి. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడం, గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన వారు, ఆ సంఘం నేతలు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డివైపు ఉపాధ్యాయులు దృష్టిసారించారని అంటున్నవారూ లేకపోలేదు.

ధరణితో భూ సమస్యలెదుర్కొంటున్న 9 లక్షల మంది

- బరాబర్ ధరణిని రద్దు చేస్తాం
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో పరిష్కరిస్తాం
- ఈడీ, సీబీఐ బీజేపీ జేబు సంస్థలు : రేవంత్‌రెడ్డి
- పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్‌లో ధరణి అదాలత్‌తో గ్రామసభ

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / పెద్దపల్లి / ఎలిగేడు / జగిత్యాల

"ధరణితో 9 లక్షల మంది సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఆ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. అంతేకాదు.. ధరణి పోర్టల్‌ను బరాబర్ రద్దు చేస్తాం.. ధరణితో వేలాది ఎకరాల అసైన్డ్, పట్టా భూములు కేసీఆర్ బంధువుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆ భూములు తిరిగి పేదలకు పంచి వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతాం. ఈడీ, సీబీఐ బీజేపీ జేబు సంస్థలుగా మారాయి.. బండి సంజయ్, కిషన్ రెడ్డి పేపర్ పులుల్లా టీవీల ముందు రంకెలేయొద్దు" అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. యాత్ర ఫర్ ఛేంజ్ పేరుతో కాంగ్రెస్ చేపట్టిన పాదయాత్ర 24వ రోజు పెద్దపల్లి జిల్లా నుంచి జగిత్యాల జిల్లావరకు సాగింది. మధ్యలో ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌లో ధరణి అదాలత్ పేరుతో నిర్వహించిన సభలో రైతులతో వారి భూసమస్యలపై మాట్లాడించారు. అనంతరం అక్కడి నుంచి జగిత్యాల జిల్లాకు పయనమై కొత్తబస్టాండ్ చౌరస్తాలో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఆయా చోట్ల రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పోరాటాలకు మూలం భూమి అని, పేదవాడి ఆత్మగౌరవం, జీవన విధానం కూడా అని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో భూములను సేకరించి 22లక్షల ఎకరాలను పేదలకు పంచామని చెప్పారు. 2006లో అటవీ హక్కుల చట్టం తెచ్చి ఆదివాసీ, గిరిజనులకు 10లక్షల ఎకరాలు పంపిణీ చేసిందని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం తెచ్చి పేదలను ఆదుకుంది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పుకొచ్చారు. తమ జాతీయ నాయకులు జైరాంరమేష్ రూపకల్పన చేసిన ఆ చట్టాలకు కేసీఆర్, మోడీ కలిసి తూట్లు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ప్రతి గ్రామంలో నూ 20 సమస్యలు ఉంటే.. కేసీఆర్ తెచ్చిన ధరణితో 200 సమస్యలు ఉత్పన్నమయ్యాయని అన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ధరణి విధానంలో లోపాలను సరి చేసి పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే మాట్లాడుతూ.. 'మీ భూ హక్కులకు మీకు తిరిగి కల్పించేందుకు కాంగ్రెస్ ఈ కార్యక్రమం చేపట్టింది' అన్నారు. పేదల భూములు వారికే చెందేలా చేసే వరకు 'ధరణి అదాలత్' కొనసాగిస్తామని చెప్పారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉత్పత్తి రంగం కొద్ది మంది చేతుల్లో ఉంటే.. మిగతా ప్రజలు వారిపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. గతంలో భూమి ఒక్కటే ఉత్పత్తి రంగంగా ఉన్నప్పుడు.. దేశంలోని పేదలకు భూమిని పంచిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. అనంతరం ధరణి లోక్‌అదాలత్‌లో భాగంగా ప్రజల నుంచి వినతులు తీసుకుని వారికి 'కాంగ్రెస్ హామీ పత్రాలు' అందించారు. యాత్రలో కాంగ్రెస్ జాతీయ నాయకులు కొప్పుల రాజు, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. నర్సింగాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతు జలపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.లక్ష ఆర్థికసాయం చేశారు.

లిక్కర్ స్కాంలో ఈడీ వివరణ ఇవ్వలే..

యాత్ర ఫర్ ఛేంజ్‌లో మీడియాతో రేవంత్ వ్యాఖ్య

లిక్కర్ స్కాం కేసులో ఏం జరుగుతుందో ఈడీ అధికారులు ఇప్పటి వరకు వివరణ ఇవ్వలేదని, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా పట్ల వ్యవహరించనట్టు.. లిక్కర్ కేసులో కవిత పట్ల ఎందుకు వ్యవహ రించడం లేదని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ రెండూ బీజేపీ జేబు సంస్థలని వ్యాఖ్యానించారు.

అవినీతి ఆరోపణలు వచ్చిన రాజయ్యను బర్తరఫ్ చేసిన కేసీఆర్.. ఇన్ని ఆరోపణలు ఎదుర్కొం టున్న కవితపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ అవినీతిపై తాను ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎందుకు విచారణ చేపట్టలేదన్నారు. కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని ప్రధాని, కేంద్ర మంత్రులు చెప్పారని, అయినా ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ గురవిందగింజ చందంగా ఉన్నారని విమర్శించారు.

ఇమ్రాన్ ఖాన్‌పై నాన్‌బెయిలబుల్ అరెస్టు వారంటును రద్దు చేసిన బెలూచిస్తాన్ హైకోర్టు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై జారీఅయిన నాన్ బెయిలబుల్ అరెస్టు వారంటును బెలూచిస్తాన్ హైకోర్టు సస్పెండ్ చేసింది. ప్రభుత్వ సంస్థలపై విద్వేష ప్రసంగం చేసినందుకు గానూ దాఖలైన కేసులో ఈ అరెస్టు వారంటు జారీ అయింది. కాగా ఈ చర్యను నిరసిస్తూ పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ పిటిషన్ దాఖలు చేసింది. క్వెట్టాలోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జారీచేసిన నాన్ బెయిలబుల్ అరెస్టు ఉత్తర్వులను నిరసిస్తూ ఖాన్ పార్టీ బెలూచిస్తాన్ హైకోర్టులో పిటిషన్ వేసింది. అలాగే ఖాన్‌పై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కూడా రద్దు చేయాల్సిందిగా కోరింది. అరెస్టు వారంటును నిలుపుచేసిన బెలూచిస్తాన్ న్యాయమూర్తి జహీర్ ఉద్ దిన్ కాకర్ దీనిపై రెండు వారాల పాటు విచారణను వాయిదా వేశారు. దర్యాప్తు డైరెక్టర్ బెలూచిస్తాన్ ఇనస్పెక్టర్ జనరల్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సీనియర్ ఎస్పి (లీగల్), ఫిర్యాదీదారునికి నోటీసులు జారీ చేశారు.

మోడీ బినామీ అదానీ

లక్షల కోట్లను లూటీ చేసిన అదానీని ఎందుకు అరెస్టు చేయరు : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

మోడీ బినామీ అదానీ అని, లక్షల కోట్ల దేశ సంపదను లూటీ చేసిన అదానీని ఎందుకు అరెస్టు చేయరని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మోడీకి బినామీ ప్రముఖ వ్యాపారవేత్త అదానీ అని విమర్శించారు. ఈ దేశ ప్రజల సొత్తు లక్షల కోట్లను అప్పనంగా అదానీకి కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థనే ఛిన్నాభిన్నం చేసిన అదానీపై ప్రధాని మోడీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు చివరికి న్యాయ వ్యవస్థలు సైతం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయని చెప్పారు. చిన్న చిన్న విషయాల్లో హడావుడి చేస్తున్న బీజేపీ ప్రభుత్వం.. లక్షల కోట్ల ప్రజాధానాన్ని లూటీ చేసిన అదాని కేంద్రానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కర్నాటకలోని బీజేపీ ఎమ్మెల్యే ఇంట్లో నోట్ల కట్టలు బయట పడ్డాయన్నారు. అతడిని అరెస్టు చేయకముందే ముందస్తు బెయిల్ తీసుకోవడం వెనుక బీజేపీ హస్తం ఉందన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో దోషి అయిన సంతోష్‌కు కూడా కోర్టు బెయిల్ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశానికి నష్టం కల్గించేవిధంగా చేస్తున్నారని విమర్శించారు.



స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించి లౌకిక వాదాన్ని ప్రచారం చేసిన గాంధీని చంపిన గాడ్సేకు గుడులు కట్టించే పాలకుల ఏలుబడిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో గాంధీ పక్కన మతవాది సావర్కర్ ఫొటోను పెట్టాలనుకోవడం దారుణమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో కుబేరుల సంఖ్య పెరుగుతుండగా.. మరోవైపు పేదలు మరింత పేదలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తున్న వారు ప్రతిపక్షాలైనా.. ప్రజా సంఘాల వారైనా.. మేధావులు ఎవరైనా అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెడరల్ వ్యవస్థను మనం కాపాడుకోకపోతే మునుముందు మరింత గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగ ప్రజాస్వామ్య, లౌకికతత్వం, సామాజిక న్యాయాన్ని కాపాడుకోవడం కోసం.. ఈనెల 17 నుంచి 28 వరకు జన చైతన్య యాత్ర నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ జాతాలకు ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాల వారు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, కార్మికులు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎ.రాములు, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, గద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నారాయణపేట జిల్లా కార్యదర్శి వెంకట్‌రామ్‌రెడి, రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ , కడియాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఉమ్మడిగా ఉద్యమం....

- తెలంగాణ బచావో సదస్సు తీర్మానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఉమ్మడిగా ఉద్యమించాలని తెలంగాణ బచావో సదస్సు తీర్మానించింది. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ జరిగి 12 ఏండ్లైన సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కన్నెగంటి రవి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ సంక్షోభాల చౌరస్తాలో భవిష్యత్తు అగమ్యగోచరంగా మారి చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసింది. ఉద్యమ పార్టీగా అవతరించి బీఆర్ఎస్‌గా మారిన టీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో ఉద్యమ ఆకాంక్షల స్ఫూర్తిని దెబ్బతీసిందని విమర్శించింది. రాష్ట్రం దివాళా తీసింది. లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నా...వాటిని భర్తీ చేయలేదు. ధరణి పోర్టల్‌తో సమస్యలను మరింత పెంచింది. దళిత బంధు పూర్తిస్థాయిలో అమలయ్యే పరిస్థితి లేదు. సమగ్ర వ్యవసాయ విధానం, శాస్త్రీయ పంటల ప్రణాళికా రూపొందించలేదు. విద్యారంగాన్ని ధ్వంసం చేసింది. వైద్యరంగం ప్రయివేటుపరమైంది. తీవ్రమైన ఆర్థిక దోపిడీకి సాగునీటి ప్రాజెక్టుల రీ డిజైన్ కేంద్రాలుగా మారాయి. పేదల కోసమంటూ నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు పైరవీలతో కొందరు దక్కించుకుంటున్నారు. రాష్ట్రంలో ఏకస్వామ్య, నిరంకుశ పాలన అమల్లో ఉంది. కేంద్రంలో బీజేపీ రాష్ట్ర ప్రజల హక్కులను కాలరాస్తున్నది. వాటి సాధనలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేయడం లేదు...' అని సదస్సు తీర్మానించింది.

ఈ నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా ఐక్య ఉద్యమాల నిర్మాణం జరగాలనీ, వాటి నిర్మాణ బాధ్యత రాష్ట్ర ప్రజలు, ఉద్యమ శక్తులపై ఉందని సదస్సు అభిప్రాయపడింది. ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న రాష్ట్రంలోని అవినీతికర పాలన కూలిపోక తప్పదని స్పష్టం చేసింది. నిజమైన ప్రజాస్వామిక శక్తులు ప్రజలను ముందుకు నడిపించి, విజయం సాధించాలని పిలుపునిచ్చింది.

సదస్సులో టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, ప్రధాన కార్యదర్శి భైరి రమేశ్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, వీక్షణం వేణుగోపాల్, ప్రజా గాయకులు గద్దర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు అద్దంకి దయాకర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గోవర్ధన్, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి : ఎంసీపీఐ(యూ)



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత సమాజానికి సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి అని ఎంసీపీఐ(యూ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో సావిత్రిబాయి పూలే 126వ వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మనువాదన్ని పెంచిపోషిస్తున్న బ్రాహ్మణిజానికి, ఆచారాలకు వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే తెచ్చిన సంఘ సంస్కరణల అమలులో సావిత్రిబాయి పూలే పాత్ర గొప్పదన్నారు. మహిళలందరికీ విద్య అందాలనీ, మానవ వికాసం జరగాలని ఆమె తపించారని కొనియాడారు. భారత సమాజం మార్పు కోసం నడుం బిగించిందన్నారు. ఆమె స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కుంభం సుకన్య పూల మాల వేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, వరికుప్పల వెంకన్న, వస్కుల మట్టయ్య వి. తుకారాం నాయక్, కన్నం వెంకన్న, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకీభవించనోడి పీక నొక్కడమే ఫాసిజం

- ఐక్యఉద్యమాలతో బీజేపీని ఓడిద్దాం
- ప్రజాపంథా సభలో ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏకీభవించనోడి పీకనొక్కడమే ఫాసిజం సహజలక్షణమని ప్రొఫెసర్ హరగోపాల్ చెప్పారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాయలసుభాష్‌చంద్రబోస్(రవన్న) ఏడో వర్ధంతి సభను నిర్వహించారు. కె రమ అధ్యక్షతన జరిగిన సభలో హరగోపాల్ మాట్లాడుతూ సామాజిక పునాదిలో పురుషాధిపత్యం, కులం, మతం ఆవహించి ఉన్నాయని చెప్పారు.దీంతో మహిళలపై హింస,అణచివేత పెరిగిపోయిందన్నారు. స్త్రీని రెండో తరగతి పౌరురాలుగా చూస్తున్నారని చెప్పారు. క్రింది కులాలపై ఆధిపత్యం కొనసాగుతున్నదన్నారు.తద్వారా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. మధ్యస్థ కులాలు కిందివైపు వస్తే..మార్పు వస్తుందనీ, పై కులాల వైపు పోతే ఫాసిజం వస్తుందని చెప్పారు. 1992లో రథయాత్ర చేసి, మతకొట్లాటలు సృష్టించి వేలాదిమంది చావుకు కారణమయ్యారని చెప్పారు.'భారత దేశంలో ఫాసిజం-ఆర్థిక రాజకీయ కారణాలు' అనే అంశంపై వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, 'ఫాసిజం-దళితుల, మైనార్టీలపై దాడులు' అంశంపై ప్రముఖ రచయిత సతీష్‌చందర్, 'ఫాసిజం-మహిళలు'అంశంపై సామాజిక విశ్లేషకులు దేవి, ఫాసిస్టు వ్యతిరేక పోరాటాల అవశ్యకత'పై పోటు రంగారావు ప్రసంగించారు.భారత రాజ్యాంగంలో ఆమోదించిన కొద్దిపాటి హక్కులు కూడా ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం,పేదరికం, అసమానతలతోపాటు సకలరంగాల్లో సంక్షోభాలు ఎదురవుతున్నాయని చెప్పారు. మరో పక్క మత ఉన్మాదం, విద్వేషం,కట్టలు తెంచుకుని ప్రజలమీద స్వైర విహారం చేస్తున్నదని చెప్పారు. తిండిమీద, కట్టుబాట్లమీద, విశ్వాసాలమీద, స్వేచ్ఛాహక్కులమీద ఆంక్షలు విధిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్నే ధ్వంసం చేసి మనువాదరాజ్యాంగ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దేశభక్తియుత శక్తులతో ప్రజాస్వామిక వాదులతో ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేజీ రామచందర్, కె రంగయ్య,జి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎం హన్మేష్, ఎస్‌ఎల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 125 భూచట్టాలు... ఒకే చట్టం తీసుకొస్తాం

- పొత్తులుండవ్...ఒంటరిగానే పోటీ : ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ రైతులను ఇబ్బంది పెడుతున్నదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 125 భూచట్టాలు ఉన్నాయనీ, వీటిని ఒకే చట్టం కిందకు తీసుకొస్తామన్నారు. మీ భూమి...మీ హక్కు పేరిట కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. భూమి సమస్యల పరిష్కారానికి పంచ సూత్రాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 119 నియోజక వర్గాలలోని గ్రామాల్లో ధరణి అదాలత్ కార్యక్రమాలు చేపట్టబోతున్నట్టు వివరించారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులుండవనీ, ఒంటరిగానే బరిలోకి దిగుతామని వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామన్నారు. పాత పెన్షన్ విధానాన్ని ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా, జాతీయ కార్యదర్శులు నదీమ్ జావిద్, చల్లా వంశీచంద్ రెడ్డి, సుప్రియ, చామల కిరణ్‌రెడ్డి, పుష్పలీల తదితరులతో కలిసి జైరాం రమేష్ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 60 లక్షల మంది పట్టాదారులు ఉంటే, దాదాపు 20 లక్షల మంది రైతులకు సమస్యలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో సంపూర్ణ సమగ్ర భూసర్వే జరుపుతామని చెప్పారు.

ఉపాధిహామీ పని దినాలు పెంచాలి

మనుస్మృతి అమలుకు బీజేపీ కుట్రలు

- ఎమ్మెల్సీ కవిత దీక్షకు ఐద్వా మద్దతు
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-బోధన్

ఉపాధి హామీలో సంవత్సరానికి 200 పనిదినాలు కల్పించి, ప్రతి రోజూ రూ.600 వేతనం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఉర్దూఘర్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించడంలో హామీలే తప్ప కార్యాచరణ ఏమి చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో మహిళలు సమాన అవకాశాలు పొందలేకపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 33శాతం మహిళ రిజర్వేషన్ అమలుచేస్తే 180 మంది మహిళలకు చట్ట సభల్లో అవకాశం వస్తుందని అన్నారు. అలాగే 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న దీక్షకు ఐద్వా ఆధ్వర్యంలో మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఆకలి సూచికలో భారతదేశం ప్రపంచ దేశాల్లో 112వ స్థానంలో ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో నిత్యావసర ధరలు పెరగడం కాకుండా ప్రజలు ఆర్థిక భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు పౌష్టికాహారం కరువై రక్తహీనతతో బాధపడుతున్నారని, కావున ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని తొలగించి దాని స్థానంలో దేశ వ్యాప్తంగా మనుస్మృతిని అమలు చేయడానికి బీజేపీ కుట్రలు చేస్తుందని విమర్శించారు.

మనుస్మృతి అమలయితే మహిళల హక్కులు లేకుండా పోతాయని, మహిళలు ఆంక్షలతో ఇంటికే పరిమితమవుతారని అన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు భద్రత కొరవడిందని, భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా పోయిందని అన్నారు. అలాగే రాష్ట్రంలో ఇండ్లు లేక గుడిసెలలో ఉన్న వారికి పట్టాలిచ్చి ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు చేస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెతో పాటు ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సబ్బని లత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌ను నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరప్పా, రైతు సంఘం జిల్లా నాయకులు గంగామణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు గంగాధర్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు జంగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో కనీస వేతనాలు అమలు చేయాలి

యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటేష్





నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలో నాన్ టీచింగ్, డైలీ వేజ్, ఎన్.ఎం.ఆర్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ తదితర ఉద్యోగులకు జీవో 63 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో గౌరవ అధ్యక్షులు జె.వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవి మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18 యూనివర్సిటీలలో సుమారు 10 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో టైం స్కేల్, డైలీ వేజ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ తదితర పద్ధతుల్లో నియామకాలు జరుగుతున్నా యన్నారు అయితే, రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలోనూ ఈ సిబ్బందికి జాబ్ చార్ట్ లేదని, వేతనాల్లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని తెలిపారు. ఒక్కో యూనివర్సిటీకి ఒక్కో వేతన నిర్ణయం అమలు చేయడం అన్యాయమన్నారు. యూనివర్సిటీల్లో నిర్ణయించిన కనీస వేతనాలు అతి తక్కువ ఉండగా, అందులోను ఏజెన్సీలు కార్మికుల వేతానాల్లో ఎక్కువ కోతలు విధిస్తున్నాయని చెప్పారు. 10 గంటల పని విధానం అమలులో ఉండటం వల్ల పని భారం పెరుగుతుందన్నారు. అధికారుల వేధింపులు, మహిళా ఉద్యోగుల పట్ల వివక్ష కొనసాగుతున్నదని తెలిపారు. యూనివర్సిటీలో తప్పనిసరిగా జీవో 63 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాల సర్వీస్ దాటిన వారిని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కాంట్రాక్టర్ మారితే సిబ్బందిని తొలగించే అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్ మానుకోవాలని సూచించారు. రిటైర్ అయిన సిబ్బందికి రూ.5 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐపీఎఫ్ అమలు చేసి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. బస్సు పాస్ సౌకర్యం కల్పించి మహిళా ఉద్యోగులకు ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.మహేందర్, సమ్మయ్య, ఎస్కే ఆవుర్, చిరంజీవి మహమ్మద్ సల్లర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అవసరాలకు 'అత్యుత్తమ' శిక్షణ

- ఆధునిక టెక్నాలజీని వాడుతున్నాం
- రేపు సీఐఎస్ఎఫ్ రైజింగ్ పరేడ్
- మీడియాతో సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

దేశంలోని పారిశ్రామిక అవసరాలకు అనుగు ణంగా అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు చెప్పారు. భద్రత, రక్షణ కల్పించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నామని వ్యాఖ్యానించారు. చిన్న సంఘటన జరిగినా తీవ్రంగానే పరిగణిస్తామనీ, విచారణ చేయడం ద్వారా సమస్యలను వేగంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)54వ రైజింగ్ పరేడ్ నేపథ్యంలో శనివారం హాకీంపేటలోని జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీ(ఎన్ఐఎస్ఏ)లో సీఐఎస్ఎఫ్ అదనపు డైరెక్టర్(నార్త్) జనరల్ పీయూష్ ఆనంద్, అదనపు డైరెక్టర్ జనరల్(ఎయిర్‌పోర్ట్స్ అపరేషన్స్) జ్ఞానేందర్ సింగ్ మాలిక్, అదనపు డైరెక్టర్ జనరల్(సౌత్) జగ్బీర్‌సింగ్, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ సునిల్ ఇమ్మాన్యుయేల్, డీఐజీ అనిల్‌పాండే సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైజింగ్ డే పరేడ్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) బయట చేపట్టడం ఇదే తొలిసారని చెప్పారు. 1969లో శ్రీకారం చుట్టినట్టు చెప్పారు.

54వ రైజింగ్ డే పరేడ్‌కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరవుతారని వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు బలగాలను దగ్గరి నుంచి చూడాలనే ఉద్దేశంతో న్యూఢిల్లీ వెలుపలికి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. సీఐఎస్ఎఫ్‌కి ఎన్ఐఎస్ఏ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కాబట్టి రైజింగ్ డే పరేడ్ ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. కవాతు సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది అద్భుతమైన ప్రదర్శనలతో పాటు ప్రతిభావంతమైన సేవకు గాను ఒక గ్యాలంటరీ, 22 రాష్ట్రపతి పోలీసు పతకాలు, విశిష్ట సేవలకు రాష్ట్రపతి పోలీసు పతకం సహా 23 పతకాలు అందజేయబడతాయని తెలిపారు. ప్రస్తుతం 66 విమానాశ్రయాలు , నౌకాశ్రయాలు , న్యూక్లియర్ , స్పేస్ ఇన్‌స్టాలేషన్స్లు, ఢిల్లీ మెట్రో , స్టీల్, పవర్ ప్లాంట్లు సహా దేశంలోని 354 కీలకమైన పారిశ్రామిక సంస్థలకు సీఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తున్నదని చెప్పారు. తమ సంస్థ 1.70 లక్షల మంది సిబ్బందిని కలిగి ఉందని చెప్పారు. ఇన్ఫోసిస్ టెక్నాలజీస్‌కు చెందిన బెంగళూరు , పూణే , ఎలక్ట్రానిక్ సిటీ , బెంగళూరు యూనిట్లకు, ఒడిశాలోని టాటా స్టీల్ కళింగనగర్ సహా 11 ప్రైవేట్ సంస్థలకు భద్రతను విస్తరిస్తున్నామని వివరించారు. ఆయా అవసరాల కోసం ఎప్పటికప్పుడు నియామకాలు చేస్తున్నామని చెప్పారు. కొత్తగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సీఐఎస్ఎఫ్ శక్తిసామర్థ్యాలను పెంచుకుంటున్నామని అన్నారు. భద్రత, రక్షణ తమ మోటో అని గుర్తు చేశారు. సీఐఎస్‌లో మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని చెప్పారు. మొత్తం సిబ్బందిలో 6.7 శాతం మహిళలు ఉన్నట్టు చెప్పారు. రెగ్యులర్‌గా ప్రమోషన్లు కల్పిస్తున్నామన్నారు. ఆయా సంస్థలకు సెక్యూరిటీ ఇచ్చే క్రమంలో ఏదైనా దుర్ఘటన జరిగితే తీవ్రంగా పరిగణిస్తామని చెప్పారు. అవసరమైన విచారణ చేసి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని చెప్పారు.

భద్రత కల్పించేందుకు అవసరమయ్యే ఖర్చును ఆయా సంస్థలే 78 శాతాన్ని భరిస్తున్నాయని చెప్పారు. విమానంలో ఏదైనా ఘటన జరిగితే ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం ప్రకారం బాధ్యులైన వారిని గుర్తించి స్థానిక పోలీసులకు అప్పగించి కేసు నమోదయ్యేలా చూస్తామని చెప్పారు. అంతర్గత అవినీతి, అక్రమాలను నిరోధించేందుకు పటిష్టమైన విజిలెన్స్ అందుబాటులో ఉందని చెప్పారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నామని వివరించారు. శిక్షణ అభ్యర్థులకు చట్టం గురించి తెలుసుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. టెక్నికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. తమ విధుల నిర్వహణలో ఆయా రాష్ట్రాల్లోని స్థానిక ప్రభుత్వాలు, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు. విమానయానం సందర్భంగా ఎయిర్‌పోర్టుల్లో ఉండే తమ సిబ్బందిని చిరునవ్వుతో పలకరించి 'థాంక్యూ' అని చెబితే తామెంతో సంతోషిస్తామనీ, తాము అదే కోరుకుంటున్నామని వివరించారు.

కంటోన్మెంట్‌లో ఓట్లను వెంటనే పునరుద్ధరించాలి

- రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్
- బాధితులతో కలిసి కంటోన్మెంట్ బోర్డు ముందు ధర్నా



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఓట్లు పోగొట్టుకున్న వారితో కలిసి శుక్రవారం ఆయన బోర్డు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కంటోన్మెంట్ సూపరింటెండెంట్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ.. తొలగించిన 35,000 మంది ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వారిని కేవలం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు మాత్రమే ఉపయోగించుకుంటున్నారని, కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలలో వారికి ఓటు హక్కు లేకుండా బోర్డు అధికారులు తొలగించేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు హక్కును పునరుద్ధరించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శామ్యూల్, మోని, రఘు, శ్రీను, ఫహీమ్, సాయి కిరణ్, త్రివేద్, సుశీల, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల ప్రభుత్వాలను కూలగొట్టే పనిలో కేంద్రం

- పావులుగా సీబీఐ, ఈడీ, నిఘా వ్యవస్థలు : కూనంనేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలను కూలగొట్టే పనిలో మోడీ సర్కారు ఉందనీ, అందుకు సీబీఐ, ఈడీ, నిఘా, న్యాయ వ్యవస్థలను పావులుగా వాడుకుంటున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు దేశవ్యాప్తంగా గల్లీగల్లీ తిరుగుతూ బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో మందా పవన్ అధ్యక్షతన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మీడియాతో మాట్లాడారు. మనీ ల్యాండరింగ్, ఇతర కేసుల్లో 51 మంది బీజేపీ ఎంపీలపైనా, 78 మంది ఎమ్మెల్యేలపైనా ఫిర్యాదులు అందితే ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు. అదానీ, విజయ్‌మాల్యా, లలిత్‌మోడీల కుంభకోణాల్లో వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదని నిలదీశారు. యూపీలో ప్రశ్నించే దళితులు, మైనార్టీలపై యోగీ తన ప్రతాపం చూపుతున్నారని విమర్శించారు. మోడీ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 58,59 జీవోల కింద 2020 వరకు గుడిసెలు వేసుకుని ఉంటున్న వారికే రెగ్యులరైజేషన్‌కు అవకాశం కల్పించడం సరిగాదన్నారు. ఇప్పటి వరకు గుడిసెలు వేసుకుని ఉంటున్న ప్రతిఒక్కరికీ అవకాశమివ్వాలనీ, గృహలక్ష్మి కింద వారికి రూ.3 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రాని వారికి కూడా ఇంటి స్థలం, రూ.3లక్షలు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీలో చెప్పినట్టుగా 4.5లక్షల మందికి 13 లక్షల ఎకరాలకు పట్టాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలు ఏకమైతే ఎన్నికలలో గెలవలేమని కేంద్ర ఏజెన్సీలను మోడీ ప్రయోగిస్తున్నారని విమర్శించారు. అదానీ వ్యవహారంపై జేపీసీ ఎందుకు వేయడంలేదని ప్రశ్నించారు. మోడీ అధికారం చేపట్టినప్పుడు ఫోర్బ్స్ జాబితాలో 620వ స్థానంలో ఉన్న అదానీ.. రెండేండ్లలో ప్రపంచంలోనే రెండో ధనవంతునిగా ఎలా ఎదిగాడని నిలదీశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మోడీ హయాంలో ధరలు విపరీతంగా పెంచేస్తున్నారనీ, ఇటీవల గ్యాస్, పెట్రోలు ధరలు పెద్ద ఎత్తున పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, ప్రజలు రుణాలు తిరిగి చెల్లించకపోతే ఇండ్లను జప్తు చేస్తున్న బ్యాంకు అధికారులు...రుణాలు ఎగ్గొడుతున్న కార్పొరేట్ల ఆస్తులను ఎందుకు జప్తు చేయడం లేదని నిలదీశారు.

13వ తేదీ వరకు మద్యం దుకాణాలు బంద్

- ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్



నవతెలంగాణ-హయత్‌నగర్

హైదరాబాద్, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 11న(నేటి) సాయంత్రం 4గంటల నుంచి 13న సాయంత్రం 4గంటల వరకు మద్యం దుకాణాలు బంద్ చేయాలని దుకాణ దారులకు ఎక్సైజ్ శాఖ హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ శుక్రవారం ఆదేశించారు.ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కంటి వెలుగు సిబ్బందికి అందని జీతాలు..!

నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి19న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లాలో 80 కేంద్రాలను ఏర్పాటు చేసింది సర్కారు. దానికి సంబంధించి ముందుగానే డిసెంబర్7న సిబ్బందికి ట్రెనింగ్ ఇచ్చి వారికి అపాయింట్ లెటర్‌లు అందజేశారు. 80మంది పారమెడికల్ ఆప్తాలల్మిక్ అధికారులు గా,డేటా ఎంట్రీ సిబ్బంది 80మంది ని అవుట్ సోర్సింగ్‌గా నియమించారు. అయితే తమకు రోజు అలవెన్స్ తో పాటు వేతనాలు కూడా ఇప్పటికి అందలేదని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇట్టి విషయంపై రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై రంగారెడ్డి జిల్లా వైద్యాధికారిని నవతెలంగాన వివరణ కోరగా ట్రెజరరీ విభాగానికి సిఫార్సు చేశామని, త్వరలోనే వారి ఖాతాలో కి వేతనాలు జమ అవుతాయని వెల్లడించారు.

కేంద్రంలో బీజేపీ వచ్చాక పెరిగిన లైంగికదాడులు

- ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్
- ఐఎస్ సదన్ సీఐటీయూ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

కేంద్రంలో బీజేపీ వచ్చాక దేశవ్యాప్తంగా మహిళలపై, చిన్న పిల్లలపై లైంగికదాడులు, హింస పెరిగాయని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ సౌత్ జిల్లా గా సీఐటీయు, ఆవాజ్, ఐద్వా మూడు సంఘాల ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ సీఐటీయు కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా మహిళలకు చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పని ప్రదేశాల్లో శ్రామిక మహిళలు వివక్షకు వేధింపులకు గురవు తున్నారని చెప్పారు. మహిళలకు సమాన హక్కులు, శ్రమకు గుర్తింపు, సమాన వేతనాలు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా మోసం చేస్తుందన్నారు. మహిళల పెద్ద సంఖ్యలో నిరుద్యోగంతో బాధ పెట్టడం, పనుల్లో కోత పెట్టడం, పనుల్లో మహిళల భాగస్వామ్యాన్ని అడ్డుకోవడం వంటివి చేయడం దారుణం అన్నారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎం శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. మహిళల్లో శ్రమకు తగిన గుర్తింపునివ్వాలని మహిళలందరికీ పురుషులతో సమానంగా కనీస వేతనం చెల్లించాలన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీం వర్కర్ల అందరికీ గ్రాడ్యుయేటి చెల్లించాలన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని తెలిపారు. ఐద్వా కార్యదర్శి పీ శశికళ మాట్లాడుతూ.. మహిళల మీద జరుగుతున్న హింసను అరికట్టాలన్నారు. సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా హక్కులు కల్పించాలని, దాడులను తిప్పి కొట్టే విధంగా ఉద్యమాలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయు జిల్లా అధ్యక్షురాలు ఎం మీనా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎం లక్ష్మమ్మ, రఘునందన్, స్వరూప, జ్యోతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మహిళకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తాం

- రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఏ శ్రీదేవి



నవతెలంగాణ-వనస్థలిపురం

ఉమెన్స్ జడ్జి డేను పురస్కరించుకుని జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఏ శ్రీదేవి నేషనల్ కమిషన్ ఫర్ వుమెన్ వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలోని సఖి కేంద్రం సమావేశం మందిరంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ అవగాహన కల్పించడానికి రంగారెడ్డి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇద్దరూ రిసోర్స్ పర్సన్‌ను.. లాయర్ శ్యామలాదేవిని, సామాజికవేత్త వర్షాలని లాయర్‌ను నామినేట్ చేశారు. ఈ అవగాహన సదస్సు ద్వారా మహిళలకు ప్రాథమిక హక్కులు, ప్రాథమిక బాధ్యతలు, యాసిడ్ ఎటాక్, వరకట్న వేధింపుల గురించి, లైంగికదాడులు, లైంగిక వేదింపులు, పోక్సో చట్టం గురించి తదితరాలను వివరించారు. ఈ సమావేశంలో ఏ.శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రతి ఒక్క మహిళకి ఉచిత న్యాయ సహాయం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అందిస్తామని, ఈ సమాచారాన్ని ప్రతీ ఒక్కరికి చేరవేయాలని, అంగన్వాడి, ఆశా, సఖి కేంద్రం వర్కర్లను కోరారు. రంగారెడ్డి జిల్లాలోని అన్ని యంత్రాంగాలు తమ సహాయ సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, సీపీడీవో వర్కర్లు, సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ గౌరీ, ఇంచార్జ్ పి సుశీల, అనిత, తేజస్విని, పారా లీగల్ వాలంటీర్స్, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా నాయకులు చింతల యాదయ్య



నవతెలంగాణ-ఘట్కేసర్

ఎండా,వాన,చలిలో ఆరుగాలం కష్టపడి పల్లెలలో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు గత నాలుగే నెలలుగా వేతనాలు చెల్లించకుండా వివక్ష పాటించడం శోచనీయమని, తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు చింతల యాదయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ సబితలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఘట్కేసర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులకు సీఐటీయూ జిల్లా నాయకులు చింతల యాదయ్య పూలదండలు వేసి దీక్షలను ప్రారంభించారు. మండల అభివృద్ధి అధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు కరోనా వంటి విపత్కర పరిస్థితులలో సైతం పల్లెలను పరిశుభ్రంగా ఉంచారని, కరోనాతో చనిపోయిన వారిని వారి కుటుంబ సభ్యులు ముట్టుకోకపోయినా వారు ఎంతో మానవీయతతో శవాలను పూడ్చారని, అంత గొప్ప సేవలు అందించిన పంచాయతీ కార్మికులను గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా పస్తులు ఉంచడం సరైనది కాదన్నారు. తక్షణమే ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ ఈఎస్ఐ వంటి కనీస సౌకర్యాలు లేవని, ప్రమాదవశాత్తు మరణించిన వారికి ఎలాంటి బీమా సౌకర్యం కూడా లేదన్నారు. నైజాం కాలం నాటి వెట్టి చాకిరి నేటికీ చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల గోడు ప్రభుత్వం వినాలన్నారు సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ సబిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని జీవో నెంబర్ 51 ద్వారా తెచ్చిందని దీనివల్ల కారోబారు పంప్ ఆపరేటర్ తేడా లేకుండా అన్ని పనులు చేయాల్సి వస్తుందన్నారు తక్షణమే ఆ జీవోను రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26వేల ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మానుకొని గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మండల అబివద్ధి అధికారి సమస్యను పరిష్కరించటం పక్కకు పెట్టి దీక్షను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. కార్మికులను బెదిరించి పోలీసుల చేత అరెస్టులు చేయిస్తామని భయపెట్టించారన్నారు. తక్షణమే ఎంపీడీవో కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. దీక్ష శిబిరం వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కృషివల్లే నేటి మెజారిటీ సమాజం చదువులకు దగ్గర అయిందన్నారు. ఆమె ఆశయాల సాధన కోసం సీఐటీయూ కృషి చేస్తుందని చెప్పారు. గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు, చంద్రమౌళి, కార్యదర్శి నరసింహ, సహాయ కార్యదర్శి కనకరాజు, ఎన్.పి.ఆర్.డి, సంఘం కార్యదర్శి కే చంద్రమోహన్, బిక్షపతి, బీ పద్మ ఎల్లమ్మ యాదమ్మ, పద్మ కిష్టమ్మ గంగమ్మ, లక్ష్మమ్మ భారతమ్మ, లావణ్య, రవి, కృష్ణ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి చైన్ చోరీ

నవతెలంగాణ-వనస్థలిపురం

ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు మెడలో రెండు తులాల చైన్ ని గుర్తు తెలియని వ్యక్తి అపహరించిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.వనస్థలిపురం డిటెక్టివ్ సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం వైదేహి నగర్ రోడ్ నెంబర్ 9 ప్లాట్ నెంబర్ 745లో నివసిస్తున్న 81 ఏండ్ల గుమ్మల పున్నమ్మ భర్త మరణించాడు. దాంతో ఆమె ఒంటరిగా ఇంటిలో నివసిస్తు న్నది. శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మొహానికి కర్చీఫ్ ధరించి ఆమె ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలి మెడలోని రెండు తులాల విలు వగల చైన్‌ను లాక్కుని పారిపోయాడు. ఆ వ్యక్తి తన ముందుకు వస్తే గుర్తుప డతానని బాధితురాలు తన ఫిర్యాదులు పేర్కొంది. ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు.

హైదరాబాద్ జిల్లాలో 22 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 13న జరుగనున్న ఎన్నికలకు హైదరాబాద్ జిల్లాలో 22 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మొత్తం 137 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా అందులో 126 మెయిన్ పోలింగ్ స్టేషన్లు ఉండగా 11 అదనపు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మొత్తం 29,720 ఓటర్లు ఉండగా అందులో పురు షులు 15,472, స్త్రీలు 14,246, ఇతరులు 2 ఓట్లు కలవు. ఏర్పాటు చేసిన 137 పోలింగ్ స్టేషన్లలో మహబూబ్‌నగర్ జిల్లాలో 15 పోలింగ్ స్టేషన్లు, నాగర్ కర్నూల్‌లో 14, వనపర్తిలో 7, జోగులాంబ గద్వాల్‌లో 11, నారాయణ పేట్‌లో 5, రంగారెడ్డి జిల్లాలో 31, వికారాబాద్‌లో 18, మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 14 ఉన్నాయి. ఈ నెల 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది.



మున్సిపల్ మహిళా సిబ్బందికి ఆటల పోటీలు

నవతెలంగాణ-మీర్‌పేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లో విధులు నిర్వహిస్తున్న మహిళ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు రెండో రోజు కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, రింగ్ బాల్, మూడో రోజు వంటల పోటీలు కమిషనర్ సీఎచ్ నాగేశ్వర్ పర్యవేక్షణలో, అలాగే ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. మహిళ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు ఆటల పోటీల్లో ఆనందంగా ఉత్సాహంగా పాల్గొన్నారని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకట్ రెడ్డి, ఆర్ఓ అంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు నారాయణ





నవతెలంగాణ-సిటీబ్యూరో

వాటర్‌వర్క్స్‌లో పనిచేసే కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, జీవో14 అమలు చేయాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు పి.నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు వాటర్‌బోర్డు కార్యాలయాకి తరలివచ్చారు. వేతనాలు చెల్లించాలని, జీవో 14ను అమలు చేయాంటూ ఎండీ దాన కిషోర్‌ను కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందుకు స్పందించిన ఎండీ వేతనాలు పెంచేందుకు మంత్రి కేటీఆర్ సైతం సానుకూలంగా ఉన్నారని తెలిపారు. వేతనాలు పెంపు ప్రక్రియ చివరి దశలో ఉందని అయితే బోర్డు నుంచి కొంత సమాచారం ప్రభుత్వానికి పంపాల్సి ఉందని ఎండీ తెలిపారు. రాబోయే మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తిచేసి ప్రభుత్వానికి పంపుతామని హామీనిచ్చారు. అనంతరం యూనియన్ అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడారు. జీవో 14 రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో అమలవుతుండగా కేవలం వాటర్ బోర్డులో మాత్రమే అమలు కాకపోవడంతో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు జీవో 14 ద్వారా వేతనాలు పెంచాలని స్వయంగా మంత్రి కేటీఆర్ సూచించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బీ.కిరణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ రాజరత్నం, సంతోష్, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు బాలరాజ్, శ్రీనివాస్ రెడ్డి, రామ్ చందర్, జగన్, సురేష్ బాబు, యాదగిరి, కొండలు,రహీం, ఇబ్రహీం, పాండు, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ రెడ్డి, విజయ్, మూర్తి, అనిల్, సురేష్, విగ్నేష్, రమేష్, రైమద్, అఖిలేష్, శ్రీకాంత్, ప్రవీణ్, నర్సింహా రాజు,యుగేందర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ సూపరింటెండెంట్స్, అధికారులతో డీఐఈవో సమీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల విధుల్లో పాల్గొనే ఛీఫ్ సూపరిటెండెంట్స్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సూపరిటెండెంట్‌లు, కస్టోడియన్‌లతో పాటు ఇతర విధులు నిర్వహించే ఉద్యోగులతో హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి. ఒడ్డెన్న శుక్రవారం నగరంలోని సరోజినీ దేవీ వనితా మహ విద్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్షిక పరీక్షల నేపథ్యంలో సంబంధిత అధికారుల విధులతో పాటు వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం డీఐఈవో మాట్లాడుతూ విద్యార్థులు హాల్ టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేనప్పటికీ పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలని సూచించారు. విద్యుత్, వైద్య, తపాలా, ఆర్టీసీ, పోలీసు, ఇతర జిల్లా అధికారుల సమన్వయంతో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులందరూ పరీక్ష సమయాని కంటే ముందుగానే చేరుకోని ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. జిల్లా పరీక్ష కమిటీ సభ్యులు ఎస్.జ్యోతి, ఎస్. ఆనంద్ కుమార్, డి.రవిచందర్, జి.లక్ష్మి, సబా పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

- రాచకొండ సీపీ డీ.ఎస్.చౌహాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

శాంతి భద్రతల పరిరక్షణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్ అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు, శ్రీ రామనవమి, హనుమాన్‌జయంతి, రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లు, తీసుకోవలసిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలతోపాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఊరేగింపుల సమయంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు శాంతి యుతంగా, సంతోషంగా తమ పండుగలు జరుపుకోవాలని, తమ చర్యల ద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులతో సహకరించాలన్నారు.

సావిత్రిబాయి పూలే మడమతిప్పని ధీశాలి

- టూరిజం చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా



నవతెలంగాణ-నాగోల్

సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి సావిత్రిబాయి పూలే అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్, ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి పురస్కరించుకొని సరూర్‌నగర్ డివిజన్‌లోని జింకలబాయి కాలనీ గణేష్ మండపం చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమానికి ఆయన అతిథిగా పాల్గొని సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను ,సంప్రదాయాలను ,ఆధిపత్యాలను ధిక్కరించి భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి బహుజనుల కు విద్యనందించారని తెలిపారు. అట్టడుగు వర్గాలకు ,మహిళలకు చదువు సంపద వంటిదని అదేవిధంగా సమస్త హక్కులను కల్పించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వాటిని ఎదుర్కొని సాధించారని కొనియాడారు.అటువంటి సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ప్రతీ ఒక్కరు వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బేరా బాలకిషన్ వెంకట్ గౌడ్ ,అరవింద్ కుమార్ లతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీలపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలి

- వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ కిషన్

నవతెలంగాణ-వనస్థలిపురం

ప్రతి ఒక్కరూ కిడ్నీలపై అవగాహన పొందాలని వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ కిషన్ అన్నారు. అంతర్జాతీయ కిడ్నీ వారోత్సవాలను పురస్కరించుకొని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో వారు మాట్లాడుతూ.. కిడ్నీలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి ఒక్కరూ నాలుగు నెలలకి ఒకసారి ఎల్ ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, సీబీపీ పరీక్షలు చేయించుకోవాలని రోగులకు సూచించారు. ఈ సందర్భంగా నేషనల్ కిడ్నీ వారోత్సవాల్ని డయాలసిస్ కేంద్రంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డయాలసిస్ ఇన్‌చార్జి నరేంద్ర వర్మ, సైదులు, హసీనా,మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

సీఎం కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడాలి

- మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడాలని,ప్రజల్లో చైతన్యం చేయటానికే హత్ సే హత్ జోడో యాత్ర సాగుతుందని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డిలు అన్నారు. శుక్రవారం నియోజక వర్గంలో చేపట్టిన జోడో యాత్రలో భాగంగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడ గ్రామంలో ఇంటింటికీ తిరిగి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు కోసం చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు తెలియ చేస్తూ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి సీఎం కేసీఆర్ మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించి నియంత పాలనకు సాగిస్తున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, దేప భాస్కర్ రెడ్డి, జంగారెడ్డి, కార్పొరేటర్ పి. సుదర్శన్ రెడ్డి,అర్.సంతోషి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నియోజక వర్గం యూత్ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, నాయకులు నవ్వారు మల్లారెడ్డి,గుర్రం లక్ష్మారెడ్డి,చల్లా బాల్ రెడ్డి, సామిడి గోపాల్ రెడ్డి,అమత నాయుడు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు జోహార్లు



నవతెలంగాణ-వనస్థలిపురం

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం వనస్థలిపురం క్రిస్టియన్స్ కాలనీ లో సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి మీకు ఇవే మా జోహర్లు, అన్నారు. వారు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే భారత దేశ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అన్నారు. కులమత భేదాలకు అతీతంగా సమా జాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అన్నారు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివద్ధికి కషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శౌర వృత్తిదారుల దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెన్నారం మల్లేష్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు గంధం మనోహర్, మహిళా సంఘం నాయకురాలు చంద్రమ్మ, భాగ్యమ్మ, తిరుమల, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : చైతన్యపురి లేబర్ అడ్డా వద్ద కేవీపీఎస్ సరూర్‌నగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సమాజానికి చేసిన కృషి ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.ఆధునిక విద్య ద్వారానే స్త్రీకి విముక్తి సాధ్యపడుతుందని అని నమ్మి తన భర్త దగ్గర విద్యాబుద్ధులు నేర్చుకొని స్త్రీలు, బాలికల కోసం పాఠశాలను ఏర్పాటు చేసిన



మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు అని అన్నారు. కమిటీ సభ్యులు కృష్ణ రాములు, లక్ష్మమ్మ, సీహెచ్ మల్లేష్, సీఐటీయూ నాయకులు ఎం వీరయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ : మన్సూరాబాద్ సహారా రోడ్డులో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రి భాయివిగ్రహానికి మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ పాల్గొని పూలమాలవేసి నివాళులు అర్పిం చారు. బ్యాంక్ కాలనీ అధ్యక్షురాలు సరస్వతి, పూలె యువజన సంఘం



అధ్యక్షులు మేడిగ శ్రీధర్ మేరు, కార్యదర్శి శనిగరపు స్వామి, పిడికిలి రాజు, బిక్షం గౌడ్, సురేష్, కేవీ గౌడ్, మధుసూదన్ రావు తదితరులున్నారు.

సరూర్‌నగర్ : సరూర్ నగర్‌లో సావిత్రి బాయి పూలే విగ్రహానికి బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిలు బేర బాలకిషన్(బాలన్న), మురుకుంట్ల అరవింద్ శర్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. రామా చారి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, కర్మన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ రాజేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మల్కాజిగిరి దయానంద్, నల్లంకి ధనరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగించుకోవాలి

- జీవన్ హాస్పటల్ ఎండీ డాక్టర్ దుర్గ రాణి



నవతెలంగాణ-హైదరాబాద్

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు ఇప్పుడు ఆరోగ్యమే మహాభాగ్యంగా తయారయ్యిందని జీవన్ హాస్పిటల్ ఎం.డి డాక్టర్ దుర్గారాణి (గైనకాలజిస్ట్) తెలిపారు జిల్లెలగూడలో ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంపులో డాక్టరు దుర్గ రాణి మాట్లాడుతూ ఇప్పుడు ఆరోగ్యం అన్నది పెద్ద టాస్క్ లాగా మారిందని తెలిపారు ప్రజలు మారుతున్న కాలంతో పరిగెడుతూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. నిర్లక్ష్యం వహించడం వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని హెచ్చరుఇంచారు. కావున ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు కరోనా వచ్చి పోయిన తర్వాత పోస్ట్ కోడ్ లక్షణాలు ప్రస్తుతం ప్రభావం చూపిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిరంతరం తమ ఆరోగ్యాన్ని చెకప్ చేసుకోవాలని తెలిపారు ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంపులో బీపీ, షుగర్, పాప్ స్మెర్ వివిధ రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసి సలహాలు సూచనలు చేశారు. ఈ డాక్టర్ శిరీష, గైనకాలజిస్ట్ నాగేష్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రోసి, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'దేవాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా'



నవతెలంగాణ-సరూర్ నగర్

ఆర్కేపురం ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తా అని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిలు మురుకుంట్ల అరవింద్ శర్మ, బేర బాలకిషన్‌లు అన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని దేవాలయాల ను ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ దేవాలయ స్థాపన జరిగి నేటికీ 50 ఏండ్లు పూర్తయింది అని, ఈ సందర్భంగా స్వామివారికిచ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మెన్ జగిని రమేష్ గుప్తా, నాయకులు రామాచారి, కొండ శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్ ,కంచర్ల శేఖర్, రాజు శ్రీ వాస్తవ, రాజేష్, మారం సుజాత పాల్గొన్నారు.

నేడు సెయింట్ పాయిస్ కళాశాలలో ఇంటర్ కాలేజీ ఎట్ సైన్స్ ఫెస్ట్

నవతెలంగాణ-నాచారం

నాచారం స్నేహపురి కాలనీలోని సెయింట్ పాయిస్ డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాలలో సైనిక్స్-2023 ఆన్ ఇంటర్ కాలేజీఎట్ సైన్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ పద్మలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ లైఫ్ సైన్స్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జాము, ఐడియా హాక్, ఆర్ట్వాక్ రైటింగ్, వీడియో మేకింగ్, మోడల్ మేకింగ్, పోస్టర్ మేకింగ్, కాజ్ ప్లే, గ్రూప్ డాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తునట్టు వెల్లడించారు. లైఫ్ సైన్స్ డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీస్, స్టూడెంట్స్ సంయుక్తంగా సైన్స్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొననున్నారు.

బస్సులో పోగొట్టుకున్న నగదును బాధితుడికి అందజేసిన డ్రైవర్



నవతెలంగాణ-కాప్రా

బస్సులో దొరికిన నగదును బాధితుడికి నిజాయితీగా ఓ డ్రైవర్ తిరిగి అందజేశారు. వివరాల్లోకెళ్తే.. పాప్ కార్న్ అమ్మే బాలకృష్ణ మిర్యాలగూడ బస్టాండ్‌లో కుషాయి గూడ నుంచి తిరుపతి వెళ్లే బస్సు ఎక్కాడు. అయితే అతని రూ. 12,300 బస్సులో పడిపోయాయి. గమనించిన కుషాయిగూడ డిపో డ్రైవర్ ఎస్‌వీఆర్ రెడ్డి తిరుగు ప్రయాణంలో ఎంక్వయిరీ చేశాడు. ఈ మేరకు బాధితుడికి మిర్యాలగూడ డిపో సూపర్ వైజర్స్ రేసు శ్రీనివాస్ గౌడ్, జీ యాదగిరి, కృష్ణల సమక్షంలో డ్రైవర్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా బస్సు స్టేషన్ ఆవరణలో పలువురు ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీని కొనియాడారు.

జోరుగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్

- నెలకు రూ. 12 కోట్ల సైబర్‌దోపిడీ
- టెలిగ్రామ్ యాప్ వేదికగా నయా స్కెచ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విలువైన గిఫ్టులు గెలుచుకున్నారని, లక్కీడ్రాలో గెలుపొందారని, కేవైసీ, ఆధార్, ఫోన్ నెంబర్ బ్యాంక్‌కు అనుసంధానం చేసుకోవాలంటూ కొందరు సైబర్ నేరస్తులు మోసాలకు పాల్పడుతుంటారు. మరికొందరు స్నేహం పేరుతో లేదా పెండ్లీలు చేసుకుంటామనో మభ్యపెట్టేవారు. ఇంకొందరు క్రెడిట్ పాయింట్స్ వచ్చాయని, మీ వస్తువులు కొనుగోలు చేస్తామనో, వ్యాపారం చేద్దామనో అందిన కాడికి దోచుకునే వారు. అమ్మాయిలతో వల వేయడం, హనిట్రాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తోపాటు సోషల్‌మీడియా వేదికగా అమాయకులకు గాలం వేసి లక్షల్లో కొళ్లగొట్టేవారు. బిట్‌కాయిన్, షేర్ మార్కెట్ పేరుతో రెచ్చిపోయేవారు. తాజాగా పార్ట్‌టైమ్, ట్రేడింగ్ పేరుతో అమాయకులకు వల వేస్తూ భారీ మోసాలకు పాల్పడుతున్నారు. రోజుకు లక్షల్లో దోపిడీ చేస్తున్నారు.



టెలిగ్రామ్ యాప్ వేదికగా

తాజాగా కొందరు సైబర్‌నేరగాళ్లు టెలిగ్రామ్ యాప్‌ను వేదికగా చేసుకుంటున్నారు. వివిధ రకాలుగా ఆకర్షిస్తూ చివరకు లక్షల్లో ముంచుతున్నారు. హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పోలీసులకు 10కిపైగా ఫిర్యాదలందుతుండగా నెలకు రూ. 9 నుంచి 12 కోట్ల వరకు సైబర్ దోపిడీ జరుగుతోంది. గతంలో వాట్సాప్ వేదికగా జరిగే ఈ మోసాలు ఇప్పుడు టెలిగ్రామ్ ద్వారా అధికంగా జరుగుతున్నాయి. వివిధ పద్ధతులలో జరుగుతున్న ఈ మోసాలు చివరకు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌గా మారిపోతున్నాయి. ఈ మోసాలకు సంబంధించిన సూత్రధారులు కొందరు విదేశీయులే ఉంటున్నారని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

తక్కువ పెట్టుబడితో మొదలు

గతంలో ఎక్కువగా వాట్సాప్‌లో ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్‌కు సంబంధించిన గ్రూప్‌లలో అందరిని చేర్చేవారు. బిట్‌కాయిన్ పేరుతో మోసాలకు తెరలేపారు. తాజాగా సైబర్‌నేరగాళ్లు తమ దృష్టిని టెలిగ్రామ్ వైపు మళ్లించారు. టెలిగ్రామ్‌లో సులువుగా చేరేందుకు అవకాశముండడం, ఇతరులను ఈజీగా కాంటాక్టు అయ్యేందుకు అవకాశాలుండడంతో ఇప్పుడు ఈ యాప్‌లో సైబం నేరగాళ్లు ఎక్కువగా అమాయకులకు వల వేస్తున్నారు. నేరం చేస్తున్న వారు తప్పించుకునేందుకు అవకాశాలు కూడా ఎక్కువగా ఉండడంతో దీనిని వేదికగా చేసుకుంటున్నారు. వీలైనంత మందిని ఈ గ్రూపులలో చేర్చు వివిధ రకాల చర్చలు జరుపుతున్నారు. వాటిని చూసిన కొందరు ఆకర్షితులవుండగా, మరికొన్ని సందర్భాలలో సైబర్‌నేరగాళ్లు పంపించే లింక్‌లను బాధితులు క్లిక్ చేసి గ్రూపులో చేరుతున్నారు. వారు తెలియకుండానే గ్రూప్‌లలో జరిగే చర్చలకు ఆకర్షితులవుతున్నారు. మొదట తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టిస్తూ, ఆ తరువాత లక్షల రూపాయలు వివిధ టాస్కల పేరుతో పెట్టుబడి పెట్టించి మోసాలు చేస్తున్నారు. ప్రస్తుతం జంట పోలీస్ కమిషనరేట్లలలో నమోదువుతున్న ఆర్థిక పరమైన సైబర్ నేరాలలో 40 శాతం ఇలాంటి ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన మోసాలే ఉంటున్నాయి. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎవరైనా ఆర్థిక పరమైన విషయాలు చర్చిస్తే వారిని నమ్మొద్దని సైబర్ క్రైమ్ ఏసీపీ ప్రసాద్ తెలిపారు. బ్యాంక్ అధికారులు ఎవరూ ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీల వివరాలను అడగరని స్పష్టం చేశారు.

పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాలలోనే ప్రోత్సహించాలి

- కలెక్టర్ అమోయ్ కుమార్
- బాలపురస్కార్ అవార్డుల ప్రదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో/ మేడ్చల్ కలెక్టరేట్

పిల్లలను వారికి ఆసక్తి ఉన్న రంగాలలోనే ప్రోత్సహించి వారి ఉన్నత స్థితికి తల్లిదండ్రులు తోడ్పడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టర్ ఛాంబర్‌లో ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు వారు ఏ రంగంలో ఆసక్తి చూపుతున్నారో తెలుసుకొని వారికి తర్ఫీదు ఇప్పించాలని, వారికి కావాల్సిన అన్ని వసతులు కల్పించినపుడే వారు విజయం సాధిస్తారన్నారు. 2020-21 సంవత్సరానికి హైదరాబాదు జిల్లా నుంచి తేలుకొండి విరాట్ చంద్ర, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి చదలవాడ హిమేష్ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి ప్రశంసా పత్రం, గిఫ్టులు ఇచ్చారు. తేలుకొండి విరాట్ చంద్ర (ప్రస్తుతం 10 ఏండ్లు) 7ఏండ్ల వయసులోనే కిలిమాం జారో పర్వతాన్ని అధిరోహించినందుకుగాను పర్వతారో హణలో భాగంగా ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ అవార్డు గ్రహితకు ప్రధాన మంత్రి స్వద స్తూరితో చేసిన సంతకంతో కూడిన సర్టిఫికెట్, మెడల్, వాచ్, ధ్రువపత్రం ఇచ్చారు. చదలవాడ హిమేష్ అల్ఫా మానిటర్ తయారు చేసినందుకుగాను అవార్డు లభించింది. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర రావు, డీడబ్ల్యూవో అక్కే శ్వర రావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కంటి వెలుగు బృహత్తర పథకం

- మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

కంటి వెలుగు బృహత్తర పథకం అని, సంపూర్ణ అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపట్టిందని మేయర్ మేకల కావ్య అన్నారు. శుక్రవారం 10వ డివిజన్ లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాంచెందర్, బింగి లావణ్యసతీష్ గౌడ్, డాక్టర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలా అయినా మోరి అయినా కన్నేస్తే అంతే..!



నవతెలంగాణ-నాచారం

నాలా అయినా మోరి అయినా కన్నేస్తే కతమే.. రాత్రికి రాత్రి పూడిపేస్తారు ఆక్రమించుకుంటారు. అంతా మాదే అంటారు. ఇది నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై వస్తున్న ఆరోపణలు. గతంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై సింగం చెరువు తండా ప్రధాన నాలాను మింగేసి పాఠశాలలో కలిపేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. చెట్లు పెట్టారు గ్రీన్ ఫీల్డ్ ఏరియా అంటూ సాకులు చెప్పారు.. నేడు టెలిఫోన్ ఎక్సైజ్ నుంచి దుర్గా నగర్ కు వెళ్లే ప్రధాన రహదారి పాఠశాల గేటు పక్కనే ఉన్న నాలా మోరిని కూల్చారు... అదును చూసి మట్టి పోసి అది కూడా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. పేరుకు పెద్ద స్కూల్ అయినా.. తెరవెనకాల అన్ని ఆక్రమణలే..? అన్న చందంగా ఉంది నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వ్యవహారం అని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో నాలాపూడ్చి అనేక విమర్శల పాలైన పాఠశాల యాజమాన్యం మరొకసారి మోరిని కూల్చి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మారుతోందంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కూల్చిన మోరిపై విచారణ చేపట్టి పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో స్పందించి మోరి స్థలాన్ని కాపాడకపోతే వర్షాకాలంలో దుర్గా నగర్‌కు ప్రమాదం పొంచి ఉందని స్థానికుడు పొన్నాల రాజన్న వాపోతున్నారు. ఏ మేరకు అధికారులు స్పందిస్తారో..? లేక నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి లాభం చేకూర్చుతారో వేచి చూడాలి..!

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు నివాళ్లు



నవతెలంగాణ-కాప్రా

సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో నివాళి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ప్రారంభ సూచికగా ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు రాఘవ రావు, పజాతంత్ర ఉద్యమ నాయకులు జి శ్రీనివాస్.. పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. గొడుగు యాదగిరి రావు మాట్లాడుతూ ఆనాడు శూద్రులకు చదువు నిరాకరించబడిన కాలంలో సావిత్రిబాయి పూలే బాలికలకు విద్యాబోధన చేయటం కోసం పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. మనువాద దుర్మార్గాలను ఎదుర్కొని విద్యాబోధన చేశారన్నారు. జి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆనాడు సావిత్రిబాయి పూలే మీద పేడ నీళ్లు, బురద నీళ్లు వేసినప్పటికీ తన బ్యాగులో మరొక చీరను తీసుకొని వెళ్లి, దుర్గంధమైన వస్త్రాలను మార్చుకొని తీసుకొచ్చిన బట్టలతో చదువులు చెప్పేవారని, రకరకాల దాడులు చేసిన ఎదురొడ్డి నిలిచారని అన్నారు. సామాజిక కార్యకర్త వెంకట్ మాట్లాడుతూ మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగానే కాకుండా ఇంగ్లీషులో కవితలు వ్యాసాలు రాసిన ఘనత వారికే దక్కిందని అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి ని ప్రథమ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరపాలని అనేక ప్రజాతంత్ర సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. ప్రముఖ విజ్ఞాన వేత్త ఈ నాగయ్య మాట్లాడుతూ సమాజంలో విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, సుదీర్ఘకాలం బడుగు బలహీన వర్గాలకు చదువు లేకుండా చేసిన సనాతన వాదులకు దీటుగా జవాబు చెబుతూ ఆనాడు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ప్రజలకు చదువులు చెప్పి సరైన సమాధానం ఇచ్చారని చెప్పారు. ఆనాడు ప్రజలు ప్లేగు వ్యాధితో బాధపడుతూ పిట్టల్లా చనిపోయే వారిని, వారికి సేవ చేయటంలో సావిత్రిబాయి పూలే ముందున్నారని చెప్పారు. చివరికి అదే వ్యాధితో చనిపోయారని చెప్పారు. నేటి పాలకులు తిరిగి మనువాదాన్ని తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నారని, వాటికి వ్యతిరేకంగా పోరాడి ప్రజల్ని సమీకరించడమే నేటి కర్తవ్యం అని అదే వారికి నిజమైన నివాళి అని అన్నారు. కోమటి రవి, శ్రీమన్నారాయణ , శోభ, గౌస్య , శ్రీనివాస రావు , సోమయాచారి , ఎర్రం శ్రీనివాస్ , సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లి.. సావిత్రిబాయిపూలే

- జవహర్ నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్



నవతెలంగాణ-జవహర్ నగర్

చదువుల తల్లి సావిత్రిబాయిపూలే అని, స్త్రీల విద్యాభివృద్ధి హక్కులకై పోరాడిన మహనీయురాలని డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సావిత్రిబాయిపూలే వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కార్పొరేషన్ లో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ఆడపిల్లల చదువుల కోసం ఆమె కృషి వెలకట్టలేనిదని, సమాజంలో నెలకొన్న రుగ్మతులను రూపుమాపడానికి ప్రత్యేక చొరవ చూపారని అన్నారు. సావిత్రిబాయిని నేటి యువత ఆదర్శంగా తీసు కుని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు మహేశ్, శ్రీనాథ్, నాగరాణి, సవితాగౌడ్, మౌనికరెడ్డి, వనిత, మౌనిక, శ్యామల పాల్గొన్నారు.

ఎస్‌టీఎఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం...

అంతర్జాతీయ మహిళా దినోత్సవాని ఎస్ఎఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు

నవతెలంగాణ-నాచారం



బీఆర్ఎస్ నాచారం డివిజన్ సీనియర్ నాయకుడు పరిటాల సాంబశివరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరుగా పార్టీ ఇచ్చిన ప్రతీ పిలుపును విజయవంతం చేస్తూ నమ్మిన సిద్ధాంతం కోసం నిక్కచ్చైన నాయకుడు పరిటాల సాంబశివరావు అని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే నాయకులకు భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయని తెలిపారు.కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, రఘుపతి రెడ్డి, రమేష్ గౌడ్, అంజి, శ్రీరామ్ సత్యనారాయణ, సంతోష్, నాగారం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు నిర్వహించిన శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురసరించుకొని శుక్రవారం శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీ గణేష్ బోయిన్‌పల్లి శివాలయ ప్రాంతంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించి కంటోన్మెంట్‌లోని మహిళలందరి కోసం వారి మధ్య "చైర్ పుల్లింగ్, లెమన్ స్పూన్, నిడిల్ థ్రెడ్ వంటి ఆటలు నిర్వహించారు. అందులోని రౌండ్ల వారీగా గెలుపొందిన విజేతలకు శాలువాలతో సన్మానించారు. చైర్ పుల్లింగ్ లో (ఎం జ్యోతి, స్వాతి, విజయ) , లెమన్ స్పూన్ (శ్రీలత, అలీషా, జ్యోతి), థ్రెడ్ నీడిల్ (కమల,శివ లీలా, సంగీత,), వాకింగ్ (లక్ష్మి బాయి, రాజ మణి ఆశ హుస్సేన్) లలో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా మీక్సీ గ్రైండర్ రెండో బహుమతి "డిన్నర్ సెట్", మూడో బహుమతిగా "హాట్ బాక్స్" నాలుగో బహుమతిగా "హ్యాండ్ బ్యాగ్స్" అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరికీ చీరలను అందజేశారు. శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీ గణేష్ ఏడో తేదీ నుంచి బోర్డు ప్రాంతంలో ప్రతీరోజు ఏదో ఒక వార్డుల వారీగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తూ వస్తుండడాన్ని మహిళలు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ గణేష్ మాట్లాడుతూ సమాజంలో మహిళల ప్రాముఖ్యతను గూర్చి తెలిపారు. చరిత్రలో రాణి రుద్రమదేవి,సావిత్రి బాయి పూలే, నికత్ జరిన్, కల్పనా చావ్లా, మిథాలీ రాజ్, సానియా మీర్జా, చాకలి ఐలమ్మ, ద్రౌపది ముర్మ్ లాంటి ఎందరో ప్రము ఖులు మనకు ఆదర్శంగా ఉన్నారని చెప్పారు. కంటోన్మెంట్‌లో మహిళలు కూడా అన్ని రంగాల్లో విజయం సాధించాలన్నారు.

దళితులపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



దళితులపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని దళిత హక్కుల పోరాట సమితి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సహదేవ్ పిలుపునిచ్చారు. ఈ నెల 31వ తేదీన హైదరాబాద్‌లో జరుగుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం యాప్రాల్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గోడ పత్రికను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులపై ఆగయిత్యాలు పెరుగుతూ ఉన్నాయని తెలిపారు. సీపీఐ ఆల్వాల్ మండల సహాయ కార్యదర్శి పి.చంద్రయ్య, సిపిఐ సీనియర్ జిల్లా నాయకులు దర్శనం. యాదగిరి, నాయకులు వై. వెంకటేష్, సాయిబాబా, రవి, అంబేద్కర్ సంఘం నాయకు లు వై.నర్సింగరావు, సైదులు, మల్లేష్, పెంటయ్య డాక్టర్ ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట్

షాద్‌నగర్‌లో చందన బ్రదర్స్ షాపింగ్ మాల్‌ను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ప్రముఖ సినీతార హనీరోజ్ (వీర సింహారెడ్డి ఫేమ్)లు శుక్రవారం ప్రారంభించారు. చుట్టుప్రక్కల జిల్లాలకు ఇదే అతిపెద్ద షాపింగ్ మాల్ కావడం విశేషం. ఇక్కడ 4 అంత స్థులలో 10,000 చదరపు అడుగులలో నిర్మించిన ఈ మాల్‌లో వస్త్రాలు, హెరాల్



సేల్ ధరలకే విక్రయిస్తున్నామని, అలాగే సుమారు 200 మందికి ఉపాధి కల్పిస్తున్నామని సంస్థ అధినేత అల్లక సత్యనారాయణ తెలిపారు. ఇంతగా తమను ఆదరిస్తూ, ప్రోత్సహిస్తున్న తెలంగాణా ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు సత్కారం

నవతెలంగాణ-హైదరాబాద్



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల, సావిత్రి భాయ్ పులే వర్ధంతి సందర్భంగా ఉస్మాన్‌గంజ్‌లోని గోదావరి అర్బన్ బ్యాంక్ హైదరాబాద్ శాఖలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు ఘనంగా సత్కరించారు. సామాజిక, రాజకీయ రంగంలో వివిధ హెూదాలో పని చేస్తున్న ఎస్.శైలజా క్రాంతి కుమార్, హై కోర్టు న్యాయవాది బి.జ్యోతి, వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న గీత, జ్యోత్స్న జైన్, స్వీటీ రాంక, సరిత జైన్, ఖుష్బును బ్యాంక్ మేనేజర్ ఎస్.ఏ.ముజ్జమిల్ పాష, ఆఫీసర్ కాల సాయిప్రసాద్, జూనియర్ ఆఫీసర్స్ పి.సాయికిరణ్ రెడ్డి, వనజ, శ్రీ లక్ష్మి, జి.మహేష్ పాల్గొన్నారు.

అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ దేవరెడ్డి విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సంఘసేవకురాలు శ్రీదేవిని గురువారం విజ్ఞాన స్కూల్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ మహిళలతోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. సమాజంలో మహిళలు అనేక రకాలుగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారి రామస్వామి యాదవ్, మూల వెంకట్ గౌడ్, ముత్తోజు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

విశ్వానికి పర్యావరణ సోయి నేర్పిన బుద్ధుడు

- సుప్రసిద్ధ ప్రజాకవి గోరటి వెంకన్న
- సిటీ కళాశాల అంతర్జాతీయ సదస్సు

నవతెలంగాణ-హైదరాబాద్



మన దేశంలో బౌద్ధ కాలం నుంచే ప్రకృతి సంరక్షణ ఎరుక పెరిగిందనీ, విశ్వానికి పర్యావరణ సోయి నేర్పింది బుద్ధుడేనని సుప్రసిద్ధ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత గోరటి వెంకన్న అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల, తెలుగు విభాగం నిర్వహిస్తున్న 'తెలుగు సాహిత్యం-పర్యావరణ చైతన్యం' రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో, రెండవ రోజు జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొనీ మాట్లాడుతూ జీవ వైవిధ్య దృష్టి, మనిషితో పాటు సకల జీవరాశికి సమానగౌరవం ఇవ్వాలనే ప్రజాస్వామ్య స్ఫూర్తి బౌద్ధ సాహిత్యంలో కనిపిస్తున్న దన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ నిర్వహిస్తున్న ఈ పర్యావరణ సదస్సు ఆ స్ఫూర్తిని చాటిచెప్తుందని కొనియాడారు. తెలుగు సాహిత్యాన్ని ఈ దృష్టితో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం సిద్ధాంత అధ్యయనం వల్ల గొప్ప సాహిత్యం సృష్టించలేమనీ, అనుభవాల నుంచి చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం నుంచి ఉత్తమ సాహిత్యం సృష్టించబడుతునదన్నారు. సిద్ధాంతాలు చదివి కాక, తన ఊరితో, తన వారితో, ప్రకృతితో పెనవేసుకున్న అవినాభావ సంబంధంలో నుంచి తన కవిత్వం ఆవిర్భవించిందనీ, వాగు, వంక, చేను, చెలక, పిట్ట, చెట్టు, పుట్ట, నల్ల తుమ్మ వంటి ప్రకృతిగతమైన దృశ్యాలే తనకు ప్రేరణనిచ్చా యని చెప్పారు. సభ అధ్యక్షులు ఆచార్య కాశీం మాట్లాడుతూ పెట్టుబడిదారీ సమాజం సృష్టించిన ఒక విధ్వంసక వాతావరణం, మనిషి అత్యాశ పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్నాయన్నారు. భవిష్యత్ తరాల వారైన విద్యార్థులు దీన్ని నిశితంగా పరిశీలించా లన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను విస్తతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ పర్యావరణ వేత్త, కవి మాట్లాడుతూ విశ్వంలో సహజ ప్రకృతి అనేది అంత రించిపోయిందనీ, అవాస్తవాన్ని వాస్తవంగా భ్రమిస్తున్నామనీ, ఈ భ్రమలను తొలగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్. రెంటాల జయదేవ, గౌరీ కపానందన్ డాక్టర్.వి.శంకర్, డాక్టర్. బూర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్. బూర్ల చంద్ర శేఖర్, డాక్టర్. నందిగామ నిర్మల, డాక్టర్.ఎస్.మధుల, డాక్టర్.వెల్దండి శ్రీధర్, డాక్టర్. అట్టెం దత్తయ్య, విప్లవ్ కుమార్ తదితరులు వివిధ అంశాలపై పత్ర సమర్పణ చేశారు. సదస్సు సంచాలకులు డాక్టర్ కోయి కోటేశ్వర రావు, డాక్టర్ నీరజ సమన్వయంలో సాగిన ముగింపు సమావేశంలో అధ్యక్షులుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా, ఆత్మీయ అతిథిగా డాక్టర్.యాదయ్య, డాక్టర్.రత్న ప్రభాకర్ పాల్గొన్నారు. అత్యంత ఆవశ్యకమైన అంశంపై సిటీ కళాశాల నిర్వహించిన ఈ సదస్సు చాలా ప్రయోజనవంతంగా, పరిశోధనాత్మకంగా సాగిందని వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాలల ఆచార్యులు ప్రశంసించారు. సదస్సు అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించి విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులకు సేవలందించిన పౌరసేవల సిబ్బందిని సన్మానించారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు



నవతెలంగాణ-అడిక్‌మెట్

కార్మికుల హక్కులను కాలరాస్తు వారి శ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటాయని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్, అధికార ప్రతినిధి రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రాజు అన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్మికశాఖ కార్యాలయం వద్ద వందలాది మంది కార్మికులతో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్రిశాట్ కంపెనీకి లేబర్ హక్కులు వర్తించవని అంటున్నారనీ, కార్మికులను నిలువునా దోచుకుంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 44 కార్మికచట్టాలు ఉంటే 4 లేబర్ కోడ్స్ చేశారనీ, దీని వల్ల కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. రాష్ట్రంలో కనీస వేతనాల చట్టం అమలై 15 ఏండ్లు గడుస్తున్నా నేటికీ అమలు పరచకపోవడం హేయమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలను రద్దు చేసి గతంలో ఉన్న చట్టాలను పునరుద్ధరిస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. లేని యెడల దేశవ్యాప్తంగా హెచ్ఎమ్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతాం అని హెచ్చరించారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం హెచ్ఎమ్ఎస్ పోరాటం చేస్తునే ఉంటుందని తెలిపారు. ధర్నాలో హెచ్ఎమ్ఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ రావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రెబ్బ రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, కార్యదర్శి ఈశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాచీన కళలను ప్రోత్సహించాలి : వేదకుమార్

నవతెలంగాణ-అంబర్‌పేట



ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ యాజమాన్యం, హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, స్ఫూర్తి థియేటర్, సయుక్తంగా హ్యాండ్, షాడో పప్పెట్రీ షోని శుక్రవారం హిమాయత్ నగర్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ మాట్లాతూ ప్రాచీన కళలు అంతరించిపోకుండా భవిష్యత్తు తరాలకు అందించాల్సిన గురుతరమైన భధ్యత అందరిపైన ఉందన్నారు. హ్యాండ్, షాడో పప్పెట్రీ నిపుణులు శ్రీ ఫ్రాన్స్ హక్కేమర్స్ ప్రపంచ వ్యాతంగా వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ ఈ కళ ప్రాముఖ్యతను తన నైపుణ్యతతో ప్రదర్శించడం దీనిలో భాగమే అన్నారు. ఈయన తోలు బొమ్మ ప్రదర్శనలో ఒకే సారి ఎనిమిది బొమ్మల కదలిక అనుగుణంగా సంభాషణ చేయండం ఈయన ప్రత్యేకత. ప్రాచీన తోలు బొమ్మలాటను వివిధ కథల రూపంలో పాఠలను బోధించడానికి ఉపయోగించడం వల్ల విద్యార్థులు త్వరితగతిన పాఠాంశాలను జీర్ణించుకోవాడానికి సాధ్యపడుతుంది. వారి ఆత్మ విశ్వాసం పెంపుదించడానికి తోడ్పతుంది. తమ చిన్న తనంలో బొమ్మకొళ్ల అని గ్రామాల్లో ఈ తోలుబొమ్మలాటలను ప్రదర్శించే వారని గుర్తు చేశారు. తమిళనాడు నాగర్ కోయల్కు చెందిన మురుగున్ కుటుంబ సభ్యులు ఆయన సోదరులు గత ఆరు యేడు తరాలుగా 14 పాత్రలతో షాడో పప్పెట్రీషోలు నిర్వహిస్తూ ఈ కళలను కాపాడుతున్నారని తెలిపారు. ముఖ్య అతిథి తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ భట్టు రమేష్ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం ప్రాచీన కళలను ప్రోత్సహిస్తుందనీ, వాటికి మరింత ప్రాధాన్యత ఇచ్చి అవి ఉనికిని కోల్పోకుండా తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. దేశం మొత్తం మీద వెయ్యి ప్రాచీన కళలు ఉనికిలో ఉండేవనీ, ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గుతూ వస్తుందన్నారు. వీటిని కాపాడుకోవడానికి అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ డచ్ పప్పెట్రీ కళాకారుడు ఈ కార్యశాల యొక్క రిసోర్స్ పర్సన్ శ్రీ ఫ్రాన్స్ హక్కేమర్స్ పప్పెట్రీ ప్రదర్శన ద్వారా విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రంలో స్కూల్ ఉపాధ్యక్షురాలు ప్రార్థన మాణికొండ, పాఠశాల కరెస్పాండంట్ కె.ప్రభాకర్, స్ఫూర్తి థియేటర్ ఫౌండర్ డైరెక్టర్ పద్మినీ, ప్రధాన ఉపాధ్యాయురాలు రామాంజుల, ఫహ్మిద షామీన్, ఫాతిమా పాల్గొన్నారు.

లైబ్రరీ పక్కన మొబైల్ బయో టాయిలెట్ ఏర్పాటు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రహమత్ నగర్ బస్టాండ్ సెంటర్‌లో గల లైబ్రరీ పక్కన మద్యం షాపు ఏర్పాటు చేశారు. అక్కడ సమీపంలో మూత్రశాలలు లేవు. మద్యం సేవించిన వారు లైబ్రరీ గోడలపై మూత్రవిసర్జన చేస్తున్నారనీ, 10 రోజుల క్రితం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైంది. వెంటనే ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు మద్యం దుకాణాన్ని సందర్శించి, మూత్ర విసర్జన చేయకుండా బహిరంగంగా మద్యం సేవించకుండా షాపు యజమానికి హెచ్చరికలు జారీ చేయడం చేశారు. స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి స్పందించి జీహెచ్ఎంసీ సర్కిల్ 19 అధికారులతో మాట్లాడి, లైబ్రరీ పక్కన ఉన్న కాళీ ప్రదేశంలో మొబైల్ బయో టాయిలెట్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ వాహనంలో మహిళలకు, పురుషులకు వేరువేరుగా మూత్రశాలలు ఉన్నాయి. మొబైల్ వాహనాన్ని, పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేసే వరకు అక్కడి నుంచి తొలగించవద్దని స్థానికులు కోరుతున్నారు. బస్ స్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, స్థానిక వ్యాపారస్తులు, మద్యం సేవించిన బహిరంగంగా మూత్రవిసర్జన చేయకుండా, మొబైల్ బయో టాయిలెట్‌ను వినియోగించుకుంటున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-బంజారాహిల్స్



దేశంలో ఎక్కడా లేని ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ఒక్క కార్యకర్తకూ రూ.2 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నారని ఖైతరాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గతేడాది బైక్ ప్రమాదానికి గురై చనిపోయిన జూబ్లీ హిల్స్ డివిజన్ గౌతమ్ నగర్‌కు చెందిన గుంటి నాగరాజు పార్టీ తరపున మంజూరైన రూ. 2 లక్షల ప్రమాద బీమా చెక్కును అయన సతీమణి గుంటి జ్యోతికి తన క్యాంపు కార్యాలయంలో అందజేసిన అనంతరం మాట్లాడారు. పార్టీకి ఎల్లవేళలా అండగా ఉన్నటు కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పార్టీ కార్యకర్తలకు అనుకోని ప్రమాదం జరిగితే ప్రభుత్వ పరంగానే కాకుండా పార్టీ పరంగా కూడా సహాయం చేస్తుందని చెప్పారు. ఖైరతాబాద్ నియోజకవర్గ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాననీ, సమస్య ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని సీనియర్ నాయకులు నగేష్ సాగర్, అబ్దుల్ ఘని, పెరుక కిరణ్, సునీల్, సంపంగి కిరణ్, ఓర్సు శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, తాటి రాములు, గండికోట శంకర్, కృష్ణ, అమీర్ పాషా, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి చుట్టుపక్కల వారికి కూడా అవగాహన కల్పించాలని హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు అన్నారు. శుక్రవారంబేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌ను సందర్శించి, ఎస్.రంగారావు అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్, ఏసీపీ టీటీఐ బేగంపేట, సుమారు 400 మంది విద్యార్థులు ఎన్‌సీసీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో పాటు వివిధ కళాశాల విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. చిల్డ్రన్ ట్రాఫిక్ పార్కులో కొంతమంది విద్యార్థులకు హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్సీసీ స్టూడెంట్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ప్రధాన ఈవెంట్ బుందోబస్తుకు అవసరమైన సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ పనుల్లో పాల్గొనడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్టూడెంట్ క్యాండెట్లు /వాలంటీర్లను ఉద్దేశించి దేశంలో మరణాలకు మూడో అత్యంత సాధారణ కారణం మొదటి కారణం అయిన రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ట్రాఫిక్ వాలంటీర్ కార్యక్రమానికి విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమనీ, విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలనీ, ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎస్.రంగారావు, టీటీఐ బేగంపేట ఏసీపీ జి.శంకర్ రాజ్, ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు, టీటీఐ సిబ్బంది, హీరోపార్క్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఐ మాక్స్ పోల్ లైట్లు ఏర్పాటు చేస్తాం

నవతెలంగాణ-అడిక్‌మెట్



గాంధినగర్ డివిజన్, అశోక్‌నగర్ నుంచి హిమాయత్ నగర్ వెళ్ళే మార్గం మధ్యలో గల నాలా బ్రిడ్జి వద్ద సాయంత్రం చీకటి పడిన తర్వాత వెలుతురు లేని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అశోక్ నగర్ స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం నూతన ఐ మాక్స్ పోల్, నూతన లైట్లు ఏర్పాటును సిబ్బంది వెంట ఉండి పర్యవేక్షించారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ డివిజన్ వ్యాప్తంగా అవసరం ఉన్న ప్రతి చోట నూతన పోల్స్, స్ట్రీట్ లైట్స్ పలు జంక్షన్‌ల వద్ద నూతన ఐ మాక్స్ పోల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్ కుమార్, స్ట్రీట్ లైట్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీని గ్రామాల వరకు చేరువ చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం, ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో రెండో రోజు జాతీయ సదస్సు ఉత్సాహంగా జరిగింది. వివిధ రంగాల్లో ప్రావీణ్యం గల వారు ప్రసంగ కర్తలుగా పాల్గొన్నారు. హైదరాబాద్ హిందూ పత్రిక సిటీ ఎడిటర్ సెరిష్ కుమార్ నానిశెట్టి, ఐబిటీ ఇంజినీర్ కాలేజీ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముద్రిక కందెల్వర్, వీఎస్ఆర్ కాలేజ్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. కాంచన, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నీతారాణి పాల్గొన్నారు. ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా ఎఎల్ఈఏఎం హైదరాబాద్ చైర్‌పర్సన్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ "డిజిటల్ టెక్నాలజీ ని గ్రామాలకు చేరువ చేయాలనీ, యువత ముఖ్యంగా ముందుకు వచ్చి రాష్ట్ర యువత అవకాశాలను అందుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. గౌరవ అతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఉమెన్ స్టడీ సెంటర్ డైరెక్టర్ ఆచార్య సునితారాణి మాట్లాడుతూ డిజిటల్ రెవాల్యూషన్ రావాల్సి ఉందని చెప్తూనే..అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవాల్సిన అవసరాన్ని చెప్పారు. ముగింపు సమావేశంలో తెలంగాణ విశ్వ విద్యాలయ వీసీ ఆచార్య విజ్జులత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ విజయ లక్ష్మి, ఐ క్యూ ఎ సి డైరెక్టర్ డాక్టర్ లోకపావణి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణ వ్యతిరేక శక్తుల అంతమే టీఎస్సీపీఎస్ఈయూ లక్ష్యం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పాత పెన్షన్ పునరుద్ధరణ వ్యతిరేక శక్తులను అంతం చేయడమే టీఎస్సీపీఎస్ఈయూ లక్ష్యమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, టీఎస్సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్ అన్నారు. రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్సీపీఎస్ఈయు) కేంద్ర కార్యాలయానికి వచ్చి 9 జిల్లాల్లో ఉన్న సీపీఎస్ ఉపాధ్యాయుల సంపూర్ణ మద్దతు కోరుతూ కలిశారు. ఈ సందర్భంగా బీమా భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీఎస్సీపీఎస్ఈయూ కేంద్ర సంఘం ఆదేశాల మేరకు పాత పెన్షన్ పునరుద్ధరణ వ్యతిరేక శక్తులను అంతం చేయాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. పెట్టుబడిదారీ పెన్షన్ పథకానికి వత్తాసు పలుకుతున్న బీజేపీ, ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్న వారిని ఓడించాలని హైదరాబాద్ జిల్లా శాఖ కోరుతున్నదన్నారు. దీర్ఘ కాలిక ప్రయోజనాల దృష్ట్యా పాత పెన్షన్ పునరుద్ధరణకు సహకరించే ప్రతి వ్యక్తికీ శక్తికి సహకరించే, బలాన్ని సమీకరించే విధానంలో భాగంగా పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి సంపూర్ణ మద్దతు తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గుర్రంను గెలిపించాలని కోరారు. గత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్సీపీఎస్ఈయూ మద్దతిచ్చిన అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలవడం చరిత్ర చెప్పిన వాస్తవమన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్-హైదరాబాద్- రంగారెడ్డి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్ల మొత్తం ఓట్లలో 30 శాతం ఓట్లు సీపీఎస్ ఉపాధ్యాయులవేనన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, కార్యదర్శి జి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్, ఈ సీ మెంబెర్ సుధాకర్ పాల్గొన్నారు.



మహిళలకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మహిళా దినోత్సవం సందర్భంగా యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ సర్కిల్ 19 ఆవరణలో, ఏఎమ్‌హెచ్ఓ బిందు భార్గవి విజ్ఞప్తి మేరకు యూసుఫ్ గూడలోని మ్యాక్స్ ఎయిడ్ హాస్పిటల్ యాజమాన్యం మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హాస్పటల్ సిబ్బందితో కలిసి, డిప్యూటీ కమిషనర్ రమేష్, ఏఎమ్ఓహెచ్ బిందు భార్గవి, టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, ఎస్ఓ భార్గవితో కలిసి ప్రారంభించారు. సుమారు 120 మందికి ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల వరకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలనీ, మ్యాక్స్ ఎయిట హాస్పిటల్ డాక్టర్స్, సిబ్బంది, వచ్చిన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 15 మంది డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుశిష్య పరంపరకు అత్యంత ప్రాముఖ్యత

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



భారతీయ సంస్కృతిలో గురుశిష్య పరంపరకు అత్యంత ప్రాముఖ్యత ఉందని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తాన్ బజార్‌లో నీ శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో భారతీయ శాస్త్రీయ నృత్య, సంగీత రీతుల ప్రసంగపరంపర కార్యక్రమాన్ని రమణాచారి జ్యోతి చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాట్యయోగ అనే అంశంపై ప్రముఖ నృత్య గురువులు డాక్టర్ కాళ్లకూరి ఉమావైజయంతిమాల మాట్లాడారు. ఈ సందర్భంగా కె.ఉమా వైజయంతి మాలను సన్మానించారు. నృత్య గురువులు కళా కృష్ణ, డాక్టర్ భాగవతుల సేతురాం, జి.వసుంధర, నిష్టల సుధామాల, కళా కారులు రేణుకా ప్రభాకర్, డాక్టర్ ఇందిరహేమ, వాణీరమణ, స్నేహ గాడి చర్లతోపాటు నవ్య సంస్థ ప్రతినిధులు వి.విజయకుమార్, ఆర్.ఎస్.సుధా రాణి, జె.వి.వి.శర్మ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విశ్వవిద్యాలయాలతో బ్యాచెలర్ ఆఫ్ సైన్స్ డ్యుయల్ డిగ్రీని ప్రారంభిస్తోంది మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం

నవతెలంగాణ : మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం భారతీయ విద్యార్థులకు నూతన బ్యాచెలర్ ఆఫ్ సైన్స్ డ్యుయల్ డిగ్రీని పూర్తి చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది, ఈ ఘనత చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయం, సావిత్రీబాయి పూలే పుణె విశ్వవిద్యాలయం, మరియు గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (హైదరాబాదు)తో పెంపొందించుకున్న భాగస్వామ్యాలది అయి ఉంటుంది.కొత్త డ్యుయల్ డిగ్రీలో నమోదు చేసుకునే విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలు ఇండియాలో చదువుతూ, ఆ తర్వాత రెండు సంవత్సరాలు మెల్‌బోర్న్ క్యాంపస్ యందు చదువుతూ తమ డిగ్రీని స్వదేశంలో మరియు విదేశంలో పూర్తి చేసుకోగలిగి ఉంటారు.వారు తమ చదువును విజయవంతంగా పూర్తి చేసుకోగానే, మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం నుండి భారతీయ విద్యార్థులకు బ్యాచెలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ ప్రదానం చేయబడుతుంది, మరియు వారు స్థానిక విద్యాసంస్థచే డిగ్రీ ప్రదానం చేయబడే ఐచ్ఛికాన్ని కలిగి ఉంటారు. అదనంగా, భారతీయ విద్యార్థులు తమ అంతిమ సంవత్సరంలో ఆరు మాస్టర్స్ సబ్జెక్టులను చదువుకోవచ్చు, తద్వారా వారు సైన్స్, ఇంజినీరింగ్, ప్రజారోగ్యం మరియు డేటా సైన్స్ తో సహా ఒక కూర్పు సబ్జెక్టుల నుండి వేగవంతమైన మాస్టర్స్ డిగ్రీ పొందవచ్చు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి వాణిజ్య ప్రతినిధి బృందము భారతదేశ పర్యటనతో పాటుగా పాల్గొన్న మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయము వైస్-ఛాన్సలర్ డంకన్ మాస్కెల్ గారు ముంబైలో ఈ డ్యుయల్ డిగ్రీని ప్రకటించారు.

'ఉత్పత్తి నాణ్యతను పరిగణలోకి తీసుకుంటాం'

నవతెలంగాణ-అంబర్‌పేట

సోనాలికా ట్రాక్టర్స్ ఇప్పటివరకు అత్యధికంగా 14.1శాతం మార్కెట్ వాటాతో 1,37,344 ట్రాక్టర్ల మొత్తం అమ్మకాలను 1,37,344 ట్రాక్టర్ల అత్యధిక వైటీడీ ఫిబ్రవరి 23న నమోదు చేసింది. అలాంటి అద్భుతమైన సాధనతో ఎఫ్‌వై 23 చివరి దశకు వెళ్లడం, దాని అధునాతన ట్రాక్టర్‌లతో అభివృద్ధి చెందుతున్న డిమాండ్‌లను అందించడంలో, రైతులతో కలిసి పెరగడంలో సోనాలికా స్థిరత్వాన్ని బాగా వివరిస్తుంది. ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ మాట్లాడుతూ "రైతుల మొదటి, ప్రధానమైన అవసరంగా ఉత్పత్తి నాణ్యతను పరిగణలోకి తీసుకుంటూ, మేం దూకుడుగా ఆవిష్కరిస్తున్నాం. రైతులు యాంత్రీకరణను వేగంగా అవలంబించడం చూసి సంతోషిస్తున్నాం. పరిశ్రమను అధిగమించి, అత్యధిక విక్రయాలు నమోదు చేసుకుంది. అని పేర్కొన్నారు.

రహమత్‌నగర్ లైబ్రరీ ఆవరణలో కంటి వెలుగు కార్యక్రమం

నవతెలంగాణ-జూబ్లిహిల్స్



రహమత్ నగర్ లైబ్రరీలో శుక్రవారం శ్రీరామ్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్స్ డాక్టర్లు సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి, వారికి కావాల్సిన కండ్లద్దాలను పంపిణీ చేశారు. కంటి వెలుగు కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ సిఎన్ రెడ్డి పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడి, అనంతరం కంటి పరీక్షల కోసం వచ్చిన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా కంటి వెలుగు శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ పూర్తి మాట్లాడుతూ నేటి నుంచి 10 రోజుల వరకు ఇక్కడ కంటి వెలుగులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి నాలుగు గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చిన వారిని పరీక్షించి పెద్ద వయస్సు వారికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.శుక్లాలు ఉన్న వారిని మైదిప ట్నంలోని సరోజినీ దేవి హాస్పిటల్‌కు వెళ్లి చూయించుకో వాలని పంపుతున్నామని తెలిపారు. మొదటి రోజు సుమారు 130 మంది మహిళలు, పురుషులు కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది యోగిత, ప్రియాంక, నర్సులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాంసంగ్ ఫ్రేమ్- TVలో గ్లోబల్ కళాకారుల కళాకృతులను, కళని, కళా ఉత్సవ సమయయంలో ప్రదర్శిస్తోంది

నవతెలంగాణ : సాంసంగ్, భారతదేశం యొక్క అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, దాని ప్రముఖమైన లైఫ్‌స్టైలు TV - ది ఫ్రేమ్ పైన, ఇటీవలే St+art ఇండియా ఫౌండేషన్ మరియు ఏషియన్ పెయింట్స్ ద్వారా సహ-వ్యవస్థీకరించబడి జరిగిన మూడు-నెలల దీర్ఘ ముంబాయ్ అర్బన్ ఆర్ట్ ఫెస్టివల్ (MUAF)లో గ్లోబల్ కళాకారులు వారి కళను డిజిటల్‌గా ప్రదర్శించడానికి సాధికారతనిచ్చింది. ఈ ఫ్రేమ్ ఆన్‌లో ఉన్నప్పుడు TV ఆఫ్‌లో ఉన్నప్పుడు కళ. ఇది కళాప్రియులకు వారి గోడల మీద ప్రపంచంలో ప్రముఖమైనవే కాకుండా ప్రాంతీయ కళాకృతులులను సజీవంగా తీసుకురావడానికి ఇది రూపొందించబడింది. చాలా మంది ఇండియన్స్ ఈ రోజుల్లో ఎంచుకుంటున్న కనీసపు, ఎస్తెటిక్, మరియు కోజీ ఇంటీరియర్ స్టైల్స్‌తో ఈ కొత్త-తరం ప్రాడక్ట్ అంతరాయంలేకుండా కలసిపోతుంది. ఒక అరుదైన కదలికలో, సాంసంగ్ దాని సూపర్‌కూల్ మరియు స్టైలిష్ ది ఫ్రేమ్ TVని ప్రపంచం ముందుకి తీసుకురావడానికి కళాప్రేమికులకి ప్రదర్శనకర్తలకి కళాకృతులను వీక్షించేటప్పుడు నిమగ్నమైయే అనుభవాన్ని అందించడానికి ప్లాట్‌ఫార్మ్‌గా ప్రాముఖ్యతనివ్వడానికి ఆర్ట్ ఫెస్టివల్‌ని లీవరేజ్ చేసుకుంది.

నథనియల్‌కు గాలి వినోద్ మద్దతు

నవతెలంగాణ-ఓయూ



ప్రొఫెసర్ నథనియల్‌కు తెలంగాణలోని 93శాతం ఉన్న బహుజన విద్యావంతులందరూ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు పలికి మొదటి ప్రాధాన్యత ఓటుగా సీరియల్ నంబర్ 16పై ఓటేసి బంపర్ మెజారిటీతో గెలిపించాల్సిందిగా ఉస్మానియా తెలంగాణ విశ్వవిద్యాలయాల డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొ.డాక్టర్ గాలి వినోద్ కుమార్ సీనియర్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ముత్తయ్య తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం గాలి వినోద్ మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ లలో స్టూడెంట్ అభ్యాసన ప్రక్రియను మెరుగ్గా చేస్తున్న LEAD

నవతెలంగాణ : LEAD ఇండియాలో అతిపెద్ద స్కూల్ Ed-Tech Unicron. ఆంధ్రప్రదేశ్లో అభ్యసనా ఫలితాలు మార్చుతూ స్టూడెంట్ కాన్ఫిడెన్సును నిర్మిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలు గల పాఠ్యప్రణాళికతో, మల్టీ-మోడల్ బోధన అభ్యసన పద్ధతులతో మరియు టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలతో NEP 2020 కి అనుగుణమైనది LEAD ఇంటగ్రేటెడ్ స్కూల్ సిస్టం. లోతుగా కాన్సెప్టులను అర్థం చేసుకోవడంలో, అన్ని సబ్జెక్టులలో నైపుణ్యం సాధించడంలోనూ విద్యార్థులకు తోడుగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్లోని LEAD Powered Schools లలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో, కోవిడ్ సంబంధిత సవాళ్లు ఉన్నా సరే, దాదాపు 20 % మేర స్టూడెంట్ అభ్యసన ఫలితాలను మెరుగు చేయగలిగింది. ఆంధ్రప్రదేశ్ లోని 240కి పైగా స్కూళ్లలో LEAD యొక్క ఇంటెగ్రేటెడ్ స్కూల్ సిస్టం ఇప్పటికే అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో 90000 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోంది. అంతకుమించి 2500o మందికి పైగా టీచర్లు ఇప్పటికే LEAD ద్వారా శిక్షణ పొంది సర్టిఫై అయ్యారు. ద్వితీయ శ్రేణి పట్టణాలలోని స్కూల్స్ లలో మార్పులు సాధించడం ద్వారా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువస్తూ, ఈ పట్టణాలకు మరియు ఇండియాలోని మెట్రోలు పెద్ద నగరాలకు మధ్య ఉన్న విద్యా అంతరాన్ని LEAD తగ్గిస్తోంది. LEAD యొక్క ఇంటెగ్రేటెడ్ సిస్టం దేశవ్యాప్తంగా 400o పట్టణాలు/నగరాలలో 3000o పైగా స్కూల్సులో అందుబాటులో ఉంది. దీని ద్వారా 12 లక్షల మంది స్టూడెంట్స్ కి చేరువ అయ్యింది. అలాగే 25000o టీచర్లకు సాధికారకతను అందించింది. LEADస్కూల్ స్టూడెంట్స్ కమ్యూనికేషన్, కొలాబరేషన్ క్రిటికల్ థింకింగ్ వంటి భవిష్యత్తు స్కిల్స్ లను నిర్మించుకొని విజయం సాధించేందుకు తగిన విశ్వాసాన్ని పొందగలుగుతారు.

ఇప్పుడు మహిళా సాధికారత యాదికొచ్చిందా?

నవతెలంగాణ-సిటీబ్యూరో



మహిళా రిజర్వేషన్ బిల్లు, వారి సాధికారత గురించి భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడిన మాటల్ని చూస్తుంటే ఆమె లిక్కర్ స్కాములో ఎంతలా కురుకుపోయిందో అర్థమవుతుందని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధులు కొంగరి అరుణ క్వీన్, డాక్టర్ వెంకటేష్ చౌహాన్, డాక్టర్ సాంబశివ గౌడ్ అన్నారు. బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ తొమ్మిదేండ్లుగా యాదికిరాని మహిలా బిల్లు గురించి ఆకస్మాత్తుగా ఇప్పుడు గుర్తుకు రావడమే ఏంటని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలు, ఆడపిల్లలు, చిన్నారులపై జరుగుతున్న లైంగికదాడులు, కుల దురంహకార హత్యలపై ఏనాడు ఆమె స్పందించిన పాపాన పోలేదన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో రెపోమాపో అరెస్ట్ కాబోతున్నారనే వార్తల నేపథ్యంలో మహిళా బిల్లు అంశాన్ని ఎత్తుకున్నారని ఆరోపించారు. మహిళా సాధికారత, మహిళలకు ప్రాధాన్యత ఒక్క బహుజన్ సమాజ్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు.

చెన్నకేశవ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

నవతెలంగాణ-సిటీబ్యూరో



పీఆర్టీయూ టీఎస్ అధికారిక ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గుర్రం జ్యోతి చెన్నకేశవ రెడ్డి ఉపాధ్యాయులను విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాంపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో గుర్రం చెన్నకేశవ రెడ్డి తరపున ఆయన సతీమణి జ్యోతి తొటి మహిళ ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం నిర్వహించారు. టీటీ జాక్ బలపర్చిన పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ జిల్లా నాయకులు నాగేశ్వరరావు, అశోక్, రంజిత్ రెడ్డి, సైదాబాద్ మండల నాయకులు మందడి వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మన్నెం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్ హెడ్ క్వార్టర్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్ హెడ్ క్వార్టర్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పాల్గొని మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చేస్తున్న కృషి ఎనలేనిదని కితాబిచ్చారు. మహిళలు ఒక కూతురుగా, ఒక పక్క ఉద్యోగంలో అధికారిగా, మరో పక్క తల్లిగా, భార్యగా సమాజంలో మహిళలు బహుపాత్రలు నిర్వహిస్తూ విధులు నిర్వహించడం మామూలు విషయం కాదన్నారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 18,432 మంది సిబ్బంది పని



చేస్తుండగా అందులో 11.5 శాతం మంది మహిళా సిబ్బంది ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలలో ఫీల్డ్ పాత్రలు చేపట్టాలని సూచించారు. సీసీఎస్, ఎస్బీ, సీఐడీ, ఇంటలిజెన్స్ వంటి వాటిలో పోస్టింగ్‌లకు ప్రాధాన్యత ఇస్తూ, కఠినమైన విధులకు దూరంగా ఉండకూడదని సూచించారు. అనంతరం మహిళా సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీనీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్ సింగ్ మెన్నా, జాయింట్ సీపీ ఎ.ంశ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షాకాలం నాటికి డ్రయినేజీ సమస్య పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్‌నగర్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో వర్షాకాలం నాటికి డ్రయినేజీ సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ కాలనీలో సుమారు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న ఓన్ ఫీట్ డ్రయినేజీ పైప్ లైన్ పనులను జల మండలి అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ భాగ్యనగర్ ఫేజ్ 3 నుంచి హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ కాలనీలో నిర్మిస్తున్న ఓన్ ఫీట్ డ్రయినేజీ పైప్ లైన్ పనులను పరిశీలించినట్టు తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రత్యేక చొరవతో డివిజన్‌లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతాల్లో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామన్నారు. ఏ చిన్న సమస్య అయినా తన దష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలనీ, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రశాంతి, సూపర్ వైజర్ నరేంద్ర, భాగ్యనగర్ ఫేజ్ 3 కాలనీ వాసులు శ్రీధర్, జవహర్ బాబు, శివాజీ, విజయ్, కృష్ణ, అరబ్, సందీప్, శైలేష్, వినోద్, అప్పలరాజు, హెచ్‌ఎంటీ కాలనీవాసులు గాంధీరావు, గోపిచంద్, కేఎస్‌ఆర్ మూర్తి, చక్రపాణి, జగదీష్, మోహన్ సత్యనారాయణ, మల్లేశ్వర చారి, రామచంద్ర రెడ్డి, జనార్ధన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో 'నేచర్ క్యాంప్'



నవతెలంగాణ-సిటీబ్యూరో

మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్, క్లైమేట్ చేంజ్ న్యూఢిల్లీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నేషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నేచర్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. నేచర్ క్యాంప్ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధిక ఆధ్వర్యంలో నగరంలోని 15 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులతో కలిసి దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ, రాజేందర్‌నగర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ డైవర్సిటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి బయోడైవర్సిటీ, ఫారెస్ట్ విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైంటిస్ట్ బి. కవి సిద్దార్థ బయోడైవర్సిటీ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు ల్యాబ్‌లో పక్షులు, జంతువులు వాటి నమూనాలను వారికి చూపించారు. తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో డాక్టర్ ధర్మచంద్ర మెడిసినల్ ప్లాంట్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఐఆర్డీ డైరెక్టర్ డాక్టర్ ప్రణయ్ కుమార్ ఘోష్ విద్యార్థులకు కుటీర పరిశ్రమ, వాటి నమూనాలు, వివిధ స్టార్టప్స్ గురించి వివరించారు. జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావు, జన భారతి హై స్కూల్ గైడ్ టీచర్ నిర్మల, నేషనల్ గ్రీన్ క్రాప్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు రాజశేఖర్, రాజేశ్వర్ విద్యార్థులకు అవగాహన కల్పించడానికి సహాయమందించారు.

ఉరేసుకుని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-బాలానగర్

డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసు కుంది. సీఐ కె.భాస్కర్ వివరాల ప్రకారం బాలానగర్ గ్రామానికి చెందిన నర్సింగరావుకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. నర్సింగరావు తన భార్యతో కలిసి ఈనెల 8న వికారాబాద్ జిల్లాలోని కోటిపల్లిలో బంధువుల పెళ్లికి వెళ్లారు. గురువారం ఉదయం బేగంపేటలోని గర్ల్స్ కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పెద్ద కూతురు వన్నెల పావని (19)కి ఫోన్ చేయగా కాలేజీకి వెళ్తున్నట్టు చెప్పింది. సాయంత్రం ఇంటికొచ్చిన భార్యభర్తలు ఎంతసేపు తలుపు కొట్టినా తీయకపోవడంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా పావని చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. వెంటనే కిందికి దించి స్థానిక ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు.

కె.ఆర్.రాజ్‌కుమార్ దంపతులకు సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో



టీఎన్జీవో స్కూల్ ఎడ్యూకేషన్ యూనిట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, బి.వి ఆశోక రాణి(హయ్యర్ ఎడ్యూకేషన్ యూనిట్ అధ్యక్షురాలు) దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్కూల్ ఎడ్యూకేషన్ యూనిట్ జిల్లా కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.డేవిడ్, కోశాధికారి ఎస్.డి ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షుడు బి.రవి, జాయింట్ సెక్రటరీ జయంతి, ఈసీ మెంబర్ మహ్మద్ ముజాహిద్ అలీ వారి కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి కేక్ కట్ చేశారు. ఈనంతరం గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ ప్రిన్సిపాల్ రాంరెడ్డి, కార్యాలయ ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ నర్సింగ్‌రావు సమక్షంలో జయంతిరెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక సభ్యులు, సెక్టోరియల్ ఆఫీసర్ కనీజ్ ఫాతిమా, కె.పి.అనురాధ, జి.రాజ్‌కుమార్, డి.శ్రీకాంత్, ఆర్.విజయలక్ష్మి, సరళాదేవి, తాకి అలీ, చక్రవర్తి, ప్రవీణ, సూర్యప్రకాష్, రమేష్, అరుణ, లావణ్య, మీర్జా, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలేకి నివాళి

నవతెలంగాణ-సిటీబ్యూరో



టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో శుక్రవారం మెహదీ నవాబ్ జంగ్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 600 మంది రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ మానవసేవ- మాధవసేవగా భావించి వివిధ ప్రాంతాల నుంచి ఆస్పత్రిన వారికి అన్నదానం చేయడం సంతోషం అన్నారు. అనంతరం జిల్లా కార్యాలయంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, సహాధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుర్రాడి శ్రీనివాస్, బి.శంకర్, ముఖీమ్ ఖురేషి, ఎంఎన్‌జే ఆస్పత్రి అధ్యక్షులు అరుణ్ జ్యోతి, కార్యదర్శి శివ కుమార్, సభ్యులు చంద్రశేఖర్, నాల్గవ తరగతి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎం.అబ్దుల్ ముజీబ్, ఏపీఆర్వో ఎం.వహీద్, ముస్తఫా షరీఫ్, పాల్గొన్నారు.

హరితకు నేషన్ వైడ్ బిజినెస్ మింట్ అవార్డు

నవతెలంగాణ-సిటీబ్యూరో



స్వీయ-ప్రేరేపిత సౌందర్యం, వ్యక్తిగత సంరక్షణ పరిశ్రమ వ్యవస్థాపకురాలు హరిత ఎస్ హివాగా మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మొదటగా సెలూన్, సౌందర్యశాస్త్రంలో వారి హివాగా సంస్థ సహకారం కోసం ఆమె ఇటీవల నేషనల్-వైడ్ బిజినెస్ మింట్ అవార్డును గెలుచుకున్నారు. మహిళా దినోత్సవం ఈ వారంలో, ఆమె తన విజయాన్ని, మహిళా సాధికారతపై తన విస్త్రత అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమాజంలోని ప్రతి స్త్రీ తమ ఆలోచనల పట్ల అభిరుచి, ఆసక్తితో నిండిన హృదయంతో తాము అనుకున్నది సాధించగలదని ఆమె తెలిపారు. స్వయం సమర్పణ, కఠోర శ్రమతో క్రమంగా ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఆమె నిరూపించారు. ఆమె 2019లో హివాగా స్కిన్ హెయిర్ బ్యూటీ సెలూన్ అండ్ ఈస్తటిక్స్‌ను స్థాపించినందున, అప్పటి నుంచి ఆమె ఈ రంగంలో తిరుగులేని శక్తిగా నిలిచారు. ఆమె అందం పరిశ్రమకు గణనీయమైన కృషి చేసిన అసాధారణమైన సీఈగా రాణిస్తున్నారు. అందం పరిశ్రమ పట్ల ఆమెకున్న అభిరుచి, ఆమె అంకితభావం, కృషితో కలిపి, హివాగాను దేశంలోని అత్యంత ప్రసిద్ధ బ్యూటీ క్లినిక్‌లలో ఒకటిగా స్థాపించారు. ఇది విజయానికి మంచి సంకేతమని ఆమె భావించారు.

మహిళలకు ప్రత్యేక కంటి పరీక్షలు

నవతెలంగాణ-ఓయూ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ప్రత్యేక కంటి పరీక్షలను లాలాపేట్ లోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో శానిటేషన్ మహిళలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు, ప్రత్యేకంగా కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు శోభన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీవాణి, జీహెచ్ఎంసీ సానిటేషన్ మహిళలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్ర శిబిరం ప్రారంభం

తార్నాక డివిజన్ శాంతినగర్, లాలాపేట్ ప్రాంతాల్లో బీఆర్ఎస్ సీనియర్ నేత పోల్కంపలి మధుబాబు చలివేంద్ర శిబిరాన్ని బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి నగర డిప్యూటీ మేయర్ మోతె ప్రారంభించారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన నియోజకవర్గ ప్రజలు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని ఎమ్మెల్సీ శంభీపూర్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శుక్రవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ మేరకు సమస్యలపై స్పందించి, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎస్ఎస్కె సమాజ్ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో భాగ్యలక్ష్మి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మాస్ ఉపనయన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాయకులు సురేష్‌రెడ్డి పాల్గొని ఎస్.ఎస్.కె సమాజ్ వారి ఉద్దేశించి మాట్లాడుతూ మీ అందరికీ అందుబాటులో ఉంటాననీ, ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకు వస్తే తప్పకుండా పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శివాజీ, ఎస్ఎస్‌కె సమాజ అధ్యక్షుడు విష్ణు, శివకుమార్, రామకృష్ణారావు, నందకిషోర్, ప్రభు పాల్గొన్నారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



మెపా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులుగా వర్ల వెంకటయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా బట్టికాడి హనుమంత్ రావు (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం)లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మెపా కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్లపల్లి సంజీవన్ కుమార్ ముదిరాజ్, పెండెం మధుసూధన్ ముదిరాజ్ ల సమక్షంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకుని వారికి నియామక పత్రాలను అందజేశారు. నవతెలంగాణ-మేడ్చల్

హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్ కాలనీలో రూ.48.50 అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను అర్ధరాత్రి ఆకస్మికంగా వెళ్లి తెల్లవారు జాము వరకు ఎమ్మెల్యే అక్కడే ఉండి స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రొటెక్ట్ డే మార్చి 9వ తేదీని పురస్కరించుకుని రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ నేతృత్వంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ మహాసభ శంకర్ రావు అధ్యక్షతన ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మచ్చ రంగయ్య, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, ఆర్గనైజర్ కార్యదర్శి ఎల్.వి ప్రసాద్ హాజరై పెన్షనర్స్ సమస్యలపై వివరాత్మకమైన సందేశాలు తెలుపుచూ పెన్షనర్లకు అవగాహన కల్పించారు. అనంతరం అధ్యక్షులు కార్యదర్శులుగా, జి.వెంకటరాజు, కె.శంకర్ రావు, కోశాధికారి ఎన్.కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా కెవిఆర్ శాస్త్రి, అమీర్ పాష, జాయింట్ సెక్రెటరీలుగా సీహెచ్ సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కె.రామ లక్ష్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కె.పెంచలయ్య, జి.మల్లారెడ్డి, ఆర్.అమరేందర్, టి. విశ్వనాథం, సోషల్ మీడియా వి.శ్రీనివాసరావు ఎంపికయ్యారు. నవతెలంగాణ-దుండిగల్

వాటర్ వర్క్స్ ఎండీతో కార్పొరేటర్లు, ఎమ్మెల్యే భేటీ

నవతెలంగాణ-దుండిగల్



కుతుబుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రగతి నగర్‌లో కొంతకాలంగా తాగునీటి సమస్య ఉండటంతో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద సమక్షంలోనీటి సమస్యపై వాటర్ వర్క్స్ ఎండీ దాన కిషోర్‌తో ప్రగతి నగర్ కార్పొరేటర్స్, ఆల్విన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ నబీ, రమేష్ వాటర్ వర్క్స్ జీఎం సంతోష్, మేనేజర్ సరిత, పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నవతెలంగాణ-శామీర్‌పేట



శ్రద్ధతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్పీఆర్ కళాశాల చైర్మన్ నర్సింహ రెడ్డి విద్యార్థులకు సూచించారు. శామీర్‌పేటలోని ఎస్పిఆర్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని మొగుళ్ళ వెంకట్రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఎస్ పి ఆర్ ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు 'అన్యువల్ డే ఉత్సవ్' సంబరాలను జరుపుకున్నారు. కాగా కళాశాల చైర్మన్ నరసింహారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట ఎస్ పి ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మహేందర్ గౌడ్, లెక్చరర్లు గోవర్ధన్ రెడ్డి, తిరుపతిరావు, మోహన్ రెడ్డి, నరేష్, శ్రీనివాస్, భాస్కర్, కళాశాల విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'విల్లో వుడ్స్' ప్రీ స్కూల్ ప్రారంభం

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి 1వ డివిజన్ హరితవణం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'విల్లో వుడ్స్' ప్రీ స్కూల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ స్థానిక కార్పొరేటర్ విజయ లక్ష్మీ వెంకట సుబ్బారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ యాజమాన్యంకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా స్కూల్ వెబ్ సైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలన్ వీరేందర్ రెడ్డి, చిట్ల దివాకర్, స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి పెనుమత్స, సీనియర్ నాయకులు సుబ్బారావు, చంద్రగిరి సతీష్, సాయి, యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు


నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ డివిజన్‌లో టీవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ టి.కోటిరెడ్డి ఆధ్వర్యంలో చింతల్‌లోని వెంకటేశ్వర నగర్ బచ్పన్, సూరారం బచ్పన్ స్కూల్‌లలో వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా కేంద్ర బాల్యసాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ శ్రీ దాసరి, టీవీఆర్ విద్యాసంస్థల అధినేత అధినేత టి.కోటిరెడ్డి అరుణకుమారి, సురా రవీందర్ రెడ్డి, దీప్తి రెడ్డి, వంశి రెడ్డి, వేణు మాధవ్ జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సైంటిస్టు జనార్ధన్, దేవేందర్, యాదగిరి, సురా రవి చంద్ర రెడ్డి, అరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా శుక్రవారం మహిళలకు "వంటల పోటీలను" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణ రావు, రెవెన్యూ ఆఫీసర్ బి.శ్రీహరి రాజు, మున్సిపల్ ఇంజినీర్ పి.ప్రవీణ్ కుమార్, మున్సిపల్ మహిళా బిల్ కలెక్టర్స్, మహిళా కంప్యూటర్ ఆపరేటర్స్, మహిళా రిసోర్స్ పర్సన్స్, మున్సిపల్‌లో పనిచేసే మహిళా పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. నవతెలంగాణ-దుండిగల్




కెరీర్ తొలి 100 : కామెరూన్ గ్రీన్ (114)

మొతెరా మైదానంలో సంప్రదాయ టెస్టు క్రికెట్ జోరు నడుస్తుంది!. బ్యాటర్లకు అనుకూలిస్తున్న పిచ్‌పై ఉస్మాన్ ఖవాజ (180), కామెరూన్ గ్రీన్ (114) శతకాల మోత మోగించారు. టెయిలెండర్లు సైతం పరుగుల వేటలో కదం తొక్కగా తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 480 పరుగుల భారీ స్కోరు సాధించింది. బదులుగా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 36/0తో ఆడుతుంది. చివరి టెస్టును రక్తి కట్టించటం ఇప్పుడు భారత బ్యాటర్ల చేతుల్లోనే ఉంది. నేడు మనోళ్లు మెరిస్తే.. అహ్మదాబాద్ టెస్టు ఆసక్తికరంగా మారనుంది!.

బ్యాటర్లు మెరిస్తేనే!

- తొలి ఇన్నింగ్స్‌లో 444 పరుగుల వెనుకంజ
- భారత్ తొలి ఇన్నింగ్స్ 36/0
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 480/10
- కామెరూన్ గ్రీన్ కెరీర్ తొలి సెంచరీ
- ఆఫ్ స్పిన్నర్ అశ్విన్‌కు ఆరు వికెట్లు
- భారత్,ఆసీస్ నాల్గో టెస్టు రెండో రోజు



మారథాన్ ఇన్నింగ్స్ : ఉస్మాన్ ఖవాజ (180)

నవతెలంగాణ-అహ్మదాబాద్

జీవం లేని పిచ్‌పై ఆస్ట్రేలియా పరుగుల పండుగ చేసుకుంది. స్పిన్, సీమ్, పేస్‌కు ఏమాత్రం అనుకూలించని పిచ్‌పై ఆసీస్ టెయిలెండర్లు సైతం రాణించారు. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజ (180, 422 బంతుల్లో 21 ఫోర్లు) మారథాన్ ఇన్నింగ్స్‌కు తోడు కామెరూన్ గ్రీన్ (114, 170 బంతుల్లో 18 ఫోర్లు) కెరీర్ తొలి సెంచరీతో చెలరేగటంతో తొలి ఇన్నింగ్స్ ఆస్ట్రేలియా 480 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఐదో వికెట్‌కు ఖవాజ, కామెరూన్ 208 పరుగులు జోడించగా.. తొమ్మిదో వికెట్‌కు నాథన్ లయాన్ (34), టాడ్ మర్ఫీ (41) 70 పరుగులు జోడించారు. టీమ్ ఇండియా ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (6/91) ఆరు వికెట్ల ప్రదర్శనతో మాయ చేశాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 36/0తో శుభారంభం చేసింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (17 బ్యాటింగ్), శుభ్‌మన్ గిల్ (18 బ్యాటింగ్) అజేయంగా ఆడుతున్నారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో మరో 444 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది.



అశ్విన్‌కు ఆరు : రవిచంద్రన్ అశ్విన్ (6/91)

తొలి సెషన్ : ఖవాజ, గ్రీన్ దూకుడు

రెండో రోజు తొలి సెషన్లో ఆస్ట్రేలియా ఏకపక్ష జోరు కనిపించింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు ఉస్మాన్ ఖవాజ, కామెరూన్ గ్రీన్ పరుగుల వేటలో దూకుడుగా ఆడారు. కామెరూన్ గ్రీన్ 8 బౌండరీలతో 67 బంతుల్లోనే అర్థ సెంచరీ అందుకున్నాడు. మరో ఎండ్‌లో ఉస్మాన్ ఖవాజ చెక్కుచెదరని ఏకాగ్రత భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలువగా.. కామెరూన్ గ్రీన్ దూకుడు చూపించాడు. తొలి రోజు చివరి సెషన్ ఉత్సాహం కొనసాగించిన ఈ జోడీ ఉదయం సెషన్లో ఏకంగా 92 పరుగులు పిండుకుంది. ఉదయం సెషన్లో సీమ్‌తో వికెట్లపై గురిపెట్టిన రోహిత్‌సేనకు నిరాశ తప్పలేదు. ఉస్మాన్ ఖవాజ సైతం 20 బౌండరీల సాయంతో 346 బంతుల్లో 150 పరుగుల మైలురాయి చేరుకున్నాడు. కామెరూన్ గ్రీన్, ఉస్మాన్ ఖవాజ దూకుడుతో తొలి సెషన్లో భారత్‌కు వికెట్ దక్కలేదు.

రెండో సెషన్ : అశ్విన్ మాయజాలం

లంచ్ విరామం అనంతరం టీమ్ ఇండియా మ్యాచ్‌లోకి వచ్చింది. ట్రంప్‌కార్డ్ అశ్విన్ మాయ చేయటం మొదలెట్టాడు. దీంతో ఈ సెషన్లో ఆస్ట్రేలియా మూడు వికెట్లు కోల్పోయింది. 16 ఫోర్లతో 143 బంతుల్లోనే శతకం బాదిన కామెరూన్ గ్రీన్.. కెరీర్‌లో తొలిసారి మూడంకెల స్కోరు అందుకున్నాడు. 60 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన ఖవాజ, గ్రీన్ జోడి 208 పరుగులు పిండుకుంది. ఈ ఇద్దరి ఇన్నింగ్స్‌లతో ఆస్ట్రేలియా ఓ మోస్తరు స్కోరు నుంచి భారీ స్కోరు సాధించింది. ఆసీస్‌ను ముందంజలో నిలిపిన ఈ జోడీని ఎట్టకేలకు అశ్విన్ విడదీశాడు. ఒకే ఓవర్లో కామెరూన్ గ్రీన్, అలెక్స్ కేరీ (0)లను అవుట్ చేసి భారత్‌కు ఊరట కలిగించాడు. మిచెల్ స్టార్క్ (6) సైతం అశ్విన్ మాయలో పడ్డాడు. రెండో సెషన్లో భారత్ మూడు వికెట్లు పడగొట్టగా, ఆస్ట్రేలియా 62 పరుగులు ఖాతాలో వేసుకుంది.

మూడో సెషన్ : అశ్విన్‌కు ఆరు వికెట్లు

టీ విరామం అనంతరం ఉస్మాన్ ఖవాజ (180) మారథాన్ ఇన్నింగ్స్‌కు తెర పడింది. అక్షర్ పటేల్ ఓవర్లో ఖవాజ ఎల్బీ అప్పీల్‌ను అంపైర్ తిరస్కరించాడు. సమీక్షకు వెళ్లిన భారత్ ఖవాజను డిఆర్ఎస్ సాయంతో పెవిలియన్‌కు చేర్చింది. ఖవాజ నిష్క్రమణతో ఆసీస్ కథ ముగిసిందని అనుకుంటే.. టెయిలెండర్లు తలనొప్పిగా మారారు. నాథన్ లయాన్ (34, 96 బంతుల్లో 6 ఫోర్లు), టాడ్ మర్ఫీ (41, 61 బంతుల్లో 5 ఫోర్లు) తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. లయాన్ క్రీజులో సౌకర్యవంతంగా కనిపించాడు. మర్ఫీ ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. ఈ ఇద్దరి కథకు తెరదించిన అశ్విన్.. ఆరు వికెట్ల ప్రదర్శన పూర్తి చేశాడు. 167.2 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది.

ఓపెనర్ల శుభారంభం : రెండో రోజు చివరి సెషన్‌లో సైతం పిచ్ నుంచి బౌలర్లకు ఎటువంటి అనుకూలత కనిపించలేదు. టీమ్ ఇండియా ఓపెనర్లు సహజంగానే స్వేచ్ఛగా, దూకుడుగా ఆడారు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (18 బ్యాటింగ్, 27 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) దూకుడు ప్రదర్శించాడు. నాథన్ లయాన్‌పై క్రీజు బయటకు వచ్చి భారీ సిక్సర్ బాదాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (17 బ్యాటింగ్, 33 బంతుల్లో 2 ఫోర్లు) సాధికారిక ప్రదర్శన చేశాడు. ఓపెనర్లు నిలకడగా రాణించటంతో తొలి ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లలో భారత్ 36 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : హెడ్ (సి) జడేజా (బి) అశ్విన్ 32, ఖవాజ (ఎల్బీ) అక్షర్ 180, లబుషేన్ (బి) షమి 3, స్మిత్ (బి) జడేజా 38, హ్యాండ్స్‌కాంబ్ (బి) షమి 17, కామెరూన్ (సి) భరత్ (బి) అశ్విన్ 114, అలెక్స్ (సి) అక్షర్ (బి) అశ్విన్ 0, స్టార్క్ (సి) అయ్యర్ (బి) అశ్విన్ 6, లయాన్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 34, మర్ఫీ (ఎల్బీ) అశ్విన్ 41, కునేమాన్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలటు : 15, **మొత్తం : (167.2 ఓవర్లలో ఆలౌట్) 480.**

వికెట్ల పతనం : 1-61, 2-72, 3-151, 4-170, 5-378, 6-378, 7-387, 8-409, 9-479, 10-480.

బౌలింగ్ : షమి 31-3-134-2, ఉమేశ్ 25-2-105-0, అశ్విన్ 47.2-15-91-6, జడేజా 35-5-89-1, అక్షర్ 28-8-47-1, అయ్యర్ 1-0-2-0.

భారత్ తొలి ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ బ్యాటింగ్ 17, శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ 18, ఎక్స్‌ట్రాలు : 1, **మొత్తం : (10 ఓవర్లలో) 36.**

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 3-1-7-0, కామెరూన్ గ్రీన్ 2-0-11-0, నాథన్ లయాన్ 3-0-14-0, మాథ్యూ కునేమాన్ 2-0-3-0.

వికెట్ల వేటలో మాయగాడు

టీమ్ ఇండియా ట్రంప్‌కార్డ్, ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరో ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాతో అహ్మదాబాద్ టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టిన అశ్విన్ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల ప్రదర్శనతో అశ్విన్ ఈ ఘనత సొంతం చేసుకున్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అశ్విన్ 28.10 సగటు, 2.71 ఎకానమీతో 113 వికెట్లు పడగొట్టాడు. ఈ ట్రోఫీలో అశ్విన్ అత్యుత్తమ గణాంకాలు 7/103. అహ్మదాబాద్ టెస్టులో అశ్విన్ 91 పరుగులకు 6 వికెట్లు పడగొట్టి మరో ఉత్తమ ప్రదర్శన చేశాడు. ట్రావిశ్ హెడ్ (32), కామెరూన్ గ్రీన్ (114), అలెక్స్ కేరీ (0), మిచెల్ స్టార్క్ (6), నాథన్ లయాన్ (34), టాడ్ మర్ఫీ (41) వికెట్లను అశ్విన్ ఖాతాలో వేసుకున్నాడు. ఆసీస్ స్పిన్నర్ నాథన్ లయాన్ సైతం 113 వికెట్లు పడగొట్టినా.. అతడు 26 మ్యాచుల్లో 31.92 సగటు, 3.09 ఎకానమీతో సాధించటంతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. భారత స్పిన్ దిగ్గజాలు అనిల్ కుంబ్లే (111), హర్భజన్ సింగ్ (95), రవీంద్ర జడేజా (85) ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. టాడ్ మర్ఫీ వికెట్‌తో ఐదు వికెట్ల ప్రదర్శన పూర్తి చేసిన అశ్విన్.. ఆ ఘనతను కెరీర్‌లో 32వ సారి సాధించాడు. స్వదేశంలో 26వ సారి ఐదు వికెట్ల ప్రదర్శనతో అనిల్ కుంబ్లే (25) రికార్డును అధిగమించాడు. తాజా సిరీస్‌లో 24 వికెట్లు కూల్చిన అశ్విన్.. వికెట్ల వేటలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

శ్రీలంక ముందంజ

- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 162/5



క్రైస్ట్‌చర్చ్ : న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో లంకేయులు కదం తొక్కుతున్నారు. బ్యాటర్ల సమిష్టి ప్రదర్శనలతో తొలి ఇన్నింగ్స్‌లో 355 పరుగుల భారీ స్కోరు సాధించిన శ్రీలంక.. పేసర్ల మెరుపులతో ఆతిథ్య జట్టుపై ఆధిపత్యం చెలాయిస్తోంది. పేసర్లు ఫెర్నాండో (2/42), లహిరు కుమార (2/34) నిప్పులు చెరగటంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 162/5తో ఎదురీదుతోంది. ఓపెనర్లు టామ్ లేథమ్ (67, 144 బంతుల్లో 7 ఫోర్లు), డెవాన్ కాన్వే (30, 88 బంతుల్లో 2 ఫోర్లు) తొలి వికెట్‌కు 67 పరుగులతో శుభారంభం అందించినా.. మిడిల్ ఆర్డర్‌ను లంక పేసర్లు వణికించారు. కేన్ విలియమ్సన్ (1), హెన్రీ నికోల్స్ (2), టామ్ బ్లండెల్ (7)లు స్వల్ప స్కోర్లకే నిష్క్రమించారు. డార్లీ మిచెల్ (40 బ్యాటింగ్, 89 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), మైకెల్ బ్రాస్‌వెల్ (9 బ్యాటింగ్) అజేయంగా ఆడుతున్నారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో మరో 193 పరుగుల వెనుకంజలో నిలిచింది.

నిధులు సమంగా పంచాలి!

- ఐసీసీకి ఎంసీసీ సూచన

దుబాయ్ : అంతర్జాతీయ క్రికెట్‌లో ఆరోగ్యకర వాతావరణం నెలకొల్పేందుకు నిధుల పంపకం సమంగా ఉండాలని ఎంసీసీ (ది మెర్లీబోన్ క్రికెట్ క్లబ్) సూచించింది. దుబాయ్‌లో సమావేశమైన ఎంసీసీ ప్రపంచ క్రికెట్ కమిటీ (డబ్ల్యూసీసీ) ఐసీసీకి సూచనలు చేసింది. సౌరవ్ గంగూలీ, అలస్టర్ కుక్, కుమార ధర్మసేన, జస్టిన్ లాంగర్, రమీజ్ రాజా, కుమార సంగక్కర, గ్రేమ్ స్మిత్‌లు హాజరైన ఈ సమావేశానికి మైక్ గాటింగ్ అధ్యక్షత వహించారు. ' ప్రపంచ క్రికెట్ ఇప్పుడు క్రాస్‌రోడ్స్‌కు చేరుకుందని డబ్ల్యూసీసీ ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ క్రికెట్, ఫ్రాంఛైజీ క్రికెట్ మధ్య ఆరోగ్యకర వాతావరణం ఉండేందుకు ఐసీసీ జోక్యం అవసరం. కొన్ని చోట్ల సంప్రదాయ టెస్టు క్రికెట్‌కు విపరీత ఆదరణ ఉండగా.. మరికొన్ని చోట్ల పరిస్థితి భిన్నంగా ఉంది. సంప్రదాయ టెస్టు క్రికెట్, ఆధునిక గ్లోబల్ ఫ్రాంఛైజీ క్రికెట్ కలిసి వృద్ధి చెందేందుకు తగిన చర్యలు అవసరమని' ఎంసీసీ డబ్ల్యూసీసీ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రపంచ క్రికెట్‌లో నిధులను సభ్య దేశాలకు సమానంగా పంచాలని సూచించిన కమిటీ.. అది ఏ రూపంలో, ఏ విధానంలో జరగాలనే అంశంలో స్పష్టత ఇవ్వలేదు.

నవచిత్రం



రాహుల్ రామకృష్ణ, నవ్యస్వామి

ప్రతి కుటుంబం చూడాల్సిన సినిమా

నరేష్, రాహుల్ రామకృష్ణ, నవ్య స్వామి, సురభి ప్రభావతి, గంగవ్వ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఇంటింటి రామాయణం'. ఈ చిత్రానికి సురేష్ నరెడ్ల దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ, మారుతి టీమ్ సమర్పణలో ఐవీవై ప్రొడక్షన్స్ నిర్మించిన కుటుంబ కథా చిత్రమిది. వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ యిన్నమూరి నిర్మాతలు. ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

ఈ నేపథ్యంలో చిత్ర బృందం శుక్రవారం విలేకర్ల సమావేశంలో చిత్ర విశేషాలను షేర్ చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, ' మొదట దీన్ని డిజిటల్ సినిమాగానే ప్రారంభించాం. అవుట్ పుట్ చూసిన తరువాత థియేటర్‌లో ఆడుతుందన్న నమ్మకంతో విడుదల చేస్తున్నాం. నా స్నేహితులు నిర్మాతలుగా పరిచయం అవుతున్న ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

'దర్శకుడు సురేష్ రాసుకున్న కథ ఇది ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యే కథ. ఇతర భాషల్లో విడుదల చేసినా ఈ సినిమాకి ఖచ్చితంగా ఆదరణ లభిస్తుంది. సినిమా చాలా బాగా వచ్చింది' అని దర్శకుడు మారుతి చెప్పారు.


'ప్రాంతాలకు, భేదాలకు భిన్నంగా ఉన్న సిసలైన కల్మషం లేని సినిమా ఇది. మన మనస్తత్వాలను, మన మనోభావాలను చాలా అలవోకగా, చాలా సులభంగా చూపిస్తూ మా నుంచి మంచి మంచి నటనను రాబట్టుకున్నారు దర్శకుడు' అని రాహుల్ రామకృష్ణ చెప్పారు.

నటి నవ్యస్వామి మాట్లాడుతూ, 'నా కల నిజమైన సమయం ఇది. టెలివిజన్‌లో చేస్తున్నప్పుడు సినిమాలు చేయాలి అనుకునేదానిని. ఇంతమంచి సినిమాలో అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. నన్ను నమ్మి నాకు ఈ అవకాశమిచ్చిన దర్శక,నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం నాకుంది' అని అన్నారు.

ఈ చిత్రాన్ని ఆహా ఒరిజినల్ ఫిల్మ్‌గా తీశాం. అయితే ఇంతమంచి సినిమాని ప్రేక్షకులకు థియేటర్ అనుభూతి కలిగిస్తే బాగుంటుందని వంశీ, మారుతి సూచించడంతో ఇది సాధ్యమైంది. ఇది ప్రతి కుటుంబం చూడాల్సిన సినిమా. కళ్యాణి మాలిక్, కాసర్ల శ్యామ్ చాలా మంచి పాటలు ఇచ్చారు. మట్టి వాసన నచ్చే ప్రతి ఒక్కరికీ నచ్చే సినిమా ఇది.

- దర్శకుడు సురేష్ నరెడ్ల

భీష్మ పర్వం మొదలైంది



చేతన్ చేను

'రాజు గారి గది', 'మంత్ర 2', 'విద్యార్థి', 'జెంటిల్‌మేన్ 2 ' ఫేమ్ చేతన్ చేను కథానాయకుడిగా నూతన దర్శకుడు ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'భీష్మ పర్వం'. ప్రేమ్ కుమార్, చేతన్ చేను నిర్మిస్తున్న ఈ చిత్ర పూజా కార్యక్రమం శుక్రవారం గ్రాండ్‌గా జరిగింది. ఈ పూజ కార్యక్రమానికి నిర్మాత బెక్కం వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. ఎర్రవెల్లి భాస్కర్, ఎర్రవెల్లి ప్రవీణ్, తరుణ్ భాస్కర్, జయశంకర్ కెమెరా స్విచ్ ఆన్ చేసారు. పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం రామోజీ ఫిలిం సిటీ దగ్గర్లో 40 అడుగుల కాళీ మాత సెట్ వేసి, వంద మంది ఫైటర్లతో భారీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. పీఎంకే ఇంటర్నేషనల్స్, చేతన్ చేను ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రోషిని సహెూతా కథానాయిక. అనూప్ శర్మ విలన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: విష్ణు విహారి, డీఓపీ: ఈశ్వర్ ఆదిత్య, ఎడిటర్: అమర్ రెడ్డి, లిరిక్స్: అనిరుధ్, ఆర్ట్: ఆనంద్, స్టంట్స్: జాషువా మాస్టర్.

సరికొత్త కాంబినేషన్




కమల్‌హాసన్, శింబు

శింబు కథానాయకుడిగా కమల్ హాసన్ రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ ఎస్‌టిఆర్48 చిత్రాన్ని అనౌన్స్ చేసింది. కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మించనున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం దేశింగ్ పెరియసామి.

'కన్నుమ్ కన్నుమ్ కొళ్లైయాడితాల్' విజయం తర్వాత పెరియసామి మరో అద్భుతమైన కథతో వస్తున్నారు. ఇది రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ 56వ ప్రొడక్షన్. కమల్ హాసన్ కథానాయకుడిగా, మణిరత్నం దర్శకత్వంలో కెహెచ్ 234, అలాగే రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన శివకార్తికేయన్, సాయి పల్లవి నటిస్తున్న సోనీ పిక్చర్స్‌తో పాటు ఆర్ఎఫ్ఐ51తో సహా అద్భుతమైన చిత్రాలు వరుసలో ఉన్నాయి.

ఈ సందర్భంగా దర్శకుడు, నిర్మాత కమల్ హాసన్ మాట్లాడుతూ, 'శ్రేష్టమైన చిత్రాలను అందించడం రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ లక్ష్యం. గత 40 ఏళ్లుగా మా సామర్థ్యాల మేరకు దీన్ని చేస్తున్నాం. మనలాంటి లక్ష్యాలను సాధించే వ్యక్తుల కోసం మేం ఒక వేదికను అందించాలనుకుంటున్నాం. పరిశ్రమలో విజయం సాధించడం మాకు చాలా ముఖ్యం. శింబు, దేశింగ్ పెరియసామి టీమ్‌కి ఆల్ ది బెస్ట్' అని చెప్పారు.

డబ్బులు తీసుకుని పొగుడుతున్నారా?



కె.రాఘవేంద్రరావు

ఆస్కార్ కోసం 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర బృందం రూ.80 కోట్లు ఖర్చు చేసిందని, ఆ బడ్జెట్ తాను కనీసం 8 సినిమాలు తీస్తానంటూ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేసిన వ్యాఖ్యలపై దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆర్‌ఆర్‌ఆర్' ఆస్కార్ ప్రమోషన్స్‌ను ఉద్దేశిస్తూ తమ్మారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ప్రపంచ వేదికపై మన తెలుగు సినిమా సత్తా చాటుతున్నందుకు గర్వపడాలన్నారు. సరైన సమాచారం లేకుండా ఖర్చుల గురించి ఎలా కామెంట్స్ చేస్తారని రాఘవేంద్రరావు ప్రశ్నించారు. 'తెలుగు సినిమా, సాహిత్యం, దర్శకుడు, నటీనటులకు మొదటిసారి ప్రపంచ వేదికలపై వస్తోన్న పేరు ప్రఖ్యాతులు చూసి గర్వపడాలి. అంతేకానీ రూ. 80 కోట్లు ఖర్చు అంటూ చెప్పడానికి మీ దగ్గర అకౌంట్స్ ఏమైనా ఉన్నాయా?, జేమ్స్ కామెరూన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి దిగ్గజ దర్శకులు డబ్బులు తీసుకుని మన సినిమా గొప్పతనాన్ని పొగుడుతున్నారని మీ ఉద్దేశమా?' అంటూ దర్శకేంద్రుడు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. తమ్మారెడ్డి వ్యాఖ్యలపై రాఘవేంద్రరావుతోపాటు నాగబాబు, ఇంకా పలువురు సినీ ప్రముఖులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



బాలకృష్ణ



శ్రీ లీల

బాలయ్య సరసన..!

నందమూరి బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఎన్‌బికె 108 వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, హరీష్ పెద్ది ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

వరుస హిట్లతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ఈ సినిమాలో చాలా కీలకమైన పాత్రను పోషిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్‌లో ఆమె జాయిన్ అయ్యారు.

ఈ సందర్భంగా శ్రీలీల, బాలకృష్ణ చేయి పట్టుకున్నట్టుగా ఉన్న ఓ స్టిల్‌ని మేకర్స్ విడుదల చేశారు మేకర్స్. ఈ షెడ్యూల్లో ప్రధాన తారాగణంపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మునుపెన్నడూ చూడని పాత్రలో బాలకృష్ణ నటిస్తున్నారు. సినిమాలో ఆయన డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. బాలకృష్ణ మార్క్ యాక్షన్, మాస్ ఎలిమెంట్స్, అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎలిమెంట్స్ ఉండబోతున్నాయి. బాలకృష్ణ గత రెండు సినిమాలకు సంగీతం అందించిన తమన్ ఈ చిత్రానికీ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, నిర్మాతలు: సాహు గారపాటి, హరీష్ పెద్ది, డీవోపీ: సి రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మి రాజు, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్ ఫైట్స్: వి వెంకట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.కృష్ణ.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.